
'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12 | వెల: ₹ 5.00

సంపుటి: 13 | సంచిక: 16

బుధవారం 8-4-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




## సూపర్ మూన్..

మంగళవారం రాత్రి భూమికి అత్యంత చేరువగా వచ్చి గుర్గావ్ వద్ద పెద్దదిగా, ప్రకాశవంతంగా దర్శనమిచ్చిన చంద్రుడు..

## ఒకరి నుంచి 406 మందికి



- భౌతిక దూరం పాటించకపోతే ఒక్కో కోవిడ్ బాధితుడు నెలరోజుల్లో కనీసం 406 మందికి వ్యాధిని అంటిస్తాడని ఐసీఎంఆర్ అధ్యయనంలో తేలింది. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రెటరీ లవ్ అగర్వాల్ తెలిపారు. భౌతిక దూరం పాటించినట్లైతే 75 శాతం వరకు నియంత్రించవచ్చని వివరించారు. - 8లో

## ఐసీయూలో బ్రిటన్ ప్రధాని జాన్సన్



- కరోనాతో బాధపడుతున్న బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ పరిస్థితి నిలకడగా ఉంది. లండన్ ఆస్పత్రిలో ఐసీయూలో ఉంచి ఆయనకు చికిత్స అందిస్తున్నారు. వెంటిలేటర్ సాయం అవసరం ఆయనకు లేదని ప్రధాని కార్యాలయం మంగళవారం వెల్లడించింది. జాన్సన్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, ఆయనలో ఎలాంటి న్యుమోనియా లక్షణాలు కనిపించలేదని తెలిపింది. కాగా 'ప్రధాని జాన్సన్.. మీరు ఆస్పత్రి నుంచి బయటకు వచ్చి, సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షిస్తున్నా' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. - 8లో

# లాక్‌డౌన్‌పై ఏం చేద్దాం?

### సీనియర్ ఐఏఎస్‌లకు, కలెక్టర్లకు ఢిల్లీ నుంచి ఫోన్లు.. లాక్‌డౌన్ ఇంకొన్నాళ్లు ఉండాల్సిందేనన్న అధికారులు

### ఓపిక పట్టకుంటే మళ్లీ మొదటికే..

### 'మర్కజ్'తో పరిస్థితి తారుమారని వెల్లడి!

సాక్షి, హైదరాబాద్

కరోనా వైరస్ కట్టడికి ఇప్పుడు దేశవ్యాప్తంగా అనుసరిస్తోన్న లాక్‌డౌన్‌ను కొనసాగించాలా? ఎత్తివేయాలా? మరేదైనా ప్రత్యామ్నాయం ఉందా? అనే దానిపై కేంద్ర ప్రభుత్వం అభిప్రాయాలు తీసుకుంటోంది. అందులో భాగంగా ప్రధాని కార్యాలయ వర్గాల ఆదేశాలతో రాష్ట్రంలోని పలువురు సీనియర్ ఐఏఎస్‌లకు, కలెక్టర్లకు ఢిల్లీ నుంచి ఫోన్లు వచ్చాయి. దాదాపు అందరూ లాక్‌డౌన్‌ను ఇంకొన్నాళ్లు కొనసాగించాలని చెప్పినట్లు తెలిసింది. అలాగైతేనే కరోనా వైరస్‌ను పూర్తిగా నిరోధించగలమని రాష్ట్రానికి చెందిన అధికారులు వెల్లడించినట్లు తెలిసింది. 'కరోనా కేసుల సంఖ్య ఇంకా ఆగలేదు. ముమ్ముందు పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడంలేదు. కేసుల సంఖ్య తగ్గకుండా, లాక్‌డౌన్‌ను ఎత్తివేస్తే పరిస్థితి మళ్లీ మొదటికొస్తుంది'అని ఢిల్లీ వర్గాలకు చెప్పినట్లు ఒక అధికారి వ్యాఖ్యానించారు.



**'మర్కజ్'తో పెరిగిన కేసులు**

కరోనా పూర్తిస్థాయి నియంత్రణకు ముమ్ముందు ఎలాంటి వైఖరి అనుసరించాలన్న దానిపై కేంద్రం మల్లగుల్లాలు పడుతోంది. ఈనెల 14తో లాక్‌డౌన్ దేశవ్యాప్తంగా పూర్తికానుంది. కానీ ఇప్పటికీ దేశంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మరణాలూ ఆగడంలేదు. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్ ఎత్తివేయాలా?, లేకుంటే కేసులు ఎక్కువగా నమోదైన చోట్ల హాట్‌స్పాట్లను ఏర్పాటుచేసి, అక్కడ లాక్‌డౌన్‌ను కొనసాగించి, మిగిలిన ప్రాంతాల్లో దశలవారీగా ఎత్తివేస్తే ఎలా ఉంటుంది? అనే దానిపై ఢిల్లీ వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్రానికి చెందిన అధికారులు తెలంగాణలో ఉన్న పరిస్థితిని కేంద్రానికి మిగతా 2వ పేజీలో ▶

## కేంద్రం సమాలోచనలు..

- లాక్‌డౌన్‌పై ముఖ్యమంత్రులు, నిపుణుల సూచనల పరిశీలన
- ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని, ఊహాగానాలు వద్దని స్పష్టీకరణ
- మత ప్రదేశాల్లో కార్యకలాపాలపై మే 15 వరకు ఆంక్షలు
- విద్యా సంస్థల మూసివేతే.. మంత్రుల బృందం సిఫారసు

- వివరాలు 8లో

| ప్రపంచ వ్యాప్తంగా.. | అమెరికాలో.. | భారత్‌లో.. |
|---|---|---|
| 14,11,098 ఇప్పటివరకు నమోదైన కేసులు | 3,86,571 కరోనా బాధితుల సంఖ్య | 4,789 కరోనా బాధితులు.. |
| 81,044 కరోనాతో మృతి చెందినవారు | 12,274 వైరస్‌తో ఇప్పటివరకు మృతి చెందినవారు.. | 124 వైరస్‌తో ఇప్పటివరకు మృతి చెందినవారు.. |

## దేశ అవసరాలు తీరాకే!

### హైడ్రాక్సీ క్లోరోక్విన్, పారాసిటమాల్ ఎగుమతులపై కేంద్రం..

- మందుల ఎగుమతులపై ఆంక్షలు సడలింపు
- పరిస్థితులనుబట్టి ఆయా దేశాలకు ప్రాధాన్యం
- విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టీకరణ
- ఇవ్వకుంటే ప్రతిచర్యలుంటాయన్న ట్రంప్

- వివరాలు 8లో

# మరో 40 పాజిటివ్



### రాష్ట్రంలో 404 కరోనా కేసులు

- 23 రోజుల పసికందుకూ సోకిన వైరస్
- ఇప్పటివరకు 45 మంది డిశ్చార్జి.. మొత్తం 11 మంది మృతి
- వివిధ ఆస్పత్రుల్లో 348 మందికి చికిత్స
- హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్ అర్బన్ జిల్లాల్లో అధిక కేసులు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో మంగళవారం మరో 40 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 404కి చేరింది. ఇందులో 23 రోజుల పసికందు కూడా ఉండటం గమనార్హం. ప్రస్తుతం 348 మంది కరోనాతో చికిత్స పొందుతుండగా.. ఇప్పటివరకు 45 మంది వ్యాధి నయమై ఆస్పత్రి డిశ్చార్జి అయ్యారు. 11 మంది ప్రాణాలు కోల్పోయారు. కరోనా పాజిటివ్ వచ్చివారిలో ఎక్కువ మంది ఢిల్లీ మర్కజ్‌తో సంబంధం ఉన్నవారే. తాజాగా నమోదైన 40 కేసులు కూడా మర్కజ్‌తో సంబంధం కలిగినవేనని ఆరోగ్యశాఖ తన బులిటెన్‌లో తెలిపింది. వైరస్ జన సమూహంలోకి ఇంకా వెళ్లలేదని పేర్కొంది. మర్కజ్ నుంచి వచ్చినవారు, వారితో కలిసిమెలిసి తిరిగినవారిని గుర్తించి పరీక్షలు చేస్తున్నామని, పాజిటివ్ వచ్చినవారికి చికిత్స చేస్తున్నామని ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు ఆ బులిటెన్‌లో వివరించారు. పాజిటివ్ కేసులు నమోదైన జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో కంటైన్మెంట్ ప్రణాళికను అమలుచేస్తున్నట్టు చెప్పారు. ఆరు ల్యాబ్‌లు 24 గంటలూ కరోనా పరీక్షలు చేస్తున్నాయని తెలిపారు. కాగా, మర్కజ్ లింకు ఉన్నవారికి సంబంధించి మరో 900 మంది ఫలితాలు రావాల్సి ఉందని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. మరో 15 రోజుల్లో కేసులు పూర్తిగా తగ్గిపోతాయని వైద్యాధికారులు భావిస్తున్నారు.

**హైదరాబాద్‌లోనే ఎక్కువ కేసులు...**

ఇప్పటివరకు అత్యధికంగా హైదరాబాద్‌లోనే 178మందికి కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అందులో 21 మంది డిశ్చార్జి కాగా, ఏడుగురు మరణించారు. 150 మంది చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఒక్క రోజే నగరంలో ఏకంగా 17 కేసులు నమోదయ్యాయి. అలాగే నిజామాబాద్ జిల్లాలోనూ ఒక్క రోజే 10 కేసులు నమోదయ్యాయి. దీంతో అక్కడ కేసుల సంఖ్య 37కు చేరింది. అందులో ఒకరు చనిపోయిన సంగతి తెలిసిందే. వరంగల్ అర్బన్ జిల్లాలో 24 కేసులు నమోదయ్యాయి. సోమవారం గద్వాలలో ఏకంగా 13 కేసులు నమోదు కాగా, మంగళవారం ఆ సంఖ్య 22కి చేరింది. మహబూబ్‌నగర్ జిల్లాలోనూ మిగతా 2వ పేజీలో ▶

**23 రోజుల పసికందుకు కరోనా..**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీకే రెడ్డి కాలనీకి చెందిన 23 రోజుల పసికందుకు కరోనా పాజిటివ్ వచ్చిందని మహబూబ్‌నగర్ కలెక్టర్ వెంకట్రావ్ తెలిపారు. శిశువు తండ్రి మార్చి 23న మర్కజ్ నుంచి ఇంటికివి వచ్చారు. అప్పట్నుంచి కరోనా లక్షణాలతో బాధ పడుతుండటంతో వైద్యులు ఆయన్ను అదే నెల 28న గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఏప్రిల్ 2న అతడికి వైరస్ సోకినట్లు తేలింది. దీంతో అధికారులు వెంటనే ఆయన భార్యతో పాటు 23 రోజుల శిశువును క్వారంటైన్‌లో ఉంచారు. మూడు రోజుల తర్వాత శిశువుకు దగ్గు రావడంతో వెంటనే వైద్యులు నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని నిర్ధారణ కేంద్రానికి పంపారు. ఆ పరీక్షల్లో పసికందుకు పాజిటివ్ రాగా, తల్లికి నెగిటివ్ వచ్చింది.

## అమెరికాలో భారతీయుల అవస్థలు

అమెరికాలోని భారత జాతీయులు కరోనా కారణంగా భయంభయంగా గడుపుతున్నారు. ఇంటి నుంచి బయటికొస్తే వైరస్ ఎక్కడ సోకుతుందో అన్న ఆందోళనలో ఉన్నారు. భారతీయ సీనియర్ జర్నలిస్టు బ్రహ్మ కూచిబొట్ల వైరస్‌తో మృతి చెందడంతో వారిలో భయం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో పలు సంఘాలు కరోనా బారిన పడిన వారెందరో తెలుసుకునే పనిలో పడ్డాయి. - 2లో

## టాప్ 25లో మన డీజీపీ



- కరోనా మహమ్మారిపై మన పోలీసులు పోరాడుతున్న వేళ రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. పనితీరుతో అత్యుత్తమ ఫలితాలు సాధించిన దేశంలోని 25మంది ఐపీఎస్ అధికారుల జాబితాలో ఆయనకు 8వ స్థానం దక్కింది. 'ఫేమ్ ఇండియా, ఆసియా పోస్ట్, పీఎస్‌యూ వాచ్' అధ్యయనం చేసి ఈ జాబితా రూపొందించాయి. ఇందులో ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ అర్వింద్ కుమార్ , రీసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్ (రా) చీఫ్ సమత్‌కుమార్ గోయల్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ డీజీ ఎస్ఎస్ దేశ్వాల్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. - 2లో






# ఆశలు లాక్‌డౌన్

- గోనె సంచుల తయారీకి 'నో'చెప్పిన పశ్చిమబెంగాల్
- ధాన్యం సేకరణకు 20కోట్ల సంచులు అవసరం
- రేషన్‌డీలర్లు, మిల్లర్ల నుంచి పాత సంచుల స్వాధీనం
- 'డీలర్ల' సంచుల ధర రూ.16 నుంచి రూ.18కి పెంపు
- సేకరణ ప్రక్రియను ప్రారంభించిన పౌరసరఫరాల శాఖ

సాక్షి, హైదరాబాద్

ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను సమకూర్చడంలో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం చేతులెత్తేసింది. జనపనారతో తయారుచేసే గోనె సంచుల మిల్లులను లాక్‌డౌన్ గడువుకు ముందే తిరిగి ఆరంభించడానికి నిరాకరిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది మన రాష్ట్రానికి నిరాశ మిగిల్చింది. దీంతో అప్రమత్తమైన పౌరసరఫరాల శాఖ రాష్ట్రంలోని రేషన్‌డీలర్లు, రైస్‌మిల్లర్ల వద్ద ఉన్న పాత గోనె సంచులను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని, ఒక్క గోనె సంచి కూడా బయటకు వెళ్లకుండా యుద్ధ ప్రాతిపదికన సేకరించాలని నిర్ణయించింది.

**కేంద్ర, రాష్ట్రాల వినతులకు బెంగాల్ 'నో'**

జనపనార బస్తాల కొరతతో రైతుల ఉత్పత్తుల సేకరణ దెబ్బతింటోందని, కాబట్టి సంచులు సమకూర్చాలని తెలంగాణ, పంజాబ్‌తో పాటు కేంద్ర ఆహారసంస్థ (ఎఫ్‌సీఐ) కొన్నిరోజులుగా పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. దీనిపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రధాని మోదీతో పాటు మిగతా 2వ పేజీలో ▶




## ఇదం జగత్



ఈ టైంలో బ్రతిమాలుకుంటేనే బతుకుతాం సార్! తర్వాత ప్రతీకారానికి చాన్సే ఉండదు!






సోమవారం సీఎం కేసీఆర్‌కు రూ.కోటి చెక్కును అందజేస్తున్న జీఎంఆర్ గ్రూప్ సంస్థ డైరెక్టర్ చల్లా ప్రసన్న. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, గంగుల కమలాకర్

# సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళాల వెల్లువ

**సాక్షి, హైదరాబాద్:** కరోనాను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతుగా మంగళవారం పలువురు దాతలు ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్)కు విరాళాలు అందజేశారు.

- కరీంనగర్ గ్రానైట్ వ్యాపారులు మొత్తం రూ.75 లక్షల రూపాయల నగదు, రూ.1కోటి విలువైన మందులు, వైద్య పరికరాలను విరాళంగా ప్రకటించారు. ఇందులో కరీంనగర్ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ రూ.50 లక్షల చెక్కును సంస్థ ప్రతినిధులు పొన్నంనేని గంగాధర్‌రావు, ప్రెసిడెంట్ శ్రీధర్ ముఖ్యమంత్రికి అందించారు.
- మార్వాడీ గ్రానైట్ ఫ్యాక్టరీస్ అసోసియేషన్ తరపున రూ.25 లక్షల చెక్కును ఆ సంస్థ యజమానులు గోపీ మహేశ్వరి, రాజేశ్ అగర్వాల్, ముఖేశ్ పర్వాల్ ముఖ్యమంత్రికి అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు గంగుల కమలాకర్, ఈటల రాజేందర్ పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్‌కు మరో రూ.6.80 కోట్ల విరాళాలు

- ప్రగతిభవన్ లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుకు రూ.6.80 కోట్ల విలువ చేసే చెక్కులను 25 మంది దాతలు అందజేశారు.
- మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో విజ్ రియల్టర్స్ కోటి రూపాయల చెక్కును అందజేసింది. టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌సైరా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో పెన్నా సిమెంట్స్, రత్నదీప్ ప్రైవేటు లిమిటెడ్ రూ.1 కోటి చొప్పున చెక్కులను సీఎంఆర్‌ఎఫ్‌కు అందజేశారు.
- సుజన చారిటబుల్ ట్రస్టు రూ.50 లక్షలు రాజ్యసభ ఎంపీ సుజనా చౌదరి సీఎం సహాయ నిధి పేరిట కేటీఆర్‌కు చెక్కును అందజేశారు. దొడ్ల డెయిరీ లిమిటెడ్, ఫిలింనగర్ కల్చరల్ సెంటర్, వశిష్ట కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్, గాయత్రి గ్రానైట్స్ రూ.25 లక్షల చొప్పుల విరాళం అందజేశాయి. అగ్రసేన్ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ రూ.21 లక్షలు, నీరూస్ ఎన్‌సెంబుల్స్ రూ.20 లక్షలు, రిజెనెసిస్ ఇండస్ట్రీస్ రూ.10లక్షలు అందజేసింది.
- హైదరాబాద్‌లోని పీఓటీ మార్కెట్‌లో వృత్తి పనిచేసే స్వర్ణ కారులు 39 మంది రూ.7.32లక్షల చెక్కులను మంత్రి కేటీఆర్‌కు అందజేశారు.
- రెండు తెలుగు రాష్ట్రాల సీఎం సహాయ నిధికి సీనియర్ సంపాదకులు ఏబీకే ప్రసాద్ విరాళం అందజేశారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు రూ.50వేల చొప్పున విరాళాన్ని చెక్కు రూపంలో పంపించారు.

### ఫ్రీడం ఆయిల్ రూ.2.5కోట్ల విరాళం



మంత్రులు కేటీఆర్, ఈటలకు చెక్కు ఇస్తున్న జీఈఎఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అక్షయ్‌చౌదరి. చిత్రంలో ఫ్రీడమ్ మార్కెటింగ్ వైఎస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి

- ఫ్రీడం హెల్తీ కుకింగ్ ఆయిల్స్ తయారీదారు జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (జీఈఎఫ్ ఇండియా) సీఎం సహాయ నిధికి రూ.50 లక్షల చెక్కును అందజేసింది. కరోనాపై కేంద్రం, రాష్ట్రాలు జరుపుతున్న పోరాటానికి సంఘీభావంగా ఇప్పటివరకు రూ.2.5 కోట్ల విరాళాన్ని అందజేసినట్లు సంస్థ ఎండీ ప్రదీప్ చౌదరి ప్రకటించారు.

# వైద్య సిబ్బందికి 10 శాతం అదనపు వేతనం

- జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండబ్ల్యూఎస్, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామపంచాయతీల సిబ్బందికి నగదు ప్రోత్సాహకం
- ఉత్తర్వులు విడుదల



**సాక్షి, హైదరాబాద్:** విపత్కర సమయంలో చెమటోడ్చి ప్రజల ఆరోగ్యం కోసం కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య ఆరోగ్య శాఖలోని రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పూర్తి వేతనం/గౌరవవేతనంలో 10 శాతం ప్రోత్సాహకం ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. వీరితో పాటు జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, రెగ్యులర్ పారిశుద్ధ్య సిబ్బందికి రూ.7,500, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై, సీవరేజి బోర్డులోని రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ వాటర్ సప్లై లైన్‌మన్‌లు, పారిశుద్ధ్య సిబ్బందికి రూ.7,500, జీహెచ్‌ఎంసీ మినహా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.5,000, రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య సిబ్బంది, మల్టీపర్పస్ వర్కర్లకు రూ.5,000 చొప్పున నగదు ప్రోత్సాహకం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. మార్చి నెలలో విధులు నిర్వహించిన సిబ్బందికి మాత్రమే ఈ ప్రోత్సాహకం వర్తిస్తుందని, వివిధ కారణాల వల్ల ఆయా శాఖల్లో సస్పెండ్ అయిన ఉద్యోగులు, అధికారిక, అనధికారిక సెలవుల్లో ఉన్న వారికి ఈ ప్రోత్సాహకాలు వర్తించబోవని స్పష్టం చేశారు.

**వేతనాల్లో కోత ‘కట్’:** జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది, హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఉద్యోగులు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామపంచాయతీల పారిశుద్ధ్య సిబ్బందికి మార్చి నెల వేతనంలో 10 శాతం వాయిదా వేసే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ మేరకు మంగళవారం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గతంలో విడుదల చేసిన ఉత్తర్వులకు సవరణలు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

### హోం క్వారంటైన్‌లను సమీపిస్తే సెల్‌ఫోన్ అలర్ట్

**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్ మహమ్మారి కోరలు చాచిన వేళ.. జనాలు భయంభయంగా సంచరించాల్సి వస్తోంది. ఇలాంటి భయాల్ని దూరం చేసేందుకు తెలంగాణ పోలీసులు హాక్ ఐ యాప్‌లో క్వారంటైన్ ఏరియా అలర్ట్ పేరుతో మరో కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. హోం క్వారంటైన్‌లో ఉన్న వారు 50 మీటర్ల దూరంలో ఉండగానే.. హాక్ ఐ యాప్ ద్వారా సెల్‌ఫోన్‌కు అలర్ట్ వచ్చేస్తుంది. హోం క్వారంటైన్ ఉన్న దాదాపు 25 వేలమంది ఇళ్లను పోలీసులు జియో ట్యాగింగ్ చేసిన విషయం తెలిసిందే. ఈ వివరాలన్నీ పోలీసులు వాడే టీఎస్ కాప్‌కు గతంలో అనుసంధానించారు. ఇపుడవే వివరాలను సామాన్య ప్రజలు వినియోగించే హాక్ ఐకి జోడించారు. దీని వల్ల హోం క్వారంటైన్‌లో ఉన్న వారి వివరాలు వెంటనే తెలిసిపోతాయి.

# విచ్చలవిడి పరీక్షలతో భయాందోళన

- అందుకే ప్రైవేటు సెంటర్లకు అనుమతి ఇవ్వడం లేదు
- జాతీయ మీడియాతో మంత్రి కేటీఆర్

**సాక్షి, హైదరాబాద్:** కరోనా పరీక్షల కోసం విచ్చలవిడిగా అనుమతులు ఇస్తే ప్రైవేటు డయాగ్నొస్టిక్ సెంటర్లు ప్రజలను భయాందోళనకు గురి చేసే అవకాశముందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. అందుకే అనుమతులు ఇవ్వకుండా కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు. కరోనా కట్టడికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మంగళవారం కేటీఆర్ జాతీయ మీడియాతో మాట్లాడారు. కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు లాక్‌డౌన్ కొనసాగింపే సరైన విధానమన్నారు. లాక్‌డౌన్‌లో పేదలు, వలస కార్మికుల సంక్షేమం విషయంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని తెలిపారు.

**లాక్‌డౌన్ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నాం..**
లాక్‌డౌన్ పరిస్థితులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని, ఆకలి చావులు ఉండకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు కేటీఆర్ వెల్లడించారు. 3 దశల్లో కరోనా వైరస్‌ను ఎదుర్కోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. అవసరమైన వైద్య సామగ్రిని సమకూర్చుకోవడంతో పాటు, 15 వేల పడకలను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

**ప్రత్యేక ఆస్పత్రి పనుల పరిశీలన..**
హైదరాబాద్ గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ అథారిటీ కాంప్లెక్స్‌ను కరోనా ప్రత్యేక ఆస్పత్రిగా మార్చేందుకు జరుగుతున్న పనులను మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్ పరిశీలించారు. ఈనెల 15లోపు ఆస్పత్రిని సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కేటీఆర్, ఈటల మొయినాబాద్ మండలంలోని భాస్కర మెడికల్ ఆస్పత్రిలో క్వారంటైన్ సెంటర్‌ను పరిశీలించారు.



హైదరాబాద్ గచ్చిబౌలిలోని కరోనా ప్రత్యేక ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న మంత్రులు కేటీఆర్, ఈటల తదితరులు

# అమెరికాలో భారతీయుల అవస్థలు

(సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

అమెరికాలోని భారత జాతీయులు కరోనాతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి నుంచి కాలు బయట పెట్టేందుకు జంకుతున్నారు. విధిలేని పరిస్థితిలో నిత్యావసర వస్తువులకు బయటకు వెళ్లిన ప్రతి ఇద్దరిలో ఒకరు కరోనా బారిన పడుతున్నారు. కచ్చితమైన లెక్కలు లేకపోయినా దాదాపు 100 మంది దాకా భారత జాతీయులు ఈ వ్యాధి బారిన పడి మరణించి ఉంటారని అమెరికాలో భారత సంఘాలు చెబుతున్నాయి. న్యూయార్క్‌లో స్థిరపడి ఆ దేశ పౌరసత్వం తీసుకున్న వారే అందులో ఎక్కువగా ఉన్నారని, న్యూజెర్సీకి చెందిన ఓ పాతిక మంది దాకా ప్రాణాలు విడిచారని తెలుస్తోంది. అమెరికాలో సీనియర్ జర్నలిస్టుగా పని చేస్తున్న బ్రహ్మ కూచిబొట్ల రెండు రోజుల క్రితం న్యూయార్క్ ఆస్పత్రిలో చనిపోయారు. అమెరికాలో భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులు ఎదుర్కొంటున్న సమస్యలపై కనీస శ్రద్ధ పెట్టడం లేదని భారతీయులు వాపోతున్నారు. న్యూజెర్సీలో ఓ కుటుంబానికి చెందిన (కర్ణాటక) తండ్రి, కొడుకు కరోనా బారిన పడి చనిపోవడంతో ఇంట్లో ఉన్న అత్తా కోడలు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు. కరోనా భయంతో వారిని పరామర్శించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం అక్కడి భయానక పరిస్థితికి అద్దం పడుతోంది.

- కరోనా ధాటికి భయంభయంగా గడుపుతున్న వైనం
- ఇంటి నుంచి బయటకు అడుగు పెడితే కరోనా పాజిటివ్
- ఎంత మంది భారతీయులు కరోనా బారిన పడ్డారో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్న సంఘాలు



**వారం సరుకులు నెల వరకూ..**
న్యూజెర్సీలో భారతీయులు, మరీ ముఖ్యంగా తెలుగు ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. వారం రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులను నెల రోజులు వాడకునేందుకు వీలుగా పొదుపు చేసుకుంటున్నారు. వేర్వేరు రాష్ట్రాల్లో ఉంటున్న తెలుగు వారు కమ్యూనిటీలుగా ఏర్పడి వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని క్షేమ సమాచారాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. ‘రోజూ నలుగురో ఐదుగురో కరోనా బారిన పడుతున్నారు. వారికి సహాయం చేసే స్థితిలో లేకపోవడం మాకు శోకాన్నే మిగులుస్తోంది. పిల్లలు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వ్యాధిని నియంత్రించడానికి అమెరికా తీసుకుంటున్న చర్యలు శూన్యం. ఈ దేశానికి ఎందుకు వచ్చాం దేవుడా అని రోజుకు పది సార్లు అనుకోవాల్సి వస్తోంది’అని న్యూజెర్సీలో నివాసం ఉంటున్న కంచరకుంట్ల సుధీర్‌రెడ్డి ‘సాక్షి’ప్రతినిధితో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. న్యూజెర్సీలోని హడ్సన్ కౌంటీలో దాదాపు 50 వేల మంది భారతీయులు ఉండగా వారిలోనూ 25 నుంచి 30 వేల మంది తెలుగు వారేనని సుధీర్ అన్నారు.

**ఏపీఐ మాజీ అధ్యక్షుడు సైతం..**
అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆర్జిన్ (ఏఏపీఐ) మాజీ అధ్యక్షుడు ఇప్పుడు కరోనా బారిన పడి ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నారు. నిత్యావసర వస్తువుల కోసం బయటకు వెళ్లిన ప్రతి ఇద్దరిలో ఒక్కరు కరోనా పాజిటివ్‌తో బాధపడుతున్నారు. ‘గత శుక్రవారం నేనూ, మా కమ్యూనిటీలోఉండే మరో నలుగురం వేర్వేరు కార్లలో కాస్ట్‌కోకు వెళ్లాం. అక్కడి నుంచే మరో ఇండియన్ స్టోర్‌కు కూడా వెళ్లాం. మేమంతా ఇప్పుడు కరోనా లక్షణాలతో బాధపడుతున్నాం. మా ఐదుగురిలో ముగ్గురికి పాజిటివ్ వచ్చింది. మిగిలిన ఇద్దరం ఇప్పుడు క్వారం టైన్‌లో ఉన్నాము’ అని విశాఖపట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు.

**టెక్సాస్, కాలిఫోర్నియా, ఆరిజోనా రాష్ట్రాల్లోనూ..**
భారతీయులు ఎక్కువగా నివసించే టెక్సాస్, కాలిఫోర్నియా, ఆరిజోనా రాష్ట్రాల్లోనూ వేగంగా కేసులు పెరుగుతున్నాయి. ‘మా కళ్ల ముందే అనేక మంది కరోనా బారిన పడుతున్నారు. ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాము’అని రాజేంద్ర డిచ్‌పల్లి అన్నారు. భారతీయ సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రేటర్ వాషింగ్టన్, న్యూయార్క్ మెట్రోపాలిటన్, మేరీల్యాండ్‌కు చెందిన అనేక మంది కమ్యూనిటీ లీడర్లు కరోనా బారినపడ్డారు. వీరిలో మెజారిటీ వారి ఇళ్లలోనే సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉన్నారు. హూస్టన్‌కు చెందిన భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రోహన్ బవదేకర్ మృత్యువుతో పోరాటం చేస్తున్నారు. ఆయన చికిత్స కోసం స్నేహితులు 2.04 లక్షల డాలర్లను సేకరించారు. మియామీలోని కార్డియాక్ ప్రివెంటివ్ కేర్ అండ్ రీసెర్చ్ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ముకుల్ ఎస్.చంద్ర వెంటిలేటర్ సాయంతో చికిత్స పొందుతున్నారు. ఆయన మృత్యువు నుంచి బయటపడేందుకు ప్లాస్మా దోనర్ కోసం వాట్సాప్ గ్రూపుల్లో వినతులు చేస్తున్నారు.

# టాప్‌-25లో మన డీజీపీ



## డీజీపీ మహేందర్‌రెడ్డికి అరుదైన గౌరవం

- ఉత్తమ పోలీసింగ్‌తో అత్యుత్తమ ఫలితాల సాధన
- ఫేమ్ ఇండియా, ఆసియా పోస్ట్, పీఎస్‌యూ వాచ్ అధ్యయనంలో వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ పోలీసు బాస్ డీజీపీ మహేందర్‌రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. దేశంలో తమ పనితీరుతో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 25 మంది ఐపీఎస్ అధికారుల జాబితాలో ఆయనకు చోటుదక్కింది. ‘ఫేమ్ ఇండియా, ఆసియా పోస్ట్, పీఎస్‌యూ వాచ్’ మీడియా సంస్థలు సంయుక్తంగా అధ్యయనం చేసి ఈ జాబితా రూపొందించాయి. ఇందులో 1984 బ్యాచ్‌కు చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ అర్వింద్ కుమార్ , రీసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్ (రా) చీఫ్ సమత్‌కుమార్ గోయల్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ డీజీ ఎస్‌ఎస్ దేశ్వాల్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఆ తరువాత స్థానాల్లో వరుసగా సీఆర్‌పీఎఫ్ డీజీ మహేశ్వరి, ఎన్‌ఎస్‌జీ చీఫ్ అనూప్‌కుమార్‌సింగ్, ఢిల్లీ సీపీ ఎస్‌ఎన్ సిన్హా, బిహార్ డీజీపీ గుప్తేశ్వర్ పాండే, తెలంగాణ రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి (8వ స్థానం) ఉన్నారు.

**దేశంలోని టాప్‌-25 ఐపీఎస్‌ల జాబితాలో 8 వ స్థానం**

**25 అంశాల ఆధారంగా..**
మెరుగైన పనితీరుతో సమాజంలో మార్పునకు కృషిచేసిన ఐపీఎస్ అధికారుల గుర్తింపునకు ఈ సంస్థలు అధ్యయనం చేశాయి. ఇందుకోసం 1995కు ముందు బ్యాచ్‌ల్లోని 4వేల మంది ఆఫీసర్ల పనితీరును మదించి, వడపోశాయి. ఈ అధికారుల తొలి పోస్టింగ్ నుంచి ఇప్పటి వరకు వారి పనితీరు, విధి నిర్వహణలో నిబద్ధత, అంకితభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నాయి. ఇంకా, ఆయా అధికారులపై వివిధ ఏజెన్సీలు రూపొందించిన అంతర్గత నివేదికలు, మీడియా కథనాలు, ఇతర సమాచారం ఆధారంగా 25 అంశాలకు ప్రాధాన్యమిస్తూ టాప్–200 జాబితాను తయారు చేశాయి. దీనిని మళ్లీ మదిస్తూ.. నేరాల కట్టడిలో ఈ అధికారుల పాత్ర, నిజాయతీ, నిష్పక్షపాతంగా విధి నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకున్న చర్యలు, ఫ్రెండ్లీ పోలీసింగ్, దార్శనికత, రెస్పాన్సిబిలిటీ వంటివి ఆధారంగా 25 మంది ఐపీఎస్ అధికారులతో తుది జాబితా రూపొందించాయి. ఈ జాబితాను పీఎస్‌యూ వాచ్ వెబ్‌సైట్ మంగళవారం ప్రచురించింది. ఈ జాబితాలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 1986 బ్యాచ్‌కు చెందిన డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డికి 8వ స్థానం దక్కింది.

**ఇది తెలంగాణ పోలీస్‌కు దక్కిన గుర్తింపు**

దేశవ్యాప్తంగా ఉన్న ఐపీఎస్ అధికారులపై జరిగిన సర్వేలో 25 మంది జాబితాలో నాకు చోటుదక్కడం సంతోషం. కానీ, ఇది నా ఒక్కడితోనే సాధ్యం కాలేదు. మొత్తం తెలంగాణ పోలీసు సిబ్బందికి ఈ గౌరవం దక్కుతుంది. డిపార్ట్‌మెంటులోని హోంగార్డు నుంచి ఐపీఎస్ అధికారి వరకు అందరి సంకల్పం, పట్టుదల ఈ గుర్తింపు రావడానికి దోహదపడ్డాయి. తెలంగాణ సమాజం కూడా పోలీసులకు ఎంతగానో సహకరిస్తోంది. అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది.

– ఎం.మహేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర డీజీపీ

**ఉత్తమ పోలీసింగ్‌తో అందరికీ ఆదర్శంగా..**

డీజీపీ మహేందర్‌రెడ్డి హయాంలో చేపట్టిన పోలీసింగ్, సంస్కరణలు ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. షీటీమ్స్, విమెన్ సేఫ్టీవింగ్, వర్టికల్ విధానంలో మార్పులు, పాపిలాన్ తరహా సాఫ్ట్‌వేర్, పాస్‌పోర్టు ఎంక్వైరీలో వేగం, నక్సలిజం పీచమణచడం, సీసీ కెమెరాల ఏర్పాటు, ఫ్రెండ్లీ పోలీసింగ్, ఠాణాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ల సాధన, టెక్నాలజీ వినియోగం వంటి విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టారు. ఆయన తీసుకున్న శ్రద్ధతో కేసుల దర్యాప్తులో, నిందితులకు శిక్షలు వేయించడంలో తెలంగాణ పోలీస్ విభాగం దేశంలోనే తొలి స్థానంలో నిలుస్తోంది. దేశంలో కీలకమైన నిఘా, సైనిక సంస్థలకు నాయకత్వం వహించే సీనియర్ అధికారుల సరసన డీజీపీ మహేందర్‌రెడ్డి నిలవడం ఆయన చేపట్టిన సంస్కరణల ఫలితమేనని ఆయన కార్యాలయ సిబ్బంది అభివర్ణించారు. ఆయన సంస్కరణలకు పరిశ్రమ వంటివారని ప్రశంసించారు.

# మరో 40 పాజిటివ్

మొదటి పేజీ తరువాయి

ఒక్కరోజే మూడు కేసులు నమోదయ్యాయి.

**గచ్చిబౌలిలో 1500 పడకల కరోనా ఆసుపత్రి...**
గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రికార్డు సమయంలో 1500 పడకల కరోనా ఆసుపత్రి సిద్ధం చేసినట్లు మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. ఐసీయూ, వెంటిలేటర్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో 22 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోనూ కరోనా చికిత్స కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ బృందంతోనూ చర్చించామని, ఇక్కడి ఏర్పాట్లపై వారు సంతృప్తి వ్యక్తంచేశారని పేర్కొన్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో 12 వేల పడకలు సిద్ధం చేసినట్టు చెప్పారు. కరోనా పాజిటివ్ వ్యక్తులకు చికిత్స అందించడానికి డాక్టర్లకు అవసరమైన పీపీఈ కిట్లు, ఎన్–95 మాస్క్‌లను లక్షల సంఖ్యలో సమకూర్చుకుంటున్నామని మంత్రి తెలిపారు. సీఎం కార్యాలయం ప్రతిరోజూ కరోనాపై పర్యవేక్షణ చేస్తోందన్నారు. మనదేశంలో వైరస్ అరికట్టాలంటే భౌతికదూరం పాటించడం ఒక్కటే మార్గమని స్పష్టంచేశారు. ప్రజలందరూ లాక్‌డౌన్‌ను గౌరవించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**జిల్లాల వారీగా నమోదైన కేసులు, డిశ్చార్జి అయినవారి వివరాలు**

| జిల్లా | పాజిటివ్ కేసులు | డిశ్చార్జి | జిల్లా | పాజిటివ్ కేసులు | డిశ్చార్జి |
|---|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 11 | – | ములుగు | 02 | – |
| భద్రాద్రి కొత్తగూడెం | 02 | 02 | నాగర్‌కర్నూలు | 02 | – |
| హైదరాబాద్ | 150 | 21 | నల్లగొండ | 13 | – |
| జగిత్యాల | 03 | – | నిర్మల్ | 04 | – |
| జనగాం | 02 | – | నిజామాబాద్ | 36 | – |
| భూపాలపల్లి | 01 | – | పెద్దపల్లి | 02 | – |
| గద్వాల | 22 | – | రంగారెడ్డి | 10 | 07 |
| కామారెడ్డి | 08 | – | సంగారెడ్డి | 07 | – |
| కరీంనగర్ | 07 | 11 | సిద్ధిపేట | 01 | – |
| మహబూబాబాద్ | 01 | – | సూర్యాపేట | 08 | – |
| మహబూబ్‌నగర్ | 09 | 01 | వికారాబాద్ | 04 | – |
| మెదక్ | 05 | – | వరంగల్ అర్బన్ | 23 | 01 |
| మేడ్చల్ | 15 | 02 | **మొత్తం** | **348** | **45** |

# లాక్‌డౌన్‌పై ఏం చేద్దాం?

మొదటి పేజీ తరువాయి

విన్నవించారు. ‘మర్కజ్ ఘటన అనంతరం రాష్ట్రంలో కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అదే లేకుంటే ఇప్పుడు రాష్ట్రంలో సాధారణ పరిస్థితులే ఉండేవి. కానీ మర్కజ్ నుంచి వచ్చినవారు, వారి కుటుంబీకుల ద్వారా కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. మొదట్లో ఐదారు జిల్లాలకే పరిమితమైన కరోనా ఇప్పుడు 25 జిల్లాలకు వ్యాపించింది. పరిస్థితి అత్యంత తీవ్రంగా ఉన్న సమయంలో లాక్‌డౌన్ ఎత్తివేస్తే వైరస్‌ను కట్టడి చేయలేం’అని చెప్పినట్టు మరో అధికారి వెల్లడించారు. ‘లాక్‌డౌన్ ఎత్తివేయకపోతే వ్యాపారాలు, సాధారణ ప్రజలకు ఉపాధి, రోగులు ఆసుపత్రులకు వెళ్లే పరిస్థితి ఉండదు కదా? ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాల’ని ఢిల్లీ వర్గాలు ప్రశ్నించాయని సమాచారం.‘ఇప్పటివరకు ఎలాగో ప్రజల సాయంతో లాక్‌డౌన్ విజయవంతం చేశాం. మరికొన్నాళ్లు ఓపికపడితే గండం నుంచి బయటపడతామ’ని బదులిచ్చినట్టు ఓ అధికారి తెలిపారు.

కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతుండటంతో వైద్య ఆరోగ్యశాఖ ఆందోళన చెందుతోంది. మర్కజ్ ద్వారా జిల్లాల్లో రోజురోజుకూ కేసులు బయటపడుతున్నాయి. గద్వాల, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కసారిగా కేసులు పెరిగాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో పరిస్థితి మరీ తీవ్రంగా ఉంది. ఇది ముమ్ముందు ఎటువంటి పరిస్థితికి దారితీస్తుందోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ‘ప్రస్తుతం మర్కజ్ నుంచి వచ్చినవారు, వారి కుటుంబీకులకే వైరస్ పరిమితమైంది. ముమ్ముందు ఇది మూడో కాంటాక్ట్‌కు ఏమైనా చేరిందా అనేది తెలుస్తుంది. లాక్‌డౌన్‌ను మరికొన్నాళ్లు కొనసాగించాక కేసులేమైనా ఉంటే బయటపడతాయి. అప్పటివరకు ఉత్కంఠ తప్పద’ని అధికారులు అంటున్నారు. ‘నేరుగా మర్కజ్ నుంచి వచ్చినవారు, వారి బంధువులు, స్నేహితులు.. ఇలా అన్ని కాంటాక్ట్‌లకు కరోనా నిర్ధారణ పరీక్షలు చేశాక, తదుపరి కేసుల సంఖ్య తగ్గొచ్చు. ఇంటింటి సర్వే ద్వారా ఇది తెలుస్తుంది. దాన్నిబట్టి నిర్ణయాలు ఉంటాయి’అని ఒక అధికారి చెప్పారు.

# ఆశలు లాక్‌డౌన్

మొదటి పేజీ తరువాయి

ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీతోనూ మాట్లాడారు. కేంద్ర జౌళి శాఖ సైతం మిల్లులు పనిచేయడానికి అనుమతించాలని ఆ ప్రభుత్వాన్ని కోరింది. పశ్చిమ బెంగాల్‌లో 60 జనపనార మిల్లులు ఉండగా, అక్కడి నుంచే దేశానికి అవసరమైన 80శాతం సంచుల ఉత్పత్తి జరుగుతోంది. ఈ మిల్లుల్లో 2 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ధాన్యం సేకరణ సీజన్ మొదలైంది. ప్రస్తుత సీజన్‌లో ఎఫ్‌సీఐ వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఆహార ధాన్యాల నిల్వలను తరలించేందుకు భారీగా సంచులు అవసరం. ముఖ్యంగా రాష్ట్రాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ కింద బియ్యం, గోధుమలు, కందిపప్పు సరఫరా చేయాలంటే కనీసం 20లక్షల బేళ్లు (సుమారు 100 కోట్ల సంచులు) ఈ ఏడాది అక్టోబర్ వరకు అవసరమని, ఈ దృష్ట్యా తయారీని ఆరంభించాలని ఈనెల 3న పశ్చిమబెంగాల్ ప్రభుత్వానికి ఎఫ్‌సీఐ లేఖ రాసింది. ఇక తెలంగాణలో గతేడాది 47లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం సేకరణకు కొత్తగా 12కోట్ల సంచులు సమకూర్చుకుంది. ఈ ఏడాది కోటి టన్నుల మేర సేకరణ ఉండటంతో 20కోట్ల సంచులు అవసరమని గుర్తించింది. ఇప్పటికే ఒకసారి వినియోగించిన సంచులు కొంతమేర లభ్యతలో ఉన్నాయి. ఇవి 35 నుంచి 40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సరిపోతాయి. కొత్తగా కనీసం 7 కోట్ల సంచులు అవసరమని పౌరసరఫరాల శాఖ అంచనా వేయగా, వీటిని అందించేలా ఉత్పత్తిని ఆరంభించి సరఫరా చేయాలని ప్రభుత్వం బెంగాల్‌ను కోరింది. మిల్లులు తెరిచేందుకు అవసరమైన అనుమతులు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఇస్తే తప్ప తెరిపించలేమని ఆ రాష్ట్ర సీఎస్ రాజీవ్ సిన్హా ప్రకటించారు.

**సంచుల సేకరణకు నిర్ణయం:** బెంగాల్ ప్రభుత్వ ప్రకటనతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అప్రమత్తమైంది. దీనిపై మంగళవారం సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో సమీక్షించారు. సమస్యను అధిగమించేందుకు రైస్ మిల్లర్లు, డీలర్ల దగ్గర ఉన్న పాత సంచులను తక్షణమే ప్రభుత్వ అధీనంలోకి తీసుకోవాలని, పాత సంచుల సరఫరాదారుల నుంచి సేకరణ మొదలుపెట్టాలని ఆదేశించారు. వీటి స్టోరేజీ సమస్య రాకుండా సంచులను కొనుగోలు కేంద్రాలకు అందుబాటులో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లలో నిల్వ చేయాలన్నారు. ధాన్యం సేకరణకు రూ.25వేల కోట్లు సమకూర్చినందున రవాణా కాంట్రాక్టర్లు, సరఫరాదారులు, డీలర్లకు తక్షణమే చెల్లింపులు చేయాలన్నారు. డీలర్ల నుంచి తీసుకునే సంచులకు ఒక్కో సంచి ధర రూ.16 ఉండగా,దాన్ని రూ.18కి పెంచినట్లు వెల్లడించారు. ఏప్రిల్ నెల రేషన్‌కు సంబంధించి ఒక్కో లబ్ధిదారుడికి 12 కిలోల బియ్యం ఇవ్వడంతో డీలర్ల వద్ద దాదాపు 60లక్షల గోనె సంచులున్నాయని, వీటిని సేకరించాలని సూచించారు. సంచుల సేకరణ ప్రక్రియను అడిషనల్ కలెక్టర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు.

## మీ వ్యాఖ్యలు చాలా బాధించాయి

### సీఎం కేసీఆర్‌పై సీఎల్పీ నేత భట్టి ధ్వజం



**సాక్షి, హైదరాబాద్:** ప్రతిపక్ష పార్టీగా ఆపత్కాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి తాము సహకరిస్తుంటే సీఎం కేసీఆర్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, తమనుద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు చాలా బాధించాయని కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హుందాతనం, స్థాయి, వయసు మరిచిపోయి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఆయన ఉపయోగించిన పదాలు, వ్యంగ్యంగా మాట్లాడిన మాటలు విన్న తర్వాత తాము స్పందించాల్సి వచ్చిందని చెప్పారు. ప్రభుత్వానికి అండగా నిలబడడంతో పాటు సలహాలు, సూచనలు ఇస్తూ, ప్రజలకు సాయం చేస్తుంటే చిల్లర రాజకీయాలు, శవ రాజకీయాలు, దరిద్రులు, వెధవలు అని మాట్లాడడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేసీఆర్ తన పంథా మార్చుకోకపోతే తాము కూడా అలాంటి భాషే వాడాల్సి వస్తుందన్నారు. దేశంలో కరోనా వ్యాప్తికి మోదీ, కేసీఆర్‌లే కారణమని ఆరోపించారు. కరోనా గురించి ఫిబ్రవరి 11న డబ్ల్యూహెచ్‌వో చెప్పిందని, మరుసటి రోజే తమ నాయకుడు రాహుల్‌గాంధీ కేంద్రాన్ని హెచ్చరించారని మార్చి 22 వరకు కేంద్రం ఏమీ పట్టనట్లు వ్యవహరించిందన్నారు.

## ప్రెస్‌మీట్లు కాదు.. పేదలకు అన్నం పెట్టండి

### కేసీఆర్‌కు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి లేఖ



**సాక్షి, హైదరాబాద్:** సీఎం కేసీఆర్ గంటల తరబడి ప్రెస్‌మీట్లు పెట్టడం మానుకుని పేదలకు రెండు పూటలా అన్నం పెట్టడంపై దృష్టి సారించాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. లాక్‌డౌన్‌లో పేదలు అన్నమో రామచంద్రా అంటున్నారని, అన్నం పెట్టలేని ప్రభుత్వం ఎందుకని ప్రశ్నిస్తున్నారన్న విషయాన్ని గమనించాలని కోరారు. తెల్లరేషన్ కార్డు దారులకు, కార్డు లేని పేదలకు మనిషికి 12 కిలోల బియ్యం, కుటుంబానికి రూ.1,500 నగదు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

## మీరు ఎవరితోనైనా మాట్లాడుతున్నారా?

### తనకే తెలిసినట్టు సీఎం వ్యవహరించడం సరికాదు: రేవంత్‌రెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** ప్రధాని మోదీ తనతో రోజుకు ఒక్కోసారి రెండు సార్లు మాట్లాడుతున్నారని సీఎం కేసీఆర్ చెపుతున్నారని, ఇలాంటి సమయంలో ఆయన ఎవరితోనైనా మాట్లాడున్నారా? అని మల్కాజ్‌గిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రపంచం మొత్తం తనకు, తన కుమారునికే తెలిసినట్టు కేసీఆర్ వ్యవహరించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. మల్కాజ్‌గిరిలో పేదలకు తన అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సహాయ కార్యక్రమాలను మంగళవారం రేవంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో లాక్‌డౌన్ కొనసాగించాలంటే అందుకు తగినట్టు ప్రభుత్వ యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. రోజువారీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పిస్తే రోడ్ల మీదకు రారని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులపై రాజకీయ పార్టీలు, వైద్య నిపుణులతో సంప్రదింపులు జరపాలని కేసీఆర్‌ను కోరారు.

## లాక్‌డౌన్ పొడిగింపు సమస్యలపై చర్చించాలి: సీపీఐ



**సాక్షి, హైదరాబాద్:** లాక్‌డౌన్‌ను ఇంకా పొడిగించే అవకాశమున్నందున దీంతో ముడిపడిన సమస్యలపై చర్చకు అఖిలపక్ష భేటీని ఏర్పాటుచేయాలని సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖలో సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి కోరారు. మున్సిపల్ కార్మికులు, డాక్టర్లు, వైద్యసిబ్బందికి ప్రోత్సాహకాలు అందిస్తామన్న సీఎం ప్రకటన అభినందనీయమన్నారు.

## హోంగార్డులకు నెల రోజుల సరుకులు పంపిణీ

**సాక్షి, హైదరాబాద్:** లాక్‌డౌన్ నేపథ్యంలో హోంగార్డులను ఆదుకునేందుకు డీజీపీ కార్యాలయం ముందుకు వచ్చింది. అన్ని జిల్లా యూనిట్లలో ఉన్న హోంగార్డులకు నెలరోజులకు సరిపడా నిత్యావసరాలను పంపిణీ చేసింది. ఇందులో భాగంగా మంగళవారం లక్డీకాపూల్‌లోని 125 మంది హోంగార్డులకు నిత్యావసరాలను చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ డీఎస్పీ యోగేశ్వరరావు పంపిణీ చేశారు.

## ధాన్యం సేకరణలో సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం

### రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి వెల్లడి



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో రబీ సీజన్‌లో మొక్కజొన్న, వరి ధాన్యాలు సాఫీగా కొనుగోలు చేయడానికి, రాష్ట్ర స్థాయిలో ధాన్యం సేకరణలో వచ్చే సమస్యల పరిష్కారానికి వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కంట్రోల్ రూంలో వ్యవసాయ శాఖ, రైతుబంధు సమితి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, పౌరసరఫరాల శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మంగళవారం రాజేశ్వర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ కంట్రోల్ రూం ప్రతిరోజు జిల్లాల వారీగా ధాన్యసేకరణ కేంద్రాల ఏర్పాటు, సేకరించిన ధాన్యం, ఎన్ని ఎకరాలలో పంటకోత కోస్తున్నారనే వివరాలు సేకరించి రాష్ట్ర స్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తారని రాజేశ్వర్ రెడ్డి వివరించారు. వరికోత యంత్రాల సమస్యలు గానీ, కేంద్రాల ఏర్పాటు సమస్య లేదా ధాన్యం సేకరణ సమస్యలపై మాత్రమే రైతులు ఈ కంట్రోల్ రూంను వినియోగించుకోవాలన్నారు. ఈ కంట్రోల్ రూం ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందని, దీనికోసం 7288894807, 7288876545 నంబర్లను సంప్రదించాలన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు వేతనం చెల్లింపు

**సాక్షి, హైదరాబాద్:** మార్చి నెలకు సంబంధించి ఆర్టీసీ ఉద్యోగులకు వేతనాలు బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. మంగళవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ ప్రక్రియ మొదలైంది. కొంతమంది ఖాతాలకు జమ కాగా, మిగతావారికి బుధవారం జమ అవుతుందని అధికారులు పేర్కొన్నారు. సాధారణ ఉద్యోగులకు మూల వేతనంలో 50 శాతం, నాలుగో తరగతి ఉద్యోగులకు 90 శాతం చొప్పున వేతనాలు అందిస్తున్న విషయం తెలిసిందే.

## నిత్యావసరాల రవాణాకు 32 పార్శిల్ రైళ్లు

**సాక్షి, హైదరాబాద్:** నిత్యావసర వస్తువులకు కొరత లేకుండా ఉండేందుకు వివిధ ప్రాంతాల్లో దక్షిణ మధ్య రైల్వే 32 పార్శిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఇందులో రెండు దూద్ దురంతో రైళ్లు కూడా ఉన్నాయి. ఈ రైళ్లు ఏప్రిల్ 8వ తేదీ నుంచి 14వ తేదీ మధ్య నడుస్తాయి. సాధారణ పార్శిల్ రైళ్లు గంటకు 30 కి.మీ. వేగంతో నడుస్తాయి, కానీ వీటిని మాత్రం 55 కి.మీ. వేగంతో నడుపుతారు. ఏప్రిల్ 8–14 మధ్య సికింద్రాబాద్ నుంచి కాకినాడ వరకు ప్రతిరోజు ఓ ఎక్స్‌ప్రెస్ పార్శిల్ రైలు నడుస్తుంది. ఈ రైలు కాజీపేట, రాజమండ్రి, గుడివాడ మీదుగా వెళ్తుంది. ఇక రేణిగుంట నుంచి సికింద్రాబాద్ వరకు వయా గూడూరు, విజయవాడ మీదుగా, రేణిగుంట నుంచి నిజాముద్దీన్ వరకు, సికింద్రాబాద్ నుంచి హౌరా వరకు, సికింద్రాబాద్ నుంచి అమృత్‌సర్ వరకు పార్శిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. యశ్వంత్‌పూర్–హౌరా, యశ్వంత్‌పూర్–నిజాముద్దీన్, యశ్వంత్‌పూర్–గోరఖ్‌పూర్, యశ్వంత్‌పూర్–గౌహతి, చెన్నై–నిజాముద్దీన్, చెన్నై–కళ్యాణ్, చెన్నై–అహ్మదాబాద్ నడుమ వారానికో రైలు చొప్పున కూడా నడపనున్నారు. సరుకులు రవాణా చేయాలనుకునేవారు ఆయా డివిజన్‌ల కమర్షియల్ మేనేజర్లను సంప్రదించాలని దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది.

# లాక్‌డౌన్ వేళ.. ఆన్‌లైన్ అర్చన

**ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న దేవాదాయ శాఖ**

- ఐటీ శాఖ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లోనే ఆర్జిత సేవలు
- ఉజ్జయిని, కర్మన్‌ఘాట్ ఆలయాల్లో నేటి నుంచే అమల్లోకి
- తపాలా ద్వారా ఇంటికే భద్రాచలం రామయ్య తలంబ్రాలు

**సాక్షి, హైదరాబాద్:** దైవికమైన శుభసందర్భాలు, పుట్టిన రోజు, పెళ్లిరోజు వేడుకలు.. ఇలాంటి సందర్భాల్లో దేవాలయాలకు వెళ్లాలని భక్తులు భావిస్తారు. ప్రస్తుతం లాక్‌డౌన్ అమల్లో ఉన్నందున ఇది కుదరటం లేదు. దీంతో చాలామంది మానసిక ఆవేదనకు గురవుతున్నారు. దీన్ని గుర్తించిన దేవాదాయశాఖ.. భక్తులకు ఆలయ ప్రవేశం లేకున్నా, వారిపేరుతో పూజలు నిర్వహించాలని నిర్ణయించింది. ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకుంటే, నిర్ధారిత జాబితాలోని కోరుకున్న దేవాలయంలో పూజలు నిర్వహించే ఏర్పాటు చేస్తోంది. తెలంగాణ ఐటీ శాఖ రూపొందించిన యాప్ ద్వారా ఈ వెసులుబాటు కల్పిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా ప్లేస్టోర్‌లో యాప్‌ను రూపొందించింది. తొలుత ప్రయోగాత్మకంగా సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి దేవాలయం, కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం నుంచీ ప్రారంభిస్తున్నారు. ఆపై రాష్ట్రంలోని ఇతర ముఖ్య ఆలయాల్లో ప్రారంభిస్తారు. ప్లేస్టోర్ ద్వారా ఈ వెసులుబాటు కల్పించేందుకు గూగుల్ మంగళవారం సమ్మతి తెలిపింది.

### భద్రాద్రి రామయ్య తలంబ్రాలు సిద్ధం

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణాన్ని భక్తకోటి నేరుగా తిలకించలేకపోయింది. టీవీల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని చూసి ఆనందపడింది. కానీ స్వామి తలంబ్రాల అక్షింతల కోసం వారు తపన పడుతున్నారు. ఇప్పుడు టీఎస్ యాప్ ఫోలియో ద్వారా కోరుకున్న వారికి వాటిని అందించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఐదు వేల తలంబ్రాల పొట్లాలను దేవాదాయశాఖ సిద్ధం చేసింది. యాప్ ద్వారా బుక్ చేసుకున్నవారికి తపాలా ద్వారా ఇంటికి అందిస్తారు. ఇందుకోసం తపాలాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో భద్రాచలం దేవాలయం తలంబ్రాల వివరాలు ఉన్న విండో ఓపెన్ చేసి వివరాలు నమోదు చేసుకోవటం ద్వారా బుక్ చేసుకోవచ్చు. తలంబ్రాలకు గాను రూ.20, పోస్టల్ చార్జీ రూ.30, ఐటీ సర్వీస్ చార్జీ చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలి. ప్రత్యేకంగా ఈ తలంబ్రాలను భక్తుల ఇంటికి చేర్చేందుకు తపాలాశాఖ సిబ్బంది, వాహనాలను సిద్ధం చేసింది.



### ఎలా బుక్ చేసుకోవాలి?

గూగుల్ ప్లేస్టోర్ నుంచి టీఎస్ యాప్ ఫోలియోను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో దేవాలయాల వివరాలు ఉంటాయి. వాటిల్లో కావాల్సిన ఆలయంలో ఆర్జిత సేవను ఓపెన్ చేసి వివరాలు నమోదు చేయాలి. దాని ఆధారంగా ఆయా దేవాలయాల్లో భక్తుల పేర్లతో, వారు కోరుకున్న రోజున ఆర్జిత సేవలు నిర్వహిస్తారు. ఆ వివరాలను తిరిగి వారి మొబైల్ ఫోన్‌కు సమాచారం రూపంలో అందిస్తారు. కుదిరితే పూజ అక్షింతలు, పసుపు కుంకుమ, డ్రైఫ్రూట్స్, మిశ్రీతో కూడిన ప్రసాదాన్ని కూడా అందించాలని తొలుత భావించారు. కానీ ప్రస్తుతం తపాలా, కొరియర్ సేవలు పరిమితంగానే ఉన్నందున ఇది సాధ్యం కాదని అనుకుంటున్నారు.

# పరీక్షలు పెంచడమే మార్గం

- దేశంలో కనీసం 10 లక్షల మందిని పరీక్షించాకే ఓ నిర్ధారణకు రావాలి
- అవసరాన్ని బట్టి క్వారంటైన్, ఐసోలేషన్ గడువు పెంచుకోవాలి
- 'సాక్షి'తో ఆక్లామ్ వర్సిటీ స్టడీ యూనిట్ వ్యవస్థాపకుడు రాహుల్ పొట్లూరి



**సాక్షి, హైదరాబాద్:** మన దేశంలో కరోనా నియంత్రణ జరగాలంటే ఆ వైరస్ సోకిందా లేదా అనే నిర్ధారణ పరీక్షలు వేగవంతం చేయడమే మార్గమని యూకేకు చెందిన ఆక్లామ్ విశ్వవిద్యాలయ స్టడీ యూనిట్ వ్యవస్థాపకుడు, భారత సంతతికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ రాహుల్ పొట్లూరి అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా కనీసం 10 లక్షల మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు జరగాల్సి ఉందని, ఆ తర్వాతే దీనిపై ఓ నిర్ధారణకు రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అప్పుడే సామాజిక, ఆర్థిక మాంద్యాలను తగ్గించుకునే వీలు కలుగుతుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా వ్యాప్తి నియంత్రణపై 50 దేశాలు తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేసిన ఆక్లామ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల బృందంలో సభ్యుడు కూడా అయిన రాహుల్ పొట్లూరి భారతదేశంలో కరోనా నియంత్రణ మార్గాలపై మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఈ అంశంపై రాహుల్ ఏమన్నారో ఆయన మాటల్లోనే...

### సంబంధాలను అధ్యయనం చేశాం

ప్రపంచంలోని పలుదేశాల్లో కరోనా కేసుల సంఖ్య, అక్కడ జరుగుతోన్న పరీక్షల సంఖ్య మధ్య ఉన్న సంబంధాన్ని విస్తృతంగా అధ్యయనం చేశాం. కరోనా కేసులు, మరణాల నిష్పత్తి చాలా వైవిధ్యంగా ఉందని మా పరిశోధనలో తేలింది. ఏ దేశాల్లో అయితే జనాభా ఆధారంగా కరోనా కేసుల సంఖ్య ఎక్కువగా ఉందో అక్కడ మరణాల రేటు తక్కువగా ఉంది. వైరస్ నిర్ధారణ పరీక్షలు ఎక్కువగా చేయడం వల్లే పాజిటివ్ కేసులను నిర్ధారించి వారికి చికిత్స అందించి మరణించకుండా చర్యలు తీసుకునే వీలు కలిగింది. మరణాల సంఖ్యను నియంత్రించడంలో బాగా కృషి చేసింది దక్షిణ కొరియానే.

### కనీసం ఒక శాతం పరీక్షలు చేయాలి

వివిధ దేశాల్లో ఈ వైరస్ వ్యాప్తిని పరిశీలించిన తర్వాత ఏ దేశంలోనైనా ఆ దేశ జనాభాలో 1 శాతం మందికి పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. అలా అయితే మన దేశంలో కనీసం కోటిన్నర మందికి ఈ పరీక్షలు జరపాలి. కానీ సాధ్యాసాధ్యాల దృష్ట్యా మనదేశంలో పది లక్షల మందికైనా పరీక్షలు నిర్వహిస్తేనే ఫలితం ఉంటుంది. ఈ పరీక్షలను విస్తృతంగా నిర్వహించడం ద్వారా ఆరోగ్య ప్రణాళికలను అమలు చేయడమే కాకుండా హాట్‌స్పాట్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో వైరస్ నిరోధానికి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అవసరమనుకుంటే క్వారంటైన్ లేదా ఐసోలేషన్ గడువును కూడా పెంచుకోవచ్చు.

### వ్యాక్సినేషన్ లేదు

కరోనా నియంత్రణకు వ్యాక్సినేషన్ లేనందు వల్ల పరీక్షలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవడమే మార్గం. ప్రపంచవ్యాప్తంగా కనీసం 5 లక్షల మంది ఈ వైరస్ బారిన పడి మరణించే ప్రమాదాన్ని తప్పించుకోవాలన్నా గణనీయంగా పరీక్షలు నిర్వహించడమే ఉత్తమ మార్గం. అందుకే మా పరిశోధన బృందం ప్రపంచంలో ఈ విధానం అమలు చేయాలని సిఫారసు చేస్తోంది.

# మర్కజ్ దెబ్బ!

- 146 మంది విదేశీయులపై వీసా, లాక్‌డౌన్ ఉల్లంఘన కేసులు
- వారికి ఆశ్రయమిచ్చిన వారిపైనా నమోదు

**సాక్షి, హైదరాబాద్:** ఢిల్లీలోని మర్కజ్ ప్రార్థనల పర్యవసానాలు దేశం, రాష్ట్రంపై తీవ్రంగా ప్రభావం చూపిన నేపథ్యంలో వారిపై తెలంగాణ పోలీసులు కేసులు నమోదు చేశారు. మర్కజ్ ప్రార్థనల కోసం వచ్చిన విదేశీయులు పలువురు విజిటింగ్ వీసాతో దేశానికి రావడమే కాకుండా, కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్ కొనసాగుతున్నా.. నిబంధనలు ఉల్లంఘిస్తూ.. దేశంలోని పలు రాష్ట్రాల్లో పర్యటించి స్థానికులకు కూడా వైరస్ ను వ్యాపింపజేశారు. దీంతో సోమవారమే కేసుల నమోదు ప్రారంభించిన తెలంగాణ పోలీసులు మంగళవారం రాత్రి 146 మంది విదేశీయులపై వీసా ఉల్లంఘనల కింద కేసులు నమోదు చేశారు. వీటిలో హైదరాబాద్‌లో 84 మంది విదేశీయులపై 10 కేసులు నమోదయ్యాయి. ఇందులో విదేశీయులకు ఆశ్రయమిచ్చిన వారిపైనా పోలీసులు కేసులు పెట్టారు. విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన వారిలో ఇండోనేసియా, కిర్గిస్తాన్, మలేషియా, వియత్నాం, మయన్మార్‌కు చెందిన వారు ఉన్నారు. వీరందరిలో అత్యధికంగా నల్లగొండలో 36 మందిపై కేసులు నమోదయ్యాయి. ఇందులో 18 మంది మయన్మార్, వియత్నాంకు చెందిన 14 మంది ఉన్నారు. వీరికి ఆశ్రయమిచ్చిన వారిపైనా కేసులు నమోదయ్యాయి. కరీంనగర్‌లో పర్యటించిన 14 మంది ఇండోనేసియన్లతో పాటు, వారికి ఆశ్రయమిచ్చినవారిపైనా కేసులు పెట్టారు.

### కేంద్ర హోం శాఖ ఆదేశాలతో..

విదేశీయులకు కరోనా పాజిటివ్ రావడంతో కలకలం రేగింది. దీనిపై విచారణ ప్రారంభించిన కేంద్ర హోం శాఖ వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించింది. వీరంతా విజిటింగ్ వీసాలపై భారత్‌కు వచ్చినట్లు గుర్తించిన హోం శాఖ.. వారంతా ఎక్కడెక్కడున్నారో వెంటనే గుర్తించి, వారి వీసాలు పరిశీలించాలని ఆదేశించింది. అందులో వీసా, లాక్‌డౌన్ నిబంధనల ఉల్లంఘనలు ఉంటే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. మార్చి 16న కరీంనగర్‌కు వచ్చిన 14 మంది సభ్యులున్న ఇండొనేసియావాసుల వల్ల కరోనా కేసులు వెలుగుచూసిన సంగతి తెలిసిందే. వాస్తవానికి మర్కజ్‌లో అసలేం జరుగుతోందో తెలంగాణ ప్రభుత్వమే కేంద్రానికి విన్నవించింది.

# తాత్కాలిక విద్యుత్ బిల్లు

- గతేడాది ఏప్రిల్ బిల్లుకు సమానంగా ప్రస్తుత నెల బిల్లు
- గృహ, వీధి దీపాలు, నీటి సరఫరా పథకాల కనెక్షన్లకు జారీ
- ఇతర ఎల్టీ కేటగిరీలకు గతేడాది ఏప్రిల్ బిల్లులో 50 శాతం బిల్లు
- డిస్కంల ప్రతిపాదనలకు ఈఆర్సీ గ్రీన్ సిగ్నల్



**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ నియంత్రణ కోసం రాష్ట్రంలో లాక్‌డౌన్ అమలు చేస్తున్న నేపథ్యంలో మీటర్ రీడింగ్ తీసుకోకుండా ప్రత్యామ్నాయ విధానంలో ఎల్టీ విద్యుత్ వినియోగదారులకు ప్రస్తుత ఏప్రిల్ నెలలో బిల్లులు జారీ చేసేందుకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తాజాగా అనుమతిచ్చింది. గతేడాది సరిగ్గా ఏప్రిల్ నెలలో లేదా గత మార్చి నెలలో జారీ చేసిన విద్యుత్ బిల్లులు ప్రామాణికంగా తీసుకుని ప్రస్తుత ఏప్రిల్ నెలలో వినియోగదారులకు తాత్కాలిక బిల్లులు జారీ చేస్తామని దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు చేసిన ప్రతిపాదనలకు ఈఆర్సీ ఆమోదం తెలిపింది. రాష్ట ప్రభుత్వం లాక్‌డౌన్ ఎత్తివేసిన వెంటనే తదుపరి నెలకు సంబంధించిన మీటర్ రీడింగ్‌ను తీసి వినియోగదారుల వాస్తవ విద్యుత్ వినియోగం ఆధారంగా తాత్కాలిక విధానంలో జారీ చేసిన బిల్లుల్లోని హెచ్చుతగ్గులను సరిదిద్దాలని ఆదేశించింది. ఏప్రిల్‌లో ఎల్టీ వినియోగదారులకు ఈ కింది పద్ధతిలో విద్యుత్ బిల్లులు జారీ చేయనున్నారు.

**విద్యుత్ బిల్లు జారీ ఇలా..**

- 2019 మార్చి నాటికి ఉనికిలో ఉన్న గృహ (ఎల్టీ–1), వీధి దీపాలు (ఎల్టీ–6ఏ), నీటి సరఫరా పథకాల (ఎల్టీ–6బీ) విద్యుత్ కనెక్షన్ల వినియోగదారులకు 2019 ఏప్రిల్‌లో జారీ చేసిన బిల్లులకు సమాన బిల్లులను ప్రస్తుత ఏప్రిల్ నెలలో జారీ చేయనున్నారు. అంటే మార్చి 2019లో వినియోగించిన విద్యుత్‌కు సంబంధించిన బిల్లులను 2019 ఏప్రిల్‌లో చెల్లించాలి. 2020 మార్చిలో వాడిన విద్యుత్‌కు సంబంధించిన బిల్లులను సైతం తాత్కాలికంగా 2019 మార్చిలో వాడిన విద్యుత్ గణాంకాల ప్రాతిపదిక వసూలు చేయాలని డిస్కంలు ప్రతిపాదించగా, ఈఆర్సీ ఆమోదించింది.
- 2019 ఏప్రిల్ 1– 2020 ఫిబ్రవరి 29 మధ్య కాలంలో జారీ చేసిన గృహ (ఎల్టీ–1), వీధి దీపాలు (ఎల్టీ–6ఏ), నీటి సరఫరా పథకాల (ఎల్టీ–6బీ) విద్యుత్ కనెక్షన్ల వినియోగదారులకు 2020 మార్చిలో జారీ చేసిన బిల్లుకు సమాన బిల్లును ప్రస్తుత నెలలో జారీ చేయనున్నారు.
- మార్చి 2020లో జారీ చేసిన కొత్త గృహ (ఎల్టీ–1), వీధి దీపాలు (ఎల్టీ–6ఏ), నీటి సరఫరా పథకాల (ఎల్టీ–6బీ) విద్యుత్ కనెక్షన్ల వినియోగదారులకు కనీస డిమాండ్ ప్రాతిపదికన ఏప్రిల్ 2020లో బిల్లులు జారీ చేయనున్నారు.
- మార్చి 2019 నాటికి ఉనికిలో ఉన్న ఇతర అన్ని రకాల ఎల్టీ కేటగిరీల (ఎల్టీ–5 వ్యవసాయ కేటగిరీ మినహాయించి) కనెక్షన్లకు సంబంధించిన వినియోగదారులకు ఏప్రిల్ 2019లో జారీ చేసిన బిల్లుకు 50 శాతం సమాన బిల్లును 2020 ఏప్రిల్‌లో జారీ చేయనున్నారు.
- 2019 ఏప్రిల్ 1– 2020 ఫిబ్రవరి 29 మధ్య కాలంలో జారీ చేసిన ఇతర అన్ని రకాల ఎల్టీ కేటగిరీల (ఎల్టీ–5 వ్యవసాయ కేటగిరీ మినహాయించి) కనెక్షన్లకు సంబంధించిన వినియోగదారులకు 2020 మార్చిలో జారీ చేసిన బిల్లుకు 50 శాతం సమాన బిల్లును ఏప్రిల్ 2020లో జారీ చేస్తారు. ఇతర ఎల్టీ కేటగిరీలో కమర్షియల్ (ఎల్టీ–2ఏ/2బీ), అడ్వర్టయిజ్ మెంట్ హోర్డింగ్స్ (ఎల్టీ–2సీ), హెయిర్‌కట్టింగ్ సెలూన్స్ (ఎల్టీ–3డీ), పరిశ్రమలు (ఎల్టీ–3), కుటీర పరిశ్రమలు (ఎల్టీ–4ఏ), వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు (ఎల్టీ–4బీ) కేటగిరీల వినియోగదారులు వస్తారు.
- మార్చి 2020లో జారీ చేసిన ఇతర అన్ని రకాల ఎల్టీ కేటగిరీల (ఎల్టీ–5 వ్యవసాయ కేటగిరీ మినహాయించి) కనెక్షన్లకు సంబంధించిన వినియోగదారులకు కనీస డిమాండ్ లెక్కల ప్రాతిపదికన 2020 ఏప్రిల్‌లో బిల్లులు జారీ చేస్తారు.
- ఎస్‌ఎంఎస్‌లు/మొబైల్ యాప్స్/వెబ్‌సైట్ల ద్వారా వినియోగదారులకు వారి బిల్లుల వివరాలు తెలియజేయనున్నారు.

# వలస కూలీలకు అండగా ఉంటాం

- మంత్రి హరీశ్‌రావు భరోసా
- బియ్యం, నగదు పంపిణీ



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

**సాక్షి, సిద్దిపేట:** వలస కూలీలకు ప్రభుత్వం అండగా ఉంటోందని ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్, నంగునూరు మండలాల్లో ధాన్యం, శనగల కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం సిద్దిపేటలో వలస కూలీలకు బియ్యం, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు, ఇతర నిర్మాణ పనులతోపాటు, పరిశ్రమలు, గృహ నిర్మాణాల కోసం కూలీలు మన రాష్ట్రానికి వచ్చారన్నారు. జిల్లా వ్యాప్తంగా 12 వేలకు పైగా వలస కూలీలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. వీరందరూ ప్రస్తుతం పనులు లేక, కుటుంబ పోషణ కూడా ఇబ్బందిగా మారిందని అన్నారు. వీరిని ఆదుకునేందుకు ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం, రూ. 500 చొప్పున నగదు అందజేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు ఇలా ప్రతీ ఒక్కరూ తమ దాతృత్వాన్ని చాటుకుంటూ కూలీలకు సహాయం అందజేస్తున్నారని అన్నారు. ఆహార పదార్థాలతో కూడిన కిట్స్‌ను అందజేసేందుకు వచ్చిన దాతలను మంత్రి అభినందించారు. అసత్యపు ఆరోపణలు, అబద్ధపు ప్రచారాలను నమ్మవద్దని మంత్రి ప్రజలను కోరారు.

### ప్రతీ గింజను కొంటాం

గతంలో లేనివిధంగా ఈ ఏడాది గోదావరి, కృష్ణా జలాలు రాష్ట్రంలోని చెరువులకు మళ్లించామని, దీంతో ఎన్నడూ లేని విధంగా రబీ సాగు పెరిగిందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన లాక్ డౌన్ మూలంగా తమ పంటలను ఎలా అమ్ముకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఎవరూ అధైర్య పడొద్దని, రైతులు పండించిన ప్రతి గింజను కొంటామని మంత్రి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో 25వేల కుటుంబాలకు సాయం చేశాం

### ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ కార్యవహ కాచం రమేశ్

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో 2,678 మంది ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు తెలంగాణలోని 369 ప్రాంతాల్లో 25 వేల కుటుంబాలకు నిత్యావసరాలు అందజేశారని తెలంగాణ ప్రాంత కార్యవహ కాచం రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమాలకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సహకారం అందించడంతోపాటు దేశ వ్యాప్తంగా బాధితుల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిందని రమేశ్ తెలిపారు. దేశవ్యాప్తంగా 26 వేల ప్రాంతాల్లో 2 లక్షల మంది స్వయంసేవకులు 25 లక్షల కుటుంబాలకు సహాయం అందజేశారని వివరించారు.

## ఫలించిన పోలీసుల చర్చలు

**ముంబై నుంచి కారులో స్వగ్రామానికి పయనం**

సాక్షి ఎఫెక్ట్..



ముంబైలో కారు ఎక్కేముందు రవీందర్, ఝూన్సీ దంపతులు

**చిల్పూరు:** జనగామ జిల్లా చిల్పూరు మండలం వెంకటాద్రిపేట గ్రామానికి చెందిన మాదరబోయిన రవీందర్, ఝూన్సీ దంపతులు 6 నెలల క్రితం అమెరికాలో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లి గత నెల 19న బయలుదేరగా ముంబైలో పోలీసులు అడ్డుకున్నారు. లాక్‌డౌన్ కారణంగా అక్కడే చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని ఫోన్‌లో 'సాక్షి'దృష్టికి తీసుకురాగా.. 'మా ఊరికి తీసుకెళ్లండి'శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన స్టేషన్ ఘన్‌పూర్ సీఐ రాజిరెడ్డి, చిల్పూరు ఎస్ఐ మహేందర్ ముంబై అధికారులతో చర్చలు జరిపి వారిని అక్కడ్నుంచి కారులో స్వగ్రామానికి రప్పించారు.

సాక్షి
బుధవారం, ఏప్రిల్, 8

## ట్రంప్ బెదిరింపు ధోరణి

మొదటినుంచీ కరోనా వైరస్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి అమెరికాను రోగగ్రస్తం చేసిన ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన తప్పిదాల నుంచి గుణపాఠం నేర్చుకున్నట్టు లేదు. కరోనా వైరస్‌ను నియంత్రించడానికి బ్రహ్మాండంగా పనికొస్తుందని తాను విశ్వసిస్తున్న హైడ్రాక్సీ క్లోరోక్విన్ ఔషధం ఎగుమతులపై మన దేశం నిషేధం విధించిందనగానే ఆయన చేసిన వ్యాఖ్యానం ఇందుకు నిదర్శనం. 'అదే నిజమైతే భారత్‌పై ప్రతీకారం తీర్చుకుంటామ'ంటూ ఆయన విరుచుకుపడ్డారు. హైడ్రాక్సీ క్లోరోక్విన్ గురించి ట్రంప్ చాన్నాళ్లుగా మాట్లాతున్నారు. వైద్యులు రోగిని అన్నివిధాలా పరీక్షించి, తమ పర్యవేక్షణలో మాత్రమే దాన్ని వాడవలసివుంటుందని, ఎవరికి తోచినట్టు వారు ఉపయోగిస్తే ప్రాణాలకు ముప్పు తెస్తుందని అమెరికాలోని వైద్య నిపుణులు ఇప్పటికే ట్రంప్‌కు చెప్పారు. అయినా ఆయన తలకెక్కలేదు. ఆ మందు గురించి తరచుగా చెబుతూనేవున్నారు. దీనికి, మన దేశం హైడ్రాక్సీ క్లోరోక్విన్, పారాసెటమాల్ ఎగుమతులపైనా నిషేధం విధించడానికి సంబంధం లేదు. ఈ ఆపత్కాలంలో మన దేశానికే వాటి అవసరం పడవచ్చునన్న ముందస్తు ఆలోచనతో రెండురోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుంది. కరోనా వ్యాధిగ్రస్తులకు ఇది పరిమితంగానే ఉపయోగపడినా, వారి బాగోగులు నిత్యం చూసే వైద్యులు ముందుజాగ్రత్తగా వాడాల్సివుండొచ్చని నిపుణులు తేల్చారు. పైగా మన దేశంలో మలేరియా వ్యాధిగ్రస్తులు కూడా ఎక్కువ గనుక ఆ మందు అందుబాటులో వుండటం అవసరమని భావించారు. నిపుణులతో చర్చించి, పాలనావ్యవహారాల్లో ముఖ్యపాత్ర పోషించేవారి అభిప్రాయాలు తెలుసుకుని ప్రభుత్వాలు ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటాయి. ట్రంప్‌కు ఈ గొడవ లేదు. తాను అనుకున్నదే జరగాలనుకుంటారు. కరోనా వైరస్ విషయంలోనూ ఆయన తీరు మొదట్లో అదే మాదిరి వుంది. దాని ప్రభావం తమ దేశంపై ఉండదుగాక ఉండదని ట్రంప్ బలంగా నమ్మారు. అందుకే చాన్నాళ్లు పట్టించుకోవడం మానేశారు. ఈలోగా ఎవరో ఆయనకు ఈ హైడ్రాక్సీ క్లోరోక్విన్ అంటించారు.

తన విశ్వాసానికి శాస్త్రీయ ప్రాతిపదిక వున్నా లేకున్నా, ఆ ఔషధం అత్యవసరమని ట్రంప్ భావించారు. ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడారు. దానిపై నిర్ణయం తీసుకోవడానికి కాస్తయినా వ్యవధి ఇవ్వకుండానే ఈలోగా నోరు పారేసుకున్నారు. దేశాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్లు కావస్తున్నా దౌత్య మర్యాదలు ట్రంప్‌కు ఒంటబట్టలేదని దీన్నిబట్టి అర్థమవుతుంది. అమెరికా ఇలా అహంభావంతో మాట్లాడటం కొత్తేమీ కాదు. వేరే దేశాలతో వైరం ముదిరిన సందర్భాల్లో గతంలో అధ్యక్షులుగా వున్నవారు ఈ మాదిరే హెచ్చరికలు చేసేవారు. కానీ అకారణంగా నోరు పారేసుకోవడంలో ట్రంప్ వారిని మించిపోయారు. ఆయనకు ఎప్పుడు ఏ సందర్భంలో ఏ పదం ఉపయోగించాలో కూడా తెలియదు. భారత్ నుంచి హైడ్రాక్సీ క్లోరోక్విన్ దిగుమతి చేసుకుంటామని, దీనిపై మోదీతో మాట్లాడానని ట్రంప్ చెప్పాక, ఈ నిషేధం సంగతిని ఒక విలేకరి ప్రస్తావించారు. అంతటితో ఆగక వైద్య ఉపకరణాల ఎగుమతిని అమెరికా నిషేధించినందువల్లే అందుకు జవాబుగా భారత్ ఈ పని చేసివుండొచ్చనుకుంటున్నారా అని కూడా అడిగారు. అంతక్రితం మాటెలావున్నా భారత్–అమెరికాల మధ్య మూడు దశాబ్దాలుగా గాఢమైన అనుబంధం ఉంది. దీనికితోడు ఇరు దేశాధినేతల మధ్య వ్యక్తిగత సంబంధాలు బాగున్నాయి. ఈ నేపథ్యంలో మరొకరెవరైనా అయితే ఆ నిషేధం ఉండబోదని ఆశిస్తున్నట్టు చెప్పేవారు. కానీ ట్రంప్ మాత్రం ఇరు దేశాల మధ్యా వున్న వాణిజ్యసంబంధాల చరిత్ర, అందువల్ల ఎప్పుడూ మన దేశమే 'లాభపడుతున్న' వైనం ఏకరువు పెట్టారు. మోదీ నిర్ణయం అదే అయితే అందుకు ప్రతీకారం తప్పదని హెచ్చరించారు. ఇప్పుడున్న సంక్షోభ పరిస్థితుల్లో దేశాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణి అవలంబించాలి. అయితే ఏ దేశానికి ఆ దేశం తమ స్థితిగతులెలావున్నాయో చూసుకుని వేరే దేశాలకు ఎంతవరకూ సహకరించగలమన్నది నిర్ణయించుకుంటాయి. తనకు మాలిన ధర్మాన్ని ఏ దేశమూ చేయలేదు. వైద్య ఉపకరణాల విషయంలో అమెరికా అయినా, ఔషధాల విషయంలో మన దేశమైనా ఇలాంటి అంశాలను దృష్టిలో పెట్టుకోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నాయని బోధపడుతుంది. అయితే నిర్ణయాన్ని సడలించుకోవాలని ఏ దేశమైనా అభ్యర్థించడం సహజం. కొన్ని సందర్భాల్లో అధిక మొత్తం వెచ్చించి కొనడానికి కూడా సిద్ధపడే సందర్భాలుంటాయి. ఈమధ్యే వేరే దేశం కోసం చైనా సిద్ధం చేసిన మాస్క్‌లను అమెరికా తన్నుకుపోయిందని వార్తలొచ్చాయి. తాను వైద్య ఉపకరణాల ఎగుమతిని నిలిపేసినా తప్పులేదు. వేరే దేశానికి వెళ్లాల్సిన మాస్క్‌లు హైజాక్ చేసినా పర్వాలేదు. కానీ తాను అవసరమనుకునే ఔషధం ఎగుమతిని మాత్రం ఏ దేశమూ నిషేధించకూడదు. ఇదీ అగ్ర రాజ్య నీతి!

ఇప్పుడు కేంద్రం హైడ్రాక్సీ క్లోరోక్విన్‌పై వున్న నిషేధాన్ని ఎత్తివేసింది. కేవలం దేశంలో నిల్వలు ఏ స్థాయిలో వున్నాయో, మన అవసరాలకు సరిపోతాయో లేదో లెక్క చూసుకోవడానికి తాత్కాలికంగా ఎగుమతులు ఆపాలన్న నిర్ణయం తీసుకున్నామని, ఇప్పుడు దాన్ని తొలగిస్తున్నామని మన విదేశాంగ ప్రతినిధి చెప్పారు. నిరుడు అమెరికాకు కావలసిన హైడ్రాక్సీ క్లోరోక్విన్ అవసరాల్లో 47శాతం మన ఫార్మా కంపెనీలే తీర్చాయి. ఈ ఔషధాన్ని అమెరికాకు సరఫరా చేసే తొలి పది సంస్థల్లో మన దేశానికి చెందినవే అధికం. ఇప్పుడున్న పరిస్థితుల్లో అవసరం వున్నవారికి ఆ ఔషధాన్ని అందిస్తామని మన దేశం అభయమివ్వడం మెచ్చదగ్గ నిర్ణయం. కానీ ట్రంప్ బెదిరింపు ధోరణితో మాట్లాడటం సరికాదని కూడా చెప్పవలసింది. వాణిజ్యపరమైన వివాదాలేమైనా వుంటే సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలి. నోరు పారేసుకుని పనులు చక్కబెట్టుకుందామనుకునే ధోరణి సరికాదు.

### గ్రహం అనుగ్రహం

శ్రీ శార్వరి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, తిథి పౌర్ణమి ఉ.8.49 వరకు, తదుపరి బ.పాడ్యమి
నక్షత్రం హస్త ఉ.6.48 వరకు, తదుపరి చిత్త తె.5.11 వరకు
(తెల్లవారితే గురువారం), వర్జ్యం ప.2.15 నుంచి 3.44 వరకు
దుర్ముహూర్తం ప.11.35 నుంచి 12.25 వరకు
అమృతఘడియలు...ఉ.7.22 నుంచి 8.43 వరకు.

**సూర్యోదయం :** 5.53
**సూర్యాస్తమయం :** 6.10
**రాహుకాలం :** ప. 12.00 నుంచి 1.30 వరకు
**యమగండం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు

# చైనా-పాక్‌లు మారేదెన్నడు?

**విశ్లేషణ**



తిలక్ దేవశర్

**చైనా గనుక తన ఔషధాల ఎగుమతిని నిలిపివేస్తే, అమెరికా ఈ కరోనా వైరస్ అంటువ్యాధితో నాశనమైపోతుంది. చాలా రోజులుగా వస్తువుల తయారీ పనుల్ని చైనాకి ఔట్‌సోర్స్ చేస్తోన్న ప్రపంచం ఇప్పుడు దాని ఫలితాలను ఎదుర్కొంటోంది. ప్రపంచం నేర్చుకోవాల్సిన గుణపాఠం ఏమిటంటే చైనా మీద అతిగా ఆధారపడటాన్ని తగ్గించాలి. ఇది కేవలం కీలకమైన ఔషధాలు, వైద్యపరికరాల కోసం మాత్రమే కాదు, ఇతర రకాల వస్తుతయారీ పంపిణీ వ్యవస్థలతో ముడిపడిన అన్నిటికీ వర్తిస్తుంది. దీనికి ఎంతో సమయం పట్టవచ్చు. విపరీతమైన ఖర్చు కావచ్చు. కానీ ప్రత్యేకించి ఇట్లాంటి ప్రాణాంతకమైన సందర్భాలలో చైనాకు బందీగా దొరికిపోకుండా ఉండటానికి అది పనికొస్తుంది.**

కరోనా వైరస్ సాంక్రమిక వ్యాధి మునుపటి తరాలు ఎన్నడూ ఎదుర్కోని సవాళ్లను అంతర్జాతీయ సమాజం ముందుంచుతోంది. కానీ మునుపటి సవాళ్ల లాగే ఇది కూడా బలహీనపడుతుంది. అయితే ఈ వ్యాధి మిగిల్చి వెళ్లే అనేక జ్ఞాపకాల్లో రెండు మాత్రం ప్రత్యేకంగా మిగిలిపోతాయి. ఒకటి.. మొత్తం సంక్షోభం ప్రారంభమైన మనకు ఉత్తరాన ఉండే పొరుగుదేశం చైనా.. మరొకటి ఏదంటే సంక్షోభంలో కూరుకుపోయినప్పటికీ భారత్‌పై విమర్శలు గుప్పించకుండా ఉండలేని.. మనకు పశ్చిమాన ఉండే పొరుగుదేశం పాకిస్తాన్. మార్చి 22న చైనా కమ్యూనిస్టు పార్టీ అధికార ప్రతినిధి ఇలా ట్వీట్ చేశారు: 'మేడిన్ చైనావన్నీ అంటువ్యాధులు కలిగించేట్లయితే, చైనా ఫేస్‌మాస్కులు వాడొద్దు, చైనా పీపీఈలు వాడొద్దు, చైనాలో తయారైన వెంటిలేటర్లు వాడొద్దు. ఇలాగైతేనే మీరు వైరస్ తగలకుండా ఉండగలుగుతారు. 'ఈ ప్రపంచ సంక్షోభానికి తన చర్యలే కారణమైన చైనా (ప్రపంచానికి ఇంకా వాస్తవం తెలియవలసే ఉంది) ప్రదర్శించిన ఈ అహంకారం ప్రపంచం పట్ల ఆ దేశానికున్న అలక్ష్యాన్ని చూపుతోంది.

చాలా రోజులుగా వస్తువుల తయారీ పనుల్ని చైనాకి ఔట్‌సోర్స్ చేస్తోన్న ప్రపంచం ఇప్పుడు దాని ఫలితాలను ఎదుర్కొంటోంది. అమెరికాతో సహా ఎన్నో దేశాలు సాధారణ వైద్య పరికరాలు, ఔషధాల కోసం చైనామీద ఆధారపడి వున్నాయి. అమెరికా తనకు తక్షణ అవసరంగా ఉన్న ఈ ఔషధాలు, వైద్య పరికరాలు దొరక్క ప్రాణాంతకమైన నష్టాన్ని అనుభవిస్తోంది. చైనా అధికార వార్తా ఏజెన్సీ జిన్‌హువాను ఉటంకిస్తూ ది న్యూయార్క్ టైమ్స్‌లో ప్రచురితమైన ఒక వ్యాసం ప్రకారం, చైనా గనుక తన ఔషధాల ఎగుమతిని నిలిపివేస్తే, అమెరికా ఈ కరోనా వైరస్ అంటువ్యాధితో నాశనమైపోతుంది.

దీన్నించి ప్రపంచం నేర్చుకోవాల్సిన గుణపాఠం ఏమిటంటే చైనా మీద అతిగా ఆధారపడటాన్ని తగ్గించాలి. ఇది కేవలం కీలకమైన ఔషధాలు, వైద్యపరికరాల కోసం మాత్రమే కాదు, ఇతర రకాల వస్తుతయారీ పంపిణీవ్యవస్థలతో ముడిపడిన అన్నిటికీ వర్తిస్తుంది. దీనికి ఎంతో సమయం పట్టవచ్చు. విపరీతమైన ఖర్చు కావచ్చు. కానీ ప్రత్యేకించి ఇట్లాంటి ప్రాణాంతకమైన సందర్భాలలో చైనాకు బందీగా దొరికిపోకుండా ఉండటానికి అది పనికొస్తుంది. ఒక దేశ సూక్ష్మమైన మౌలిక



సదుపాయాల వ్యవస్థను ప్రభావితం చేయగల 5జి లాంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానంలో హువై లాంటి చైనా కంపెనీలను కలుపుకొని పోకపోవడం కూడా ప్రపంచానికి మేలుకొలుపు కావాలి.

అయితే వైద్య పరికరాల గురించి చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి పలికిన ప్రగల్భాలు ఉత్త అబద్ధాలని స్పెయిన్, చెక్ రిపబ్లిక్, ఉక్రెయిన్, ఫిలిప్పైన్స్, నెదర్లాండ్స్, టర్కీల నుండి వస్తున్న వార్తలు నిరూపిస్తున్నాయి. చైనా పంపిణీ చేసిన టెస్ట్ కిట్లు 30 శాతం మాత్రమే కచ్చితమైన ఫలితాలు ఇస్తున్నాయనీ, ఒక సందర్భంలో వాడేసిన మాస్కులు కూడా పంపినట్టుగానూ కొన్ని కథనాలు చెపుతున్నాయి.

చివరగా ఈ ప్రాణాంతకమైన వైరస్‌ను ప్రపంచానికి వ్యాపించేలా చేసిన పరిణామాలను చైనా ఎదుర్కోక తప్పదు. వూహాన్‌లో ఈ వైరస్ ఎలా ప్రారంభమయిందో ఇంకా చర్చించవలసి ఉన్నప్పటికీ దీని వ్యాప్తి జరిగిన తీరులో ఏ సందేహమూ లేదు. మనుషులలో ఒకరి నుంచి ఒకరికి ఇది వ్యాప్తి చెందుతుందని తెలిసికూడా వూహాన్‌తో సహా మరి కొన్ని ప్రదేశాల నుంచి సుమారు 70 లక్షల మందిని విదేశాలకు ప్రయాణించడానికి చైనా అనుమతించింది. ఇది నేరపూరిత చర్య. దీనికి చైనాను బాధ్యురాలిగా నిలబెట్టాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థకు ఎన్ని లంచాలు మేపినా, ఎంత సమాచారాన్ని తొక్కిపెట్టినా జవాబుదారీతనం నుంచి చైనా తప్పించుకోలేదు.

ఇక మన పశ్చిమాన ఉన్న పొరుగుదేశం పాకిస్తాన్ దానిలో అదే ఒక సమాఖ్య. ఫిబ్రవరి 25న మొదటి కేసు నమోదయినప్పటినించీ ఇప్పటికి 2400 కేసులకు ఆ సంఖ్య పెరిగింది. ప్రపంచమంతా ఈ వ్యాధిమీద పోరాడుతున్న సమయంలో జరిగిన సార్క్ దేశాల వీడియో కాన్ఫరెన్సులో పాకిస్తాన్ ప్రతినిధి జమ్మూ కశ్మీర్‌లో అమలులో ఉన్న నిర్బంధం గురించి ప్రస్తావన తెచ్చారు. పాక్ విదేశాంగ శాఖ, విదేశాంగ మంత్రి కూడా దీని గురించే పలు సందర్భాలలో పదే పదే ప్రస్తావించారు.

అంతర్జాతీయ శాంతి భద్రతలకు ముప్పుగా పరిణమించిన జమ్మూ కశ్మీర్ వ్యవహారాల పట్ల అత్యవసరమైన, అవశ్యమైన చర్యలు తీసుకోవాల్సిందిగా భద్రతామండలి అధ్యక్ష స్థానంలో ఉన్న చైనాను పాకిస్తాన్ లిఖితపూర్వకంగా కూడా కోరింది. అయితే ఈ 'అత్యవసరమైన' వినతిని స్వీకరించడానికి చైనా తిరస్కరించడం పాకిస్తాన్‌కు ఆశాభంగం కలిగించింది.

దీనికంటే ముందు పాకిస్తాన్ తన ఇంటిని తాను చక్కబెట్టుకోవాల్సి ఉంది. 'ఆజాద్' జమ్మూ కశ్మీర్, గిల్‌గిత్–బాల్టిస్తాన్‌లో కేసుల సంఖ్య దాదాపు 200కు చేరింది. మీడియా కథనాల ప్రకారం పంజాబ్‌లో కరోనా పాజిటివ్ వచ్చినవారిని ఈ ప్రాంతంలోని క్వారంటైన్ కేంద్రాలకు తరలించాలని పాకిస్తాన్ ఆర్మీ యోచిస్తుందని తెలియడం అశుభసూచకం.

పాకిస్తాన్ స్పందించిన తీరులో ప్రత్యేకించి నాలుగు అంశాలు గమనించ దగినవి. వైరస్ గనక వ్యాపిస్తే అక్కడ ఉన్న పడకలు, ఎన్–95 మాస్కులు, ఇంటెన్సివ్ కేర్ వార్డుల కొరత, తఫ్తాన్ లాంటి క్వారంటైన్ కేంద్రాల్లోని గుబులు పుట్టించే పరిస్థితుల వల్ల మొత్తం ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలుతుంది. 'మా దగ్గర కనీసం రేబిస్ వ్యాక్సిన్ కూడా లేదు. అలాంటిది వేలాదిమంది రోగులు కరోనా చికిత్స కోసం వస్తే ఏం చేయాలి?' అని ఒక డాక్టర్ వాపోయినట్టుగా ఒక మీడియా కథనం. వరుస ప్రభుత్వాలు ప్రజారోగ్యానికి కేటాయించిన అరకొర నిధుల ఫలితం ఇది.

అట్లాగే అధికార స్థానంలో ఎవరు ఉన్నారో కూడా తెలియని సందిగ్ధం నెలకొనివుంది. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందన్న కారణంగా ఇమ్రాన్ ఖాన్ లాక్‌డౌన్‌ను తిరస్కరించారు. కానీ, పీపీపీ అధికారంలో ఉన్న సింధ్ సహా కొన్ని రాష్ట్రాలు విభిన్న స్థాయిల్లో లాక్‌డౌన్‌ను అమలుచేశాయి. పంజాబ్, కేపీకే, బలూచిస్తాన్ దీన్ని అనుసరించాయి. రాష్ట్రాల్లో లాక్‌డౌన్ అమలయ్యేలా పనిచేస్తామని సైన్యం సంకేతమిచ్చింది. అంటే ఎవరు అధికారంలో ఉన్నట్టు?

మూడవది, ఇట్లాంటి క్లిష్టమైన సందర్భంలో కూడా దేశాన్ని ఏకీకృతం చేయగలిగే నాయకత్వ పటిమను ఇమ్రాన్‌ఖాన్ ప్రదర్శించలేకపోయాడు. పైగా ప్రతిపక్షాల మీద నిత్యం కయ్యానికి కాలుదువ్వే వైఖరితో వ్యవహరిస్తున్నాడు. పార్లమెంటు నాయకులకు ఉద్దేశించిన ఒక వీడియో కాన్ఫరెన్సులో ఆయన ప్రసంగించిన తర్వాత అందులో పాల్గొన్నవారి అభిప్రాయాలు వినకుండానే ఆఫ్‌లైన్ అయ్యాడు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కడంలో వారి సలహాలను తీసుకోవటం పట్ల ఆయనకు ఆసక్తి లేదు. నాలుగవది, ఇస్లామ్‌ను సంరక్షించే చివరి దేశం తనే అని పాకిస్తాన్ నమ్మకం. సౌదీ అరేబియా, ఇరాన్ లాంటి ఇతర ముస్లిం దేశాలు సమూహాలుగా జనం పోగయ్యే అన్ని మతపరమైన కార్యక్రమాలను నిషేధిస్తే పాకిస్తాన్ ప్రభుత్వం మాత్రం 'నియమిత సంఖ్య'లో మసీదులలో ప్రార్థనలకు అనుమతినిచ్చింది. నిజం చెప్పాలంటే పాకిస్తాన్ కొండవాలున ప్రమాదపుటంచున నిలుచుని వుంది. అది జమ్మూకశ్మీర్ గురించి రోదనా గానాలు చేయడం మాని తన పరిస్థితులను చక్కదిద్దుకోవాలి.

(ది ట్రిబ్యూన్ సౌజన్యంతో)

వ్యాసకర్త జాతీయ భద్రత సలహా మండలి సభ్యుడు

---

**సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!**




### సోషల్ మీడియా

#### విషాదం



నాలుగు దశాబ్దాలకు పైబడిన ఆ ప్రేమ బంధం తెగిపోయింది. కరోనా వైరస్‌కు చికిత్స పొందుతూ 68 ఏళ్ల ఆల్ ఫ్రెడ్ పెబటాట్, 64 ఏళ్ల సుసాన పెబటాట్ వారం రోజుల వ్యవధిలో న్యూజెర్సీలోని ఒక ఆసుపత్రిలో మరణించారు. ఒకే ఆసుపత్రిలో ఉన్నప్పటికీ వేర్వేరు అంతస్తుల్లో చికిత్సపొందుతుండటంతో చివరిసారిగా కూడా ఒకరినొకరు చూసుకోలేకపోయారు. మొదట్లో జ్వరం రావడంతో కరోనా పరీక్షల కోసం వాళ్లు వరుసగా మూడు రోజులపాటు ఉదయాన్నే ఏడుగంటలకల్లా కమ్యూనిటీ సెంటర్‌కు చేరుకునేవారు. కానీ, ప్రతిసారీ పరీక్షలు నిర్వహించే సామర్థ్యానికి మించి జనం రావడంతో వాళ్లు వెనుదిరగాల్సి వచ్చింది.

– విల్లీ జీస్ట్, జర్నలిస్ట్

#### వాట్సాప్



నకిలీ వార్తలపై వాట్సాప్ పట్టు బిగిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ పేరు చెప్పుకుని అనేకమంది సోషల్ మీడియాలో కొంతకాలంగా తప్పుడు కథనాలు అల్లుతున్నారు. ఇటువంటి పుకార్ల వ్యాప్తిని అరికట్టాలంటే వాట్సాప్‌ను కేవలం వ్యక్తిగత సమాచార మార్పిడికి మాత్రమే వినియోగిస్తే చాలా మంచిది.

– కరుణా నంది, న్యాయవాది

#### సహాయం



ఢిల్లీ అల్లర్ల సందర్భంగా వందమందికి పైగా ప్రాణాలు కాపాడిన అజబ్ సింగ్ ఇప్పుడు శివ్ విహార్‌లోని మూడువందల పేద కుటుంబాలకు ఆహారం అందిస్తున్నాడు. తన ఇళ్లలో అద్దెకున్నవారి అద్దెలను కూడా మాఫీ చేశాడు. కొంతమంది జర్నలిస్టులు, స్నేహితులు సుమారు 500 కేజీల సరుకులు అందించడం ద్వారా అతడికి సహకరిస్తున్నారు.

– స్మితా శర్మ, జర్నలిస్ట్

#### అత్యుత్తమం



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అద్భుతంగా స్పందించారు. సంక్షోభాన్ని దీటుగా ఎదుర్కొని తాను చేయగలిగినంత చేస్తున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి తన సంక్షోభ నివారణా చర్యలన్నింటినీ ఫేస్‌బుక్ లైవ్‌లకు మాత్రమే పరిమితం చేస్తుంటే, కోవిడ్ బాధితులకు చికిత్స అందించడం కోసం యోగి ఆదిత్యనాథ్ ఆరు ఆసుపత్రులను సిద్ధం చేయించారు. తబ్లిఘీతో సంబంధం ఉన్నవారిని కూడా క్వారంటైన్‌కు తరలిస్తామని చెప్పారు.

– షెఫాలీ వైద్య, రచయిత్రి

#### సితార



నేడు ప్రఖ్యాత సితార సంగీత విద్వాంసుడు పండిట్ రవిశంకర్ నూరవ జయంతి. లక్షలాదిమందికి తన సంగీతంతో ఆనందాన్ని కలిగించడమేగాక, భారతీయ సంస్కృతిని పాశ్చాత్యులు గౌరవించేలా చేశారు. ఆయన్ని రెండుసార్లు ఇంటర్వ్యూ చేసే అవకాశం నాకు దక్కింది. ప్రతిసారీ కూడా ఆయన గొప్పదనం అనుభవంలోకి వచ్చేది.

– వీర్ సంఘ్వీ, జర్నలిస్ట్

#### కృతజ్ఞతలు



ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ధైర్యంగా, నిరంతరం సేవలు అందిస్తున్న ఆరోగ్య కార్యకర్తలకు కృతజ్ఞతలు చెబుతున్నా. నిస్వార్థంగా తమ విధులను నిర్వహిస్తున్న వారి రుణాన్ని మనం జీవితంలో తీర్చుకోలేం.

– అభిషేక్ బచ్చన్, నటుడు

---

# కరోనాను మించిన వైరస్ చంద్రబాబు

**సందర్భం**



సి. రామచంద్రయ్య

గాంధీ టోపీలు ధరించిన వారందరూ గాంధీలు ఎలా కాలేరో.. మానవత్వం ముసుగులు ధరించి.. సోషలిజం పలుకులు పలికినంతమాత్రాన వారు పేదల పక్షపాతి కాలేరు. అవకాశం వచ్చినప్పుడు వారు మానవత్వం చూపించగలిగారా? పేదలకు న్యాయం చేయగలిగారా? అన్నదే కొలమానం. అవును మనం ఇప్పుడు తెలుగుదేశం అధినేత చంద్రబాబు గురించే మాట్లాడుకుంటున్నాం. కరోనా వైరస్ సృష్టిస్తున్న ఈ అనిశ్చిత పరిస్థితిలో కూడా బాబు తన చౌకబారు రాజకీయాలకు స్వస్తిపలకడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు రైతుల కష్టాలు పట్టలేదు. సామాన్యుల వెతలు విన్పించలేదు. సబ్సిడీలన్నా, సంక్షేమమన్నా రుచించలేదు. అలాంటి బాబు ఈ ప్రభుత్వానికి సంక్షేమ పాఠాలు చెబుతున్నారు.

రాష్ట్ర విభజన జరిగిన తర్వాత తొలి 5 ఏళ్లు ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించిన బాబు ఆ ఐదేళ్లలో దాదాపు 2 లక్షల కోట్ల రూపాయలు అప్పుగా తెచ్చినప్పటికీ.. రైతాంగానికి మాఫీ చేస్తానన్న రుణాలలో (రైతుల రుణాల మొత్తం రూ. 1 లక్షా 25 వేల కోట్లు కాగా.. అనేక షరతులు పెట్టి చివరకు తేల్చిన మొత్తం రూ. 24,000 కోట్లు మాత్రమే) రూ. 11,000 కోట్ల మేర ఎగనామం పెట్టారు. రైతులతోపాటు డ్వాక్రా మహిళలకు చేస్తామన్న రుణమాఫీ చేయనేలేదు. నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి ఇవ్వనేలేదు. దశలవారీగా చేస్తామన్న మద్యపాన నిషేధం హామీని అటకెక్కించారు. ఈ విషయాలన్నీ మర్చిపోయి ప్రతిపక్షంలోకి రాగానే ఆయన మానవతామూర్తి అవతారం ఎత్తారు. కరోనా వ్యాప్తి, లాక్‌డౌన్ నేపథ్యంలో ''రైతులకు ప్యాకేజీ ప్రకటించండి, గీత కార్మికుల్ని ఆదుకోండి, పేదకుటుంబాలకు నెలకు రూ. 10,000 ఇవ్వండి''.. అంటూ ఆయా వర్గాల పట్ల తనకేదో సానుభూతి ఉన్నదన్నట్లు బాబు ఎడాపెడా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లేఖలు సంధిస్తున్నారు. కరోనాను సాకుగా చేసుకొని ప్రతిరోజూ ప్రెస్‌మీట్లు పెట్టి సుదీర్ఘ ఉపన్యాసాలు ఇవ్వడం, తమ నాయకులతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహించి.. ఆ సమాచారాన్నంతా మీడియాకు అందించడం చేస్తున్నారు. పైగా, అదే సమాచారాన్ని అటూ, ఇటూ మార్చి తమ పార్టీ నేతలతో తిరిగి మాట్లాడించడం, పత్రికా ప్రకటనలు విడుదల చేయించడం రివాజుగా చేసుకున్నారు. వీరి ప్రకటనలలో నిర్మాణాత్మక సూచనలేమైనా ఉన్నాయా? అంటే కాగడాపెట్టి వెతికినా ఒక్కటీ కనపడదు. తను ఏమి చెప్పినా ఎదురు ప్రశ్నించకుండా చూపించడానికి కొన్ని టీవీ చానెళ్లు; ప్రచురించడానికి కొన్ని దినపత్రికలు ఉన్నాయి కనుక బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు.

పేదవాడి సంక్షేమం గురించి, రైతుల ప్రయోజనాల గురించి చంద్రబాబు ఈ రోజు కొత్తగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పాఠాలు చెప్పడం ఏమిటి? వైఎస్ జగన్ ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడే వివిధ వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రకటించిన 'నవరత్నాలు' చంద్రబాబు చెబితే చేసినవా? ఆయన సీఎంగా బాధ్యతలు స్వీకరించగానే అమలు చేస్తున్న ఈ వినూత్న సంక్షేమ, అభివృద్ధి పథకాలన్నీ చంద్రబాబు చెబితే చేస్తున్నవా? గ్రామ వాలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేస్తే దానిని అవహేళన చేసిన బాబు.. నేడు కరోనా వ్యాప్తి నిరోధానికి గ్రామ వాలంటీర్ల వ్యవస్థను ఉపయోగించుకోండంటూ చెప్పడం ఎంత హాస్యాస్పదం?

మూడు పర్యాయాలు సీఎంగా పనిచేసిన కాలంలో.. బాబు తనదైన ముద్రగలిగిన ఒక్క సంక్షేమ పథకాన్నైనా అమలు చేయగలిగారా? ఏపీలో పేదల కోసం అమలు చేసిన



సబ్సిడీ బియ్యం పథకం ఎవరిది? ఎన్టీఆర్ ప్రవేశపెట్టింది కాదా? బాబుతోసహా ఎంతోమంది సాధ్యం కాదని చెప్పినప్పటికీ రైతులకు ఉచిత విద్యుత్‌ను విజయవంతంగా అందించిన ఘనత డా।। వైఎస్ రాజశేఖరరెడ్డిది కాదా? చంద్రబాబు రైతులు, పేదల సంక్షేమానికి చేసిందేమిటి? అధికారంలో ఉన్నప్పుడు పేదలకు అందించే సబ్సిడీల్లో భారీ కోతలు పెట్టడం నిజం కాదా? పాతిక కేజీల సబ్సిడీ బియ్యాన్ని 20 కేజీలకు తగ్గించింది బాబు కాదా? రూ. 2 ల బియ్యాన్ని అధికారంలోకి రాగానే రూ. 5.50కి పెంచిన విషయం బాబు మరిచారా? సంస్కరణల పేరుతో గృహ విద్యుత్ చార్జీలను అమాంతం పెంచడమే కాకుండా చార్జీలను తగ్గించమని ఆందోళన చేసిన ఉద్యమకారులపై కాల్పులు జరిపించి వారి ఉసురు తీసిందెవరు? కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు కొమ్ముకాసి వారికి భారీ రాయితీలు అందించి పేదవాడిని హీనంగా చూసిన బాబు.. నేడు ప్రతిపక్షంలో కూర్చొని తానేదో గొప్ప మానవతామూర్తి మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వానికి 'ఇది చేయండి.. అది చేయండి'అంటూ ఉచిత సలహాలతో ఆడుతున్న డ్రామా వెనుక అసలు పరమార్థం గ్రహించలేని వెర్రివాళ్లా ప్రజలు? అదేనిజమైతే.. తాను ఎందుకు చిత్తుగా ఓడిపోవాల్సివచ్చిందో ఆలోచించుకోవాలి.

నిజానికి, ప్రపంచ మానవాళికి ముప్పుగా కరోనా వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో.. తెలుగు ప్రజలు ముందుగా గుర్తు చేసుకోవల్సిన వ్యక్తులు ఇద్దరు ఒకరు ఎన్టీఆర్, రెండు వైఎస్సార్. సబ్సిడీ బియ్యం పథకం ప్రవేశపెట్టి నిరుపేదలకు పోషకాహారాన్ని అందించిన వారు ఎన్టీఆర్ కాగా; పేదలు ప్రాణాంతక జబ్బుల బారినపడి వారు ఆర్థికంగా, భౌతికంగా చితికిపోయే పరిస్థితుల నుంచి తప్పిస్తూ 'ఆరోగ్యశ్రీ' వంటి గొప్ప పథకాన్ని, ఫీజుల రీయింబర్స్‌మెంట్ పథకంతో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తమ జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకొనే అవకాశాన్ని కల్పించి.. వీటితోపాటు అందరికీ అన్నం పెట్టే రైతన్నలు అప్పుల ఊబిలో కూరుకొని ఆత్మహత్యలు చేసుకోకుండా.. వ్యవసాయరంగానికి ఉచిత విద్యుత్, రుణాలమాఫీ కల్పించిన మానవతామూర్తి వైఎస్సార్. మన దేశ, రాష్ట్ర కాలమాన పరిస్థితులకు వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రెండూ కీలకం అని నమ్మిన వైఎస్సార్ అధికారంలోకి రాగానే వాటి అభివృద్ధికై అనేక పథకాలు ప్రవేశపెట్టారు. ఆయన హయాంలోనే చిన్న, మధ్య, భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికై 'జలయజ్ఞం' మొదలైన కారణంగానే నేడు ఉభయ తెలుగు రాష్ట్రాలలో.. సాగునీటి ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయి. రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాలు పండుతున్నాయి.

గత తొమ్మిది నెలలుగా బాబు ప్రతిపక్షనేతగా కూడా విఫలమయ్యారు. కరోనా మహమ్మారిని మించిన వైరస్ నేడు ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించి ఉంది. దీనికి ఏకైక ఔషధం ప్రజల విజ్ఞతే. ప్రజలు బాబు ప్రవర్తనను గమనిస్తూనే ఉన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజా సమస్యలపట్ల పూర్తి అవగాహన ఉంది. వాటిని పరిష్కరించే చిత్తశుద్ధి ఉంది. ప్రజల సహకారంతో తాత్కాలికంగా ఏర్పడిన ఈ ఇబ్బందులను విజయవంతంగా అధిగమించే ఆత్మవిశ్వాసం నిండుగా ఉంది.

వ్యాసకర్త మాజీ మంత్రి,
ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ

# హనుమద్విజయోత్సవం

హైందవులలో ఆబాలగోబాలమూ అభిమానంతో కొల్చుకొనే దేవుడు ఆంజనేయస్వామి. ఆత్మవిశ్వాసాన్నీ, క్లిష్ట కార్యనిర్వహణా స్ఫూర్తినీ, సామర్థ్యాన్నీ అనుగ్రహించే అంజనీపుత్రుడు బాలబాలికల నుంచి పండుముసలుల దాకా అందరికీ ఆప్తుడే. ఆపద్బాంధవుడే.

'హనుమంతుడు లంకకు చేరి సీతను దర్శించింది చైత్ర పూర్ణిమ నాడు. దానికి సరిగ్గా నలభై రోజుల తరువాత వైశాఖ బహుళ దశమి నాడు ఆయన జన్మదినం. ఈ రెండు తిథులూ ఆయన జీవితంలో ముఖ్యమైనవి కనుక ఈ రెండు తిథుల మధ్య నలభై రోజులు హనుమద్భక్తులు, హనుమ దీక్షావ్రతం అవలంబించటం ప్రశస్తం' అని ఉవాచ.

హనుమంతుడు లంకలో సీతను చూసి, రాముడి తరపున వచ్చినట్టు చెప్పాడు. అయితే ఆమె ఇచ్చిన చూడామణి అభిజ్ఞానాన్ని




తీసుకొని హనుమ వెంటనే తిరిగి వెళ్లలేదు. రావణ సేనతో యుద్ధం తప్పదని ఎలాగూ తేలిపోయింది. రాక్షసులు మొండివాళ్లు, వాళ్లతో సామోపాయం పని చేయదు. రావణుడు అమిత ధన సంపన్నుడు కనుక దానోపాయానికి లొంగడు. బల గర్వంతో మదించిన వాళ్లతో భేదోపాయమూ పొసగదు. కనుక హోరాహోరీ యుద్ధం తప్పదు. కానీ, రావణసేన శక్తి ఏపాటితో అంచనా కడితే ఒక ముఖ్యమైన పని పూర్తవుతుంది అనుకొన్నాడు.

అందుకే అశోకవనాన్ని ధ్వంసం చేశాడు. బందీగా (నటించి) దశకంఠుడి సముఖానికి వెళ్లాడు. ఆయన భృత్యులు తన తోకకు అంటించిన నిప్పుతో, దిగ్విజయంగా లంకా దహనం చేసి మరీ వెనుదిరిగాడు. అందుకే, ఆంజనేయుడు సీతా దర్శనం, లంకా దహనం అనే రెండు అద్భుత విజయాలను సాధించిన సందర్భాన్ని సంస్మరిస్తూ, చైత్ర పూర్ణిమనాడు హనుమద్విజయోత్సవం జరుపుకోవటం అత్యంత సముచితం.

ఈ ఏడు, ఈరోజు లాక్‌డౌన్‌లో ఉండి, కరోనా మీద దేశానికి అంతిమ విజయం కోరుకుంటూ, ఎందరో సుందరకాండ పారాయణ చేస్తున్నారు. వారికి 'ఈ హనుమద్విజయోత్సవ' దినం విశేష స్ఫూర్తి నిస్తుంది.

– ఎం. మారుతి శాస్త్రి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 8-4-2020



# తలుపులు తెరుద్దాం..

భారతదేశం లాక్‌డౌన్‌లో ఉండేసరికి ప్రతి ఒక్కరూ ‘తోచట్లేదు, బోర్ కొడుతోంది’ అంటూ ఎవరికి తోచినట్లు వారు పోస్టులు పెడుతున్నారు, టిక్‌టాక్‌లు చేస్తున్నారు. చిన్న వీడియోలు తీస్తున్నారు. ఇంత సృజన వాళ్లలో ఉందని లాక్‌డౌన్ వల్లే కదా తెలిసింది. ఎప్పటిలా ఉంటే తెలిసేనా?

ప్రకృతిని పరిశీలిద్దామా! ఎప్పటిలాగే సూర్యుడు తూర్పున ఉదయిస్తున్నాడు. తన లేలేత కిరణాలు, చురుకైన కిరణాలు, సంధ్యా కిరణాలు ప్రసరించి అలసిపోయి మళ్లీ అస్తమిస్తున్నాడు. లాక్ డౌన్ సూర్యుడిని ఏమీ చేయలేకపోయింది. ఉదయాన్నే నిద్ర లేవగానే అమ్మ ఆప్యాయంగా, ‘నాన్నా! నిద్రలేవరా! పాలు కలిపి ఉంచాను, నీకు ఇష్టమైన టిఫిన్ చేసి ఉంచాను’ అని పలకరించే ప్రేమాభిమానాలను లాక్‌డౌన్ ఏమీ చేయలేకపోయింది. రోజూ ఎవరి సమయానికి వారు కంచం పెట్టుకుని, నాలుగు మెతుకులు గబగబ మింగేసి, ఎవరి పనులకు వారు పరుగులు తీశాం. మరి ఇప్పుడో, పొద్దున్న తొమ్మిది అయ్యేసరికి అందరికీ డైనింగ్ టేబుల్ మీద ఉన్న ఆహారపదార్థాలు స్వాగతం పలుకుతున్నాయి. కుటుంబంతో ఆనందంగా గడిపే మధుర క్షణాలను లాక్‌డౌన్ ప్రసాదించింది. మనం లాక్‌డౌన్‌కు ఋణపడాల్సిందేగా.

కూరల కోసమో, మందుల కోసమో బయటకు వచ్చినప్పుడు వీధి కుక్కలు డొక్కలు ఎండిపోయి దీనంగా కనిపిస్తున్నాయి. మనం తినగా మిగిలిన అన్నాన్ని వాటికి పంచే దయాగుణం మనకు లాక్‌డౌన్ వల్ల అలవడటానికి అవకాశం వచ్చింది కదా. మనం తినగా మిగిలిన అన్నమే కాదు, వీలైతే నాలుగు ముద్దలు ఎక్కువ వండి, సాటి ప్రాణుల పట్ల దయను చూపి మనలోని మానవత్వాన్ని మేల్కొల్పిన లాక్‌డౌన్‌కు నమస్కరిద్దాం.

చాలామంది పదవీ విరమణ అయ్యాక, యవ్వనంలో కన్న కలలను సాకారం చేసుకునేవారు. కాని ఇప్పుడు యువతకు లాక్ డౌన్ ఈ వయస్సులోనే వారి సృజనకు పదును పెట్టే అవకాశం ఇస్తోంది. ఆఫీసులకు, కాలేజీలకు, స్కూళ్లకు వెళ్లాలంటే గంటలు గంటలు ప్రయాణించాలి. ఆ సమయమంతా ఇప్పుడు మిగులుతోంది. సమయాన్ని సద్వినియోగం చేసుకుని, మనలోని సృజనకు పదును పెట్టడానికి కలాలు, కుంచెలు, గిటార్‌లు, కెమెరాలు, కీ బోర్డులు... అటకెక్కిన మన కళారాధనను బూజు దులిపి బయటకు తీద్దాం. సాధన ప్రారంభిద్దాం. ఎంతో కొంత నైపుణ్యాన్ని సాధిద్దాం. ఆత్మానందం పొందడానికి లాక్‌డౌన్ ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకుందాం.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి వడ్లగింజలు, విశ్వనాథ వేయి పడగలు, బుచ్చిబాబు చివరకు మిగిలేది, గోపీచంద్ అసమర్థుని జీవయాత్ర. అడవి బాపిరాజు నారాయణ రావు, ఉషశ్రీ జ్వలితజ్వాల, శ్రీశ్రీ మహాప్రస్థానం, తిలక్ కథలు, నారాయణరెడ్డి కర్పూర వసంతరాయలు, ఆరుద్ర సమగ్రాంధ్ర చరిత్ర, యద్దనపూడి సెక్రటరీ, యండమూరి వెన్నెల్లో ఆడపిల్ల.. ఒకరేమిటి... నచ్చిన రచయితల పుస్తకాల దుమ్ము దులిపి పుస్తక పఠనం కొనసాగిద్దాం. వీటితో పాటు మన ఆత్మీయులను ఒక్కసారి గుర్తు తెచ్చుకుని, ప్రేమగా లకరిద్దాం. ఆత్మీయతలకు, అనుబంధాలకు లాక్‌డౌన్ లేదని గుర్తు చేసుకుందాం. వీలైతే వారితో ఆన్‌లైన్ ఆటలు ఆడదాం. మానవ సంబంధాలకు లాక్‌డౌన్ లేదుగా! ఇంటి నుంచి ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లే, సంబంధ బాధ్యతలనూ సంతోషంగా ఆహ్వానిద్దాం.

ఏది జరిగినా మన మంచికే అనే భారతీయ సిద్ధాంతాన్ని గౌరవిద్దాం. లాక్‌డౌన్‌ను ఒక సదవకాశంగా భావించి, మనం చేయాలనుకున్న, సాధించాలనుకున్న, నేర్చుకోవాలనుకున్న, నిరంతరం చేయాలనుకున్నవన్నీ చేయడానికి... ‘ఇది సమయము, మించినన్ దొరకదు, త్వరంగొనుడు సుజనులారా, భలే మంచి చౌక బేరము’ (శ్రీకృష్ణతులాభారం లో నారదుడు పాడిన పాట) అని హాయిగా ఆలాపిద్దాం. బంధాలు, అనుబంధాలు పెంచుకుందాం... మనలను మనం బంధవిముక్తుల్ని చేసుకుందాం. ఆ పని ఇప్పుడే ప్రారంభిద్దాం. మాయాబజార్‌లో చెప్పినట్టుగా ఇదియే మన తక్షణ కర్తవ్యం.

– వైజయంతి పురాణపండ



> పాండవులు పదమూడేళ్లు అరణ్యవాసం, ఒక ఏడాది అజ్ఞాతవాసం చేశారు. అరణ్యవాసం అంటే వాళ్లకి క్వారంటైనే మరి. ఐదుగురూ స్వీయ నియంత్రణలో ఉన్నారు. ఆ పదమూడేళ్లు ఖాళీగా, సమయాన్ని భారంగా గ డపలేదు. దుష్ట సంహారం చేశారు. అతిథి మర్యాదలు చేశారు. పశుపక్ష్యాదులకు రక్షణగా నిలిచారు. అన్నదమ్ములంతా ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకున్నారు. అజ్ఞాతవాసాన్ని ఆనందంగా గడిపారు. ఆ సమయంలోనే ధర్మరాజు తన చదరంగ క్రీడకు పదును పెట్టాడు. భీముడిలోని పాకశాస్త్ర నైపుణ్యాన్ని వెలికితీశాడు, అర్జునుడు తన నాట్యకళతో విరటుని కుమార్తె ఉత్తరను అభినేత్రిని చేశాడు. ఇక నకుల సహదేవులు ఆవులను, గుర్రాలను సంరక్షించారు. ద్రౌపది సైరంధ్రిగా మంచి హెయిర్‌స్టయిలిస్టుగా విరాటరాజు భార్య ను అలంకరించింది. వీరంతా సమయాన్ని వృథా చేసుకోలేదు. లాక్‌డౌన్‌లో ఉన్నామని చింతించలేదు. నైపుణ్యాలను వెలికి తీశారు.

# అన్నపూర్ణమ్మ

## రైట్ పర్సన్‌కు రాంగ్ నంబర్



ఆర్తి మధుసూదన్

ఏప్రిల్ ఒకటో తేదీ, చెన్నైలో ఉన్న ఆర్తికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ చేసిందెవరో తెలియదు. తన కాంటాక్ట్స్‌లో ఉన్న నంబరు కాదు. ట్రూ కాలర్ చూపిస్తున్న పేరు కూడా తనకు తెలిసినది కాదు. అయినా ఆ ఫోన్ కాల్ ఆన్సర్ చేసిందామె. ‘అవసరం లేకపోతే ఎవరైనా ఎందుకు ఫోన్ చేస్తారు? తెలియని వారి నుంచి వచ్చిన ఫోన్ కాల్ అయినా సరే... వారు తెలియని కారణంగా ఫోన్ తీయకపోవడమేంటి’ అనే ఆమె తత్వమే ఆ ఫోన్ కాల్‌ను కూడా ఆన్సర్ చేసేలా చేసింది. ఆమె ఫోన్ ఆన్సర్ బటన్ తాకిందో లేదో... ‘హలో’ అనే లోపే ఆవేదన నిండిన ఒక గొంతు ఆక్రోశమంతా వెళ్లగక్కింది. ‘‘అన్నం తిని మూడు రోజులైంది. మీరు వెంటనే ఏదైనా చేయండి’’ అది అర్థింపో, వేడికోలో కూడా అర్థం కావడం లేదు ఆర్తికి. అంతకంటే మరేదో ఉందా గొంతులో. ‘అమ్మా! నాకు ఆకలవుతోంది. అన్నం పెట్టు. ఇంతసేపు అన్నం పెట్టకుండా ఏం చేస్తున్నావ్, త్వరగా పెట్టు’ అంటూ పిల్లవాడు తల్లి కొంగును గుంజుతుంటాడు. మరేమీ పాలుపోక వెంటనే అన్నం కలిపి పెట్టేంతగా ప్రభావితం చేస్తుంది పిల్లల హఠం. ఫోన్‌లో వినిపిస్తున్న వ్యక్తి మాటలు కూడా అలాగే ఉన్నాయి. సొంత తల్లిని అడుగుతున్నట్లే హక్కులాంటిదేదో ధ్వనిస్తుందా గొంతులో. ఎవరో తెలియదు, ఆకలితో ఉన్నారని మాత్రం తెలుస్తోంది. అతడు ఎక్కడున్నాడో తెలుసుకుంది ఆర్తి. అతడు మాట్లాడుతున్నది హోసూర్ నుంచి. అతడు హోసూరుకు వచ్చింది జార్ఖండ్ నుంచి. జార్ఖండ్ నుంచి హోసూరుకు వచ్చిన వలస కూలీ అతడు. కోవిడ్ కోరల్లో చిక్కుకున్న ఒక అభాగ్య జీవి. పని లేదని మానుకోదు ఆకలి. తన టైమ్‌కి తాను దాడి చేసి తీరుతుంది. పట్టెడన్నం పెట్టి ఆ దాడికి అడ్డుకట్ట వేయమంటోందా ఫోన్. చెన్నై నుంచి హోసూరుకు మూడు వందల కిలోమీటర్లు. ఐదు గంటల ప్రయాణం. ఆర్తి వెంటనే హోసూరులో తనకు తెలిసిన వారికి సమాచారం ఇచ్చి జార్ఖండ్ వ్యక్తికి నిత్యావసర సరుకులు అందే ఏర్పాటు చేసింది. ‘ఆ వ్యక్తి తనకే ఎందుకు ఫోన్ చేశాడు? తన నంబర్ ఎలా తెలిసింది’ అని కొన్ని క్షణాల పాటు ఆలోచించింది ఆర్తి. ఆ తర్వాత మర్చిపోయింది.

**రెండో రోజు కూడా**

ఏప్రిల్ రెండో తేదీ కూడా మళ్లీ ఫోన్. ఈసారి జార్ఖండ్ వ్యక్తి కాదు, మరొకరు. ఈసారి వచ్చిన ఫోన్ కాల్ ఒకరి ఆకలి గురించి కాదు. ఏకంగా నూటా తొంబయ్ ఎనిమిది మంది ఆకలి. దేశంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చి భవన నిర్మాణరంగంలో దినసరి కూలీలుగా పని చేస్తున్న వాళ్ల నుంచి. లాక్‌డౌన్ ప్రకటించిన వెంటనే కాంట్రాక్టర్‌లు పనులు మానేసి తమ కార్లలో సొంతూళ్లకు వెళ్లిపోయారు. కార్మికులు మాత్రం తాత్కాలిక గుడారాల్లో మిగిలిపోయారు. వాళ్ల దగ్గర ఉన్న డబ్బు అయిపోయింది. అన్నం పెట్టే వాళ్ల కోసం ఎదురుచూపులు మొదలయ్యాయి. ఆర్తికి వచ్చిన రెండో ఫోన్ అదే. ఆ తర్వాత మంగుళూరు నుంచి అలాంటిదే మరో ఫోన్.




ఐదు రోజుల్లోనే ఆమెకు పదికి పైగా ఫోన్ కాల్స్ వచ్చాయి. రెండు వందల పదిహేడు మంది ఆకలి పిలుపులవి. అన్నం పెట్టమనే వేదనలవి. ఆమె స్వయంగా కొందరికి, సోషల్ మీడియా ద్వారా మరికొందరికి సహాయం చేసింది.

**అంకె మారింది**

అంతమంది అన్నం పెట్టమని తనను అడగడంలోని ఆంతర్యం ఆర్తికి వారిని స్వయంగా కలిసినప్పుడు తెలిసింది. తమిళనాడు ప్రభుత్వం కోవిడ్ లాక్‌డౌన్‌లో చిక్కుకుపోయి, పనుల్లేక ఆకలితో అలమటిస్తున్న వాళ్లకు సహాయం చేయడానికి ఒక హెల్ప్‌లైన్ నంబరు ఇచ్చింది. ప్రభుత్వం విడుదల చేసిన ఫోన్ నంబరులో పొరపాటున ఒక అంకె మారిపోయింది. ఆ అంకె మారగా వచ్చిన నంబరు ఆర్తి మధుసూదన్‌ది. అందుకే ‘అమ్మా! ఆకలి’ అంటూ ఆమెకు ఫోన్ కాల్స్ వచ్చాయి. ప్రభుత్వం పొరపాటుగా నంబరు తప్పుగా విడుదల చేయడం కొత్తేమీ కాదు. కానీ అలా వచ్చిన ఫోన్ కాల్స్‌కు స్పందించి అడిగిన వారి ఆకలి తీర్చడమే కొత్త. అన్నం పెట్టే అన్నపూర్ణ వంటి మనసున్న ఆర్తికే అలాంటి ఫోన్‌లు రావడం ఓ విచిత్రం. ఆర్తి మధుసూదన్ ఏప్రిల్ ఒకటి నుంచి ప్రతి డెవలప్‌మెంట్‌నీ ఫేస్‌బుక్‌లో షేర్ చేసింది. సమాచారం సంబంధిత అధికారులకు చేరింది. ఆరవ తేదీ నుంచి ఆమెకు ‘అకలమ్మా’ అనే ఫోన్‌లు రావడం లేదు. ‘‘బహుశా ప్రభుత్వం హెల్ప్‌లైన్ నంబరును సరి చేసి ఉండవచ్చు’’ అంటోంది ఆర్తి.

– మంజీర

ఆదర్శం

# మేమున్నాం..

కరోనా కర్ఫ్యూలో ఎక్కువగా ఇబ్బంది పడ్తోంది సీనియర్ సిటిజన్సే. అందులోనూ చదువులు, ఉద్యోగాల రీత్యా వేరే ఊళ్లు, రాష్ట్రాలు, దేశాల్లో స్థిరపడిపోయిన పిల్లల తల్లిదండ్రులే! అలాంటి వాళ్లకు మేమున్నామంటూ సహాయం చేయడానికి చాలా మంది ముందుకు వస్తున్నారు. ఈ సర్వీస్‌లో పుణె అగ్రస్థానంలో ఉంది. ఫ్రెండ్స్ ఎట్ సీనియర్ సిటిజన్ గ్రూప్, అన్నపూర్ణ గ్రూప్ వంటివి.. పిల్లలు దగ్గర లేక ఒంటరిగా ఉన్న వృద్ధులకు అండగా ఉంటున్నాయి. ఈ గ్రూప్స్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్న సీనియర్ సిటిజన్‌లకు ఫోన్ చేసి వాళ్ల అవసరాలు తెలుసుకుంటారు ఈ గ్రూప్ వలంటీర్లు. మందులు, నిత్యవసర సరకులు... ఇలా ఏది కావాలంటే అది వాళ్లకు తెచ్చి పెడ్తారు. అంతేకాదు వంట చేసుకునే ఓపిక లేని పెద్దవాళ్లకు.. కోరినవి వండి ఇంటికి తెచ్చిస్తున్నారు కూడా. వాకింగ్‌కు వెళ్లాలనుకునే వాళ్లను వాకింగ్‌కి తీసుకెళ్తున్నారు భౌతిక దూరం పాటిస్తూనే. డయాబెటిస్, బీపీ వంటివి చెక్ చేసుకోవాలనుకున్న వాళ్లకు ఇంటికే హెల్త్ వలంటీర్లను రప్పించి పరీక్షలు చేయిస్తున్నారు. అయితే ఈ సేవలన్నిటినీ అందిస్తున్న తమ స్వచ్ఛంద కార్యకర్తల ఆరోగ్యాన్నీ ఏమాత్రం నిర్లక్ష్యం చేయట్లేదు గ్రూపు నిర్వాహకులు. వలంటీర్లకు మాస్కులు, గ్లోవ్స్, శానిటైజర్స్ అన్నీ అమరుస్తున్నారు.

‘కరోనా పరిస్థితుల్లో వల్నరబుల్‌గా ఉన్నది పెద్దవాళ్లే. పిల్లలు తమ దగ్గరలేని తల్లిదండ్రుల బాధ చెప్పడానికి వీల్లేదు. అక్కడ పిల్లలు ఎలా ఉన్నారోనని బెంగ ఒక వైపు.. ఇక్కడ తాము ఒంటరి అయిపోయామనే దిగులు ఒకవైపు వాళ్లను కుంగదీస్తున్నాయి. ఈ సమయంలో అలాంటి వాళ్లకు హెల్ప్ చేయడాన్ని మించిన సంతోషం ఇంకేం ఉంటుంది? సరుకులు, మందులు, పుడ్డు ఇవ్వడానికి వెళ్లినప్పుడు మమ్మల్ని తమ ఆత్మీయులుగా భావించి కూర్చోమంటారు.. మేం కబుర్లు చెబితే వినాలని ఆరాటపడ్తుంటారు.. ఇదంతా చూస్తుంటే... మనుషుల మధ్య స్నేహం, ఆత్మీయానుబంధాలన విలువ చెప్పడానికే కరోనా వచ్చిందేమో అనిపిస్తోంది’ అంటారు ఫ్రెండ్స్ ఎట్ సీనియర్ సిటిజన్ గ్రూప్ వ్యవస్థాపకులు గౌరీ పాల్కె, సొనాలి రసల్.

ఒక్క మన దేశంలోనే ప్రపంచమంతటా ఇలాంటి గ్రూప్స్ మొదలయ్యాయి ఆయా దేశాల్లోని సీనియర్ సిటిజన్స్‌కు సాయం అందించడానికి. అమెరికా, ఇంగ్లండ్ వంటి దేశాల్లో నిత్యవసర సరుకులు అమ్మే దుకాణదారులే వృద్ధులకు కావల్సిన వస్తువులను వాళ్ల ఇంటికి పంపిస్తున్నారట. న్యూయార్క్‌లో కరోనా కష్టం కళ్లకు కడుతోంది. అక్కడ చదువు, కెరీర్ కోసం వివిధ దేశాల నుంచి వచ్చిన దాదాపు పదమూడు వందల మంది యువతీయువకులు ఒక్క రోజులోనే ఒక గ్రూప్‌గా ఏర్పడి న్యూయార్క్‌లోని వృద్ధుల పట్ల శ్రద్ధ వహిస్తున్నారట.



సీనియర్ సిటిజన్స్‌కు సేవలందిస్తున్న ఫ్రెండ్స్ ఎట్ సీనియర్ సిటిజన్ గ్రూప్ సభ్యులు



గౌరీ పాల్కె, సొనాలి రసల్

## లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్

### ఊరికి చెడ్డ పేరు




కరోనా గ్రామం

ఒకరు ఎక్కడో ఒక గొప్పపని చేస్తారు. దేశంలో ఆ పేరు ఉన్నవారందరికీ ఆ గొప్ప.. కొద్దో గొప్పో దక్కుతుంది. దీనికి రివర్స్‌గా కూడా జరుగుతుంటుంది. ఒకరు ఎవరో ఒక చెడ్డ పని చేస్తారు. ఆ పేరు ఉన్న వాళ్లందరూ తమ ఇమేజ్ పోయినట్లు బాధపడతారు. యు.పి.లోని లక్నోకు 90 కి.మీ. దూరంలో ఉన్న ‘కరోనా’ గ్రామం ఇప్పుడు ఆ చెడ్డ పేరును మోస్తోంది! గ్రామంలో 3000 మంది జనాభా ఉంటారు. వాళ్లకిప్పుడు తమ గ్రామం పేరు తలవంపుగా అనిపిస్తోంది. పైగా చుట్టు పక్కల గ్రామాల వాళ్లకు ఈ గ్రామం ఒక జోక్ అయిపోయింది. ఇక్కడి వాళ్లు జిల్లా కేంద్రానికి ఫోన్ చేసి ‘కరోనా నుంచి మాట్లాడుతున్నాం’ అని చెప్పగానే అక్కడి ప్రభుత్వ కార్యాలయాల నుంచి సరైన స్పందన రావడం లేదు. ఇలాంటి గ్రామమే ఒడిశాలోనూ ఒకటి ఉంది. వారిదీ ఇదే అనుభవం. కరోనా వదిలి వెళ్లాక, ఊరి పేరును కూడా వదిలించుకోవాలని (మార్పించుకోవాలని) చూస్తున్నారట ఆ రెండు గ్రామాల వాళ్లూ.

### వైద్య ప్రధాని వీరు



ఐర్లాండ్ ప్రధాని వరాడ్కర్

ఐర్లాండ్ ప్రధాని లియో వరాడ్కర్ కరోనా బాధితులకు వైద్యసేవల్ని అందించడం కోసం మెడికల్ ప్రాక్టీషనర్‌గా తిరిగి తన పేరును నమోదు చేయించుకున్నారు. మరి ప్రధానిగా ఎవరుంటారు? ఆయనే ఉంటారు. కానీ ప్రధానిగా మాత్రమే ఉండిపోరు. వారానికి ఒకరోజు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఒక షిఫ్ట్ అంతా డాక్టర్‌గా పని చేస్తారు. రాజకీయాల్లోకి రాక ముందు ఆయన ఏడేళ్లు వైద్యవృత్తిలోనే ఉన్నారు. దేశం సంక్షోభంలో ఉన్నప్పుడు దేశాన్ని గట్టెక్కించడం ప్రధాని బాధ్యత అయినట్లే, దేశ ప్రజలు మహమ్మారి బారిన పడుతున్నప్పుడు వారికి చికిత్స చేయడం కూడా వైద్యం తెలిసిన ప్రధానిగా తన కనీస ధర్మం అని ఆయన భావించినట్లున్నారు.

### కాపాడి ఫైన్ వేశారు



మనిషి కిందున్నాడు

లాక్‌డౌన్‌లో పాపం ఈ మధ్య ఒక హైదరాబాద్ గృహస్థు బ్రాండెడ్ గోధుమ పిండి కోసం శ్రీనగర్ కాలనీ నుంచి, చింతలబస్తీకి మూతికి గుడ్డ కట్టుకుని వచ్చి మీడియాకు బుక్ అయిపోయాడు. సేమ్ ఇలాగే ఒక పాశ్చాత్య ధూమపాన ప్రియుడు సిగరెట్‌ల కోసం ఫ్రాన్స్ నుంచి స్పెయిన్‌కి కాలినడకన బయల్దేరి, ఒక కందకంలో చిక్కుకుని.. సరిహద్దు పిరనీస్ ప్రాంతంలో గగనతలంపై హెలీకాప్టర్‌లో గస్తీ కాస్తున్న ఫ్రెంచ్ మౌంటేన్ పోలీసుల కంటపడ్డాడు. వెంటనే వాళ్లు కిందికి దిగి, కందకం నుంచి ఆ వ్యక్తిని తాళ్లతో పైకిలాగి ప్రాణాలు కాపాడారు. లాక్‌డౌన్‌ను ఉల్లంఘించినందుకు 11 వేల రూపాయల (మన కరెన్సీలో) జరిమానా కూడా విధించారు. అదే మనిషి ముందొకసారి సిగరెట్‌ల కోసం బైక్ మీద ఫ్రాన్స్ నుంచి స్పెయిన్ వెళుతుంటే ఆ కొండలు, గుట్టల్లోనే ఆ ఏరియా పోలీస్‌లకు పట్టుబడి వెనక్కి మళ్లాడు.

### దూరం జరిపించారు



‘చెన్నై ఎక్స్‌ప్రెస్’ లో దీపిక, షారుఖ్

‘కరోనా చేతికి చిక్కకండి.. మనిషికి మనిషికి దూరం పాటించండి’ అని పోలీసులు ఎన్ని విధాలుగా వీలైతే అన్ని విధాలుగా నెత్తీనోరు మొత్తుకుంటున్నారు. కొందరైతే కూల్‌గా క్రియేటివ్‌గా చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ‘చెన్నై ఎక్స్‌ప్రెస్’ సినిమాలో రైల్వేస్టేషన్‌లోని ఒక పొడవాటి బెంచీ మీద దీపికా పడుకోన్, షారుఖ్ ఖాన్.. ఈ చివరొకరు, ఆ చివరొకరు ఎడమొహం, పెడమొహంగా కూర్చొని ఉండే సీన్ ఉంది. ఆ సీన్‌ని నాగపూర్ పోలీసులు కరోనా సోషల్ డిస్టెన్సింగ్‌కి ఒక మీమ్‌గా వాడుకుని ట్విట్టర్‌లో పెట్టారు. ఇటీవల ఢిల్లీ పోలీసులు కూడా.. ‘ఏప్రిల్ ఫూల్స్ డే’ కి కరోనాపై వదంతులు వ్యాపింపజేయొద్దని చెప్పడానికి హ్యారీపోట్టర్ లోని ఒక సన్నివేశాన్ని మీమ్‌గా షేర్ చేశారు. చూస్తుంటే కరోనా డ్యూటీ మొత్తం పోలీసులది, వైద్యులదే అన్నట్లుగా ఉంది. మనమూ చేయాలి కదా.. ‘పాటించడం’ అనే డ్యూటీని!

కరోనా టైమ్

# గొప్పవాడివయ్యా

**ఇండియన్ ఆర్మీలో జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్‌గా బార్డర్‌లో శత్రువులతో పోరాటం చేసే యోధుడు సుధీర్‌కుమార్. ఇప్పుడు కరోనా వైరస్‌పై జరిగే పోరులోనూ నేను సైతం అంటున్నాడు.**

సుధీర్‌కుమార్ వయసు 43. ప్రస్తుతం అమృత్‌సర్‌లో విధులను నిర్వర్తిస్తున్నాడు. నెలరోజుల దీర్ఘకాలిక సెలవు మీద బీహార్‌లోని మోతిహరి జిల్లా జత్వాలియా గ్రామంలోని తన ఇంటికి వచ్చాడు కూతురు పెళ్లి జరిపించడానికి. పెళ్లి కోసమని 4 లక్షల రూపాయల లోను తీసుకున్నాడు. ఈ టైమ్‌లో లాక్‌డౌన్ వచ్చింది. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కారణంగా మరికొన్ని రోజులు తన లీవ్ పొడిగించమని అతను పనిచేస్తున్న యూనిట్‌కు ముందుగానే మెసేజ్ పంపాడు. ఈ టైమ్‌లోనే సుధీర్ తన కుటుంబంతో కలిసి కరోనా వైరస్‌పై సమరశంఖం పూరించాడు. గ్రామంలో ఈ వైరస్‌కు సంబంధించిన సమాచారం ఇస్తూ ప్రజల్లో అవగాహన కలిగిస్తున్నాడు. అంతేకాదు మాస్కులు సొంతంగా తయారు చేస్తూ వాటితో పాటు పేదలకు కావల్సిన నిత్యాసవసర సరుకులన్నీ ఉచితంగా అందజేస్తున్నాడు.

**ఇంటి నుంచే పోరాటం..**

‘మేం మా అబ్బాయిని మాస్క్‌లు కొనుక్కురమ్మని పంపినప్పుడు విపరీతమైన డిమాండ్ ఉందని, మాస్క్‌లు దొరకడం లేదని తెలిసింది. అంతేకాదు, ఒక్కో మాస్క్ చాలా ఎక్కువ ధరకు అంటే దాదాపు రూ. 200కు అమ్ముతున్నారు. అయినా, వైరస్‌కు భయపడి ఖరీదైన మాస్క్‌లు కొనాలనే జనం ఆలోచన. ఆ మాస్క్‌లను చూసిన తర్వాత వాటిని ఇంట్లోనే ఎందుకు తయారు చేయకూడదు అనుకున్నాడు సుధీర్.

అతను శిక్షణ కోసం వెళ్లినప్పుడు అతని భార్య కుటుంబ పనుల్లో భాగంగా నేర్చుకున్న కుట్టుపని ఇప్పుడు సాయపడింది. దీంతో సుధీర్ నిర్ణయానికి కుటుంబం నుంచి వెంటనే బలం చేకూరింది. తన గ్రామంలోని ప్రజలకు ఫేస్‌మాస్క్‌లు తయారుచేసి పంపిణీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని సుధీర్ చెప్పాడు. ఇంట్లో ఒక కుట్టు మిషన్ ఉంది. మరో కుట్టు మిషన్, ముసుగులు తయారు చేయడానికి కావల్సిన సరంజామాను సిద్ధం చేసుకున్నాడు. ఇలాంటి పరీక్ష సమయంలో దేశానికి ఎంతో కొంత సేవ చేయాలని సుధీర్ సంకల్పించాడు.

**రక్షణ కేంద్రంగా...**

సుధీర్ జిల్లా వైద్యాధికారితో సంప్రదించి, అతని సూచనలతో ఈ మాస్క్‌లను తయారుచేశాడు. భార్యతో కలిసి 4 వేల మాస్క్‌లను తయారు చేసి తమ ఊరివాళ్లకు, పొరుగూళ్లకు కూడా ఉచితంగా అందజేస్తున్నాడు.

సుధీర్, అతని కుటుంబం ‘సామాజిక దూరం’ పాటించడంలో తమ గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సుధీర్ గ్రామం చిన్నదైనా జాగ్రత్తలు తీసుకోవడంలో రక్షణ కేంద్రంగా ఉంది. ‘రోజులో ఎక్కువ సమయం మాస్క్ ధరిస్తే మరో మాస్క్ కోసం నా దగ్గరకు వచ్చి తీసుకెళ్లు. కానీ, దానిని ఉతికి వాడాలనుకోకు’ అని మాస్క్ ధరించి మరీ చెబుతున్నాడు.

**కూతురి పెళ్లికోసం దాచిన డబ్బును...**

జూనియర్ ర్యాంక్ అధికారిగా ఉన్న సుధీర్ సంపాదన ఎక్కువేమీ కాదు. అతని సంపాదన కుటుంబ అవసరాలకే సరిపోదు. కానీ, దేశం సంక్షోభంలో ఉన్నందున తన కూతురు పెళ్లి కోసం తీసుకున్న వ్యక్తిగత రుణాన్ని ప్రజలకు సేవ చేయడానికి ఉపయోగిస్తున్నాడు. గ్రామంలో పేదలకు కావల్సిన పప్పు, ఉప్పు, కూరగాయలను, ఇతర నిత్యావసరాలను ఉచితంగా అందిస్తున్నాడు. ఎవరికి ఎప్పుడు సరుకులు కావాలన్నా వచ్చి తీసుకెళ్లొచ్చు అని బోర్డు పెట్టి మరీ చెబుతున్నాడు. ఇతరులకు సాయం చేయడం ద్వారా నాకు డబ్బు కొరత ఉండదు. కానీ, వెలకట్టలేనన్ని ఆశీస్సులు నాకు అందుతాయి’ అని అంటున్నాడు సుధీర్.

– ఆరెన్నార్





సాక్షి స్పోర్ట్స్
బుధవారం
8-4-2020



# 102 ట్రోఫీలు... 102 వ్యక్తులకు విక్రయించి...

- భారత జూనియర్ గోల్ఫర్ అర్జున్ భాటి వినూత్న వితరణ
- రూ. 4 లక్షల 30 వేలు పీఎం–కేర్స్ ఫండ్‌కు అందజేత

**న్యూఢిల్లీ:** వయోభేదం లేకుండా... సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా... జాతీయ, అంతర్జాతీయస్థాయి హోదా పట్టించుకోకుండా... కరోనా మహమ్మారిని ఓడించడానికి... ఈ పోరాటంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమవంతుగా భారత క్రీడాకారులందరూ చేయూతనిస్తున్నారు. ఇటీవల తెలంగాణకు చెందిన 15 ఏళ్ల షూటర్ ఇషాసింగ్ తాను దాచుకున్న రూ. 30 వేలను ప్రధాన మంత్రి సహాయనిధికి అందజేయగా... గ్రేటర్ నోయిడాకు చెందిన 15 ఏళ్ల భారత జూనియర్ గోల్ఫ్ క్రీడాకారుడు అర్జున్ భాటి వినూత్న పద్ధతిలో వితరణ మొత్తాన్ని సేకరించాడు. జూనియర్‌స్థాయిలో మూడుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన అర్జున్ భాటి క్రీడాకారుడిగా గత ఎనిమిదేళ్లలో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో 150 టోర్నమెంట్‌లలో పాల్గొన్నాడు. ఈ క్రమంలో తాను గెల్చుకున్న 102 ట్రోఫీలను 102 వ్యక్తులకు విక్రయించాడు. ఈ విక్రయాల ద్వారా వచ్చిన మొత్తం రూ. 4 లక్షల 30 వేలను ప్రధానమంత్రి సహాయనిధికి విరాళం ఇచ్చి ఆదర్శంగా నిలిచాడు. అంతకుముందు అర్జున్ అమ్మమ్మ తన ఏడాది పెన్షన్ మొత్తాన్ని (రూ. 2,06,148) పీఎం కేర్స్ ఫండ్‌కు విరాళంగా ఇవ్వడం విశేషం.

# గావస్కర్ విరాళం రూ. 59 లక్షలు

- భారత్ తరఫున 35 సెంచరీలు చేసినందుకు పీఎం–కేర్స్ ఫండ్‌కు రూ. 35 లక్షలు
- ముంబై తరఫున 24 సెంచరీలు చేసినందుకు మహారాష్ట్ర సీఎం ఫండ్‌కు రూ. 24 లక్షలు



**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారిపై పోరాటానికి భారత క్రీడారంగం ప్రముఖులు తమవంతుగా విరాళాల పర్వం కొనసాగిస్తున్నారు. తాజాగా భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ మొత్తం రూ. 59 లక్షలు వితరణ చేశారు. 70 ఏళ్ల గావస్కర్ అందించిన విరాళం మొత్తానికి ఓ విశేషం ఉంది. 1971 నుంచి 1987 వరకు భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన గావస్కర్ మొత్తం 35 సెంచరీలు చేశారు. ఇందులో34 సెంచరీలు టెస్టు ఫార్మాట్‌లో, ఒక సెంచరీ వన్డే ఫార్మాట్‌లో చేశారు. దాంతో ఆయన సెంచరీ సంఖ్యకు గుర్తుగా రూ. 35 లక్షలను ప్రధానమంత్రి సహాయనిధికి ఇచ్చారు. ఇక దేశవాళీ క్రికెట్‌లో ముంబై జట్టుకు ఆడిన ఆయన 24 సెంచరీలు సాధించారు. దేశవాళీ క్రికెట్‌లో ముంబై జట్టు తరఫున చేసిన 24 సెంచరీల సంఖ్యకు గుర్తుగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి గావస్కర్ రూ. 24 లక్షలు అందించారు. ఈ ఆసక్తికర విషయాన్ని సునీల్ గావస్కర్ తనయుడు రోహన్ గావస్కర్ ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. భారత క్రికెటర్ చతేశ్వర్ పుజారా గుజరాత్ సీఎం ఫండ్‌కు విరాళం ఇచ్చినట్టు ప్రకటించాడు. అయితే ఎంత మొత్తం అనేది వెల్లడించలేదు.

**కశ్యప్ విరాళం రూ. 3 లక్షలు**

మరోవైపు భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి క్రీడాకారుడు, హైదరాబాద్‌కు చెందిన పారుపల్లి కశ్యప్ కరోనాపై పోరాటానికి మద్దతుగా తెలంగాణ సీఎం సహాయనిధికి తనవంతుగా రూ. 3 లక్షలు విరాళం ఇచ్చాడు.



# ప్రాణాలకంటే ఆటలు ఎక్కువ కాదు

- ఈ ఆరు నెలల గురించి మర్చిపోండి
- కరోనాతో క్రీడారంగంపైనా తీవ్ర ప్రభావం
- ఈ విపత్కర పరిస్థితిని సమష్టిగా ఎదుర్కోవాలి
- భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ మనోగతం

కరోనా కారణంగా ప్రపంచం మొత్తం అతలాకుతలమవుతోన్న సమయంలో క్రీడల ప్రాధాన్యత సహజంగానే వెనక్కి వెళ్లిపోయింది. ప్రతిష్టాత్మక టోక్యో ఒలింపిక్స్ క్రీడలు ఏడాది పాటు వాయిదా పడగా, ఇతర ప్రధాన ఈవెంట్లు అదే బాట పట్టాయి. ఈ నేపథ్యంలో ఆటగాళ్లంతా ఇళ్లకే పరిమితమయ్యారు. ఇలాంటప్పుడు వారు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా, సానుకూల దృక్పథంతో ముందుకు సాగేలా చేయడంలో కోచ్‌ల పాత్ర కూడా కీలకం. భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ కూడా దీనినే అనుసరిస్తున్నారు. కరోనా విపత్కర స్థితిని అందరూ సమష్టిగా ఎదుర్కోవడం ముఖ్యమని చెబుతున్నారు.

**హైదరాబాద్:** ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టోర్నీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత భారత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ క్వారంటైన్ ఇటీవలే ముగిసింది. అయితే లాక్‌డౌన్ కారణంగా తన ఫామ్‌హౌస్‌కే పరిమితమైన గోపీచంద్... తాజా పరిణామాలను విశ్లేషించారు. ఒక క్రీడాకారుడికి టోర్నీలు ప్రాధాన్యతాంశమే అయినా ప్రాణాలకంటే ఎక్కువేమి కాదని ఆయన అన్నారు. గోపీచంద్ ఇంటర్వ్యూ విశేషాలు ఆయన మాటల్లోనే...

### లాక్‌డౌన్ ప్రభావం...

వ్యక్తిగతంగా చూస్తే దేవుని దయవల్ల లాక్‌డౌన్‌తో ఇబ్బంది పడని వారిలో నేనూ ఉన్నాను. మధ్యతరగతి వారికి కూడా ఎలాగో గడిచిపోతుంది. అయితే చేతుల్లో డబ్బులు ఉండని రోజువారీ శ్రామికులు, రైతు కూలీలు నిజంగా తీవ్ర సమస్యలో ఉన్నారు. పెద్ద సంఖ్యలో ఉండే వీరిని ఆదుకోవడం మన బాధ్యత. తొందరలోనే అంతా సాధారణంగా మారిపోతే సమస్య తీరుతుంది. ఈ సమయాన్ని కుటుంబ సభ్యులతో గడుపుతున్నా. యోగా, ధ్యానం చేస్తూ నా ఫిట్‌నెస్‌ను కాపాడుకునే పనిలో ఉన్నా. ఆటగాళ్లతో కూడా మాట్లాడుతున్నా. నాకు లభించిన ఈ విరామాన్ని ఎక్కువ భాగం ఉపయోగించుకుంటున్నా కాబట్టి లాక్‌డౌన్ గురించి ఫిర్యాదేమీ లేదు.

### ఆటగాళ్లు ఏం చేస్తున్నారంటే...

ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా వారందరికీ అందుబాటులోనే ఉన్నా. మా ఫిట్‌నెస్ ట్రైనర్ దినాజ్ వీడియో కాల్ ద్వారా వారందరికీ రోజుకు రెండుసార్లు ఫిట్‌నెస్ పాఠాలు ఇస్తుంది. దానిని అందరూ అనుసరిస్తారు. ఇక చాలా మంది షట్లర్లు తమ కెరీర్‌లో ఎప్పుడో గాయాలకు గురై విరామం తీసుకోవాల్సి వస్తూనే ఉంటుంది. దీనిని కూడా అలాంటి సుదీర్ఘ విరామంగానే భావించాలి.

### జూలై వరకు టోర్నీల రద్దుపై...

వచ్చే మూడు నెలల పాటు ఎలాంటి టోర్నీలు ఉండవని బీడబ్ల్యూఎఫ్ స్పష్టం చేసేసింది. అయితే అసలు ఈ లాక్‌డౌన్ ఎంత కాలం కొనసాగుతుందో, ఆ తర్వాత పరిస్థితి ఎప్పుడు సాధారణ స్థితికి వస్తుందో చూడాలి. ఆ తర్వాతే ఆట గురించి ఆలోచించవచ్చు.

### ఒలింపిక్స్ సన్నాహాలపై...

ఆందోళన అనవసరం. ఒలింపిక్స్ కొన్ని నెలలకు వాయిదా పడితే ఆటగాళ్ల ప్రాక్టీస్ గురించి ఆలోచించాల్సి వచ్చేది. అయితే ఏడాది పాటు వాయిదా పడ్డాయి కాబట్టి వాటికి ఇంకా చాలా సమయం ఉంది. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఆటగాళ్లందరి పరిస్థితి ఇలాగే ఉంది కాబట్టి ఎవరికీ ప్రత్యేక ప్రయోజనం లేదు. ప్రస్తుతం మన, మన కుటుంబసభ్యుల, మిత్రుల, దేశ ప్రజల ఆరోగ్యమే అన్నింటికంటే ముఖ్యం. క్రీడల గురించి తర్వాత ఆలోచించుకోవచ్చు.

### కరోనా సమయంలో టోర్నీలపై...

ఆల్ ఇంగ్లండ్ టోర్నీని నిర్వహించడంపై బీడబ్ల్యూఎఫ్‌ను చాలా మంది విమర్శించారు. ఇందులో కొంత వాస్తవం ఉంది. నిజాయితీగా చెప్పాలంటే వారు చివరి క్షణం వరకు సాగదీసే ప్రయత్నం చేశారు. అయితే ఇప్పుడు ఇంగ్లండ్‌లో పరిస్థితి చూస్తుంటే మేం సరైన సమయంలో అక్కడి నుంచి బయట పడ్డామనిపిస్తోంది.

### ఒలింపిక్స్‌కు అర్హత అంశంపై...

మనం అనుకుంటున్నంత తొందరగా పరిస్థితులు మెరుగుపడవని నా అభిప్రాయం. అయితే పరిస్థితులను సానుకూలంగా చూస్తే మీ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టమని మాత్రమే ఆటగాళ్లకు చెబుతున్నా. చాలా మంది మాకు కుటుంబంతో గడిపే సమయం దొరకడం లేదంటూ ఫిర్యాదు చేసే వారు. ఇప్పుడు దానిని ఉపయోగించుకోండి. ఒక్క మాటలో చెప్పాలంటే ఇప్పుడు మనం ఎదుర్కొంటున్నది క్రీడలకంటే పెద్ద సమస్య. అది ఏ దేశాన్ని వదిలిపెట్టడంలేదు. ఎవరూ ఊహించనిది. ఎవరి చేతుల్లోనూ లేనిది. కాబట్టి అన్నీ తర్వాత చేసుకోవచ్చు. ఒకసారి క్వాలిఫయింగ్ ప్రమాణాలు ఏమిటో తెలిస్తే అప్పుడు ప్రణాళిక రూపొందించుకోవచ్చు.

### చేదు గుళికలా భరించాల్సిందే....

ప్రపంచం ఎదుర్కొంటున్న ఈ విపత్తు ప్రభావం రాబోయే రోజుల్లో ప్రతీ రంగంపై ఉంటుంది. క్రీడారంగం మినహాయింపు కాదు. ఆర్థికంగా చాలా మంది దీని బాధితులుగా మారతారు. అందరికీ ఇది కఠిన సమయం. ఇలాంటి సమయంలోనే మానసికంగా కూడా దృఢంగా మారాల్సి ఉంటుంది. క్రీడా రంగానికి కూడా భారీ నష్టం జరుగుతుందనేది వాస్తవం. దీంతో సంబంధం ఉన్న అనేక మంది ఉద్యోగాలు కోల్పోవచ్చు. లేదా జీతాల్లో కోత పడవచ్చు. దీనిని అందరూ అర్థం చేసుకోవాల్సిందే. ప్రతీ ఒక్కరు తమ జీవితంలో ఈ ఆరు నెలల కాలాన్ని లెక్కలోంచి తీసేయాలి. గత వందేళ్లలో ఇలాంటి పరిస్థితి చూడలేదు. దీనిని ఎదుర్కోవడం అందరికీ కష్టంగా మారింది. అయితే చేదు గుళికలా దీనిని భరించక తప్పదు. త్వరలోనే అంతా మెరుగుపడాలని కోరుకుందాం.

## టోక్యో ఒలింపిక్స్ 'జ్యోతి' ప్రదర్శన నిలిపివేత



**టోక్యో:** ప్రాణాంతక కరోనా వైరస్ కారణంగా చరిత్రాత్మక 'ఒలింపిక్స్ జ్యోతి' ఎన్నడూ లేని విధంగా వెలవెలబోతోంది. గ్రీస్‌లోని ఒలింపియాలో 'జ్యోతి' వెలిగించిన నాటి నుంచి ఆతిథ్య జపాన్‌కు చేరే క్రమంలోనూ రిలేకు పరిమిత ఆదరణే లభించింది. గత వారం నుంచి ఫుకుషిమా రీజియన్‌లో అభిమానుల సందర్శనార్థం ఉంచిన జ్యోతి ప్రదర్శనను నిలిపివేయనున్నట్లు తాజాగా మంగళవారం అధికారులు ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెలాఖరు వరకు జ్యోతిని ప్రదర్శనకు ఉంచాల్సింది. అయితే కరోనాతో ఆరోగ్య అత్యయిక పరిస్థితి తలెత్తడంతో జ్యోతి ప్రదర్శన నిలిపివేస్తున్నామని వారు తెలిపారు. ప్రదర్శన నుంచి తీసి వేశాక 'జ్యోతి'ని ఎక్కడ భద్రపరుస్తారనే విషయాన్ని గోప్యంగా ఉంచారు. జ్యోతిని భద్రపరిచిన ప్రదేశం తెలిస్తే అభిమానులు చూసేందుకు అక్కడికి పోటెత్తుతారని ఆయన అన్నారు.

## ప్రపంచ టీటీ చాంపియన్‌షిప్ వాయిదా

**లుసానే:** ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ ఉధృతి పెరగడంతో... ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌ను వాయిదా వేశామని అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ప్రకటించింది. దక్షిణ కొరియాలోని బుసాన్‌లో జూన్ 21 నుంచి 28 వరకు ఈ మెగా ఈవెంట్ జరగాల్సింది. అయితే కరోనా తగ్గుముఖం పట్టకపోవడంతో సవరించిన షెడ్యూల్ ప్రకారం బుసాన్‌లోనే ఈ ప్రతిష్టాత్మక టోర్నీ సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 4 వరకు జరుగుతుందని ఐటీటీఎఫ్ వెల్లడించింది.

# పెద్దాయన సన్ గ్లాసెస్ వెతకండ్రా



ఇది ఒక షార్ట్‌ఫిల్మ్. దీని పేరు 'ఫ్యామిలీ'. తాజాగా విడుదలైంది.

ఏమిటి కథ?

ఇందులో ఇంటి పెద్ద అమితాబ్ బచ్చన్ ఒక ఉదయాన్నే తన సన్ గ్లాసెస్ వెతుక్కుంటూ ఉంటాడు. 'ఏవోయ్... నా సన్ గ్లాసెస్ ఎక్కడా?' అని భార్యను ఉద్దేశించి అడుగుతుంటాడు. భార్య పలకదు. ఏ వంట పనిలో ఉందో ఏమో. 'ఏవోయ్... నిన్నే... నా సన్ గ్లాసెసోయ్' అంటుంటాడు. భార్య ఉలకదు. పక్క గదిలో ఉన్న మేనల్లుడు దిల్‌జిత్ (పంజాబీ నటుడు) దీనికి స్పందిస్తాడు. 'మామ సన్ గ్లాసెస్ కనిపించడం లేదని వెతుక్కుంటుంటే ఒక్కరూ పట్టించుకోరెందుకు? నేను వెతుకుతా' అని అటూ ఇటూ వెతుకుతాడు. వెళ్లి నిద్రపోతున్న రణ్‌బీర్ కపూర్‌ను లేపుతాడు. 'నన్నెందుకు లేపుతావ్? నువ్వే వెతుకు?' అంటాడు రణ్‌బీర్. తల్లి వచ్చి 'ఇద్దరూ వెతకండి' అంటుంది. దాంతో రణ్‌బీర్ కపూర్ పక్క గదిలో ఉన్న మమ్ముట్టి దగ్గరకు వెళ్లి 'అంకుల్‌వి కళ్లద్దాలు కనిపించడం లేదట. చూశారా?' అని అడుగుతాడు. 'ఏం తలనొప్పిరా సామి నీతో. ఆయన కళ్లద్దాలు నాకు తెలుసులే. చాలా ఓల్డ్ మోడల్. కాస్త మేం వాడే కొత్త మోడల్స్ వాడమని చెప్పు. (అని కెమెరా వైపు చూస్తూ) 'గురూ... నీ దగ్గర చాలా మోడల్స్ ఉంటాయిగా. ఒకటివ్వరాదూ' అంటాడు. అంతే... రజనీకాంత్ ఫ్రేమ్‌లోకి వచ్చి తాను పెట్టుకున్న సన్ గ్లాసెస్‌ను స్టయిల్‌గా చూపిస్తూ 'ఇవా?' అని అడిగి, మళ్లీ క్షణంలో కొత్తవి మార్చి 'ఇవా' అని అడుగుతాడు. దాంతో రణ్‌బీర్ కపూర్ ఖంగు తింటాడు. రణ్‌బీర్‌తో లాభం లేదనుకున్న దిల్‌జిత్ బాత్‌రూమ్‌కు వెళ్లి తలుపు కొడతాడు. లోపల ఎవరు? ఇంకెవరు? మెగాస్టార్ చిరంజీవి!

లోపల ఆయన గడ్డం గీసుకుంటూ 'ఏమిటా కొట్టడం? తలుపు విరిగిపోగలదు. ఏం కావాలి?' అని అడిగితే 'సన్ గ్లాసెస్ ఉన్నాయా అక్కడా?' అని అడుగుతాడు దిల్‌జిత్. 'సన్ గ్లాసెసా? ఇక్కడ నీళ్లే రావట్లేదు. సన్ గ్లాసెస్ ఎందుకొస్తాయి' అని ఆయన ప్రశ్నిస్తాడు. లైబ్రరీలో ఉన్న శివ రాజ్‌కుమార్ 'నన్ను చూశావా అని అడుగుతున్నావా? కనపడనివాటిని ఎలా చూడమంటావు? ముందు నువ్వు వాటిని వెతుకు. అప్పుడు చూస్తాను' అని సలహా ఇస్తాడు. ఇక మోహన్‌లాల్ 'హ...హ... సన్ గ్లాసెస్... ఇక్కడే ఎక్కడో ఉండాలి. ఆయనవి కనిపిస్తే నావి కూడా వెతుక్కోవాలి' అంటాడు. బెంగాలీ స్టార్ ప్రసేన్‌జిత్ చటర్జీ 'ఎందుకు నాయనా ఒకరి వెంట ఒకరు వచ్చి సన్ గ్లాసెస్ అంటూ నా ప్రాణం తీస్తారు' అంటాడు.

చివరకు దిల్‌జిత్ ఆలియా భట్‌కు ఫోన్ చేస్తాడు. ఆలియా భట్ ఆ పక్కనే యోగా చేస్తుంటుంది. 'ఇక్కడే నన్ను పెట్టుకొని ఎందుకు ఫోన్ చేస్తున్నావ్? సన్ గ్లాసెస్ నేను చూశాలే' అని గుర్తు తెచ్చుకుని తన నెత్తి మీద ఉన్న వాటిని తీసి ఇస్తుంది. వాటిని ప్రియాంకా చోప్రా లాక్కుని తీసుకెళ్లి అమితాబ్ చేతిలో పెడుతుంది.

'ఇంత హడావిడి చేస్తున్నారు? మీకు సన్ గ్లాసెస్ ఎందుకు?' అని అమితాబ్‌ను అడుగుతుంది ప్రియాంకా చోప్రా.

'ఎందుకా? నేను కొన్నాళ్లు బయటకు వెళ్లదలుచుకోలేదు. వెళ్లను కనుక సన్ గ్లాసెస్ నాకు అవసరం లేదు. అవసరంలేని సన్ గ్లాసెస్‌ను ఎక్కడో మర్చిపోతే మీరంతా అనవసరంగా వాటిని వెతకాల్సి వస్తుంది. అందుకే ఇప్పుడు వెతకమన్నాను' అని నవ్వుతాడు.

అందరూ 'హార్నీ' అనుకుంటూ ఉండగా షార్ట్ ఫిల్మ్ ముగుస్తుంది.

అందరూ ఇంట్లోనే ఉండండి, బయటకు వెళ్ల వద్దు, వెళ్లి కరోనా బారిన పడ వద్దు అని చెప్పడానికి దేశంలోని ప్రాతినిధ్య నటులు కలిసి చేసిన ప్రయత్నం ఇది. ఇందుకోసం ఎవరూ ఇంటి నుంచి బయటకు రాలేదు. తమ ఇళ్లల్లోనే ఉంటూ తమ పార్ట్‌ను షూట్ చేసి పంపారు. దర్శకుడు ప్రసూన్ పాండే వీరందరినీ వర్చువల్‌గా డైరెక్ట్ చేశాడు. మమ్ముట్టి పార్ట్‌ను ఆయన కుమారుడు దుల్కర్ షూట్ చేశాడట. మంచి విషయం ఏమిటంటే ఈ షార్ట్ ఫిల్మ్‌లో ప్రతి ఒక్కరూ వారి భాషలను మాట్లాడటం. చిరంజీవి తెలుగు, మమ్ముట్టి–మోహన్‌లాల్ మలయాళం, రజనీకాంత్ తమిళం, ప్రసేన్ జిత్ బెంగాలీ మాట్లాడారు. షార్ట్ ఫిల్మ్ చివరలో వినోద రంగ కార్మికుల కోసం సహాయ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు అమితాబ్ ప్రకటించడం కనిపిస్తుంది. సోనీ నెట్‌వర్క్, కల్యాణ్ జ్యువెలర్స్ కలిసి ఈ షార్ట్ ఫిల్మ్‌ను నిర్మించాయి. అమితాబ్ ఇందుకు సూత్రధారిగా వ్యవహరించారు. యూ ట్యూబ్‌లో ఉంది చూడండి. ఇల్లు కదలకుండా ఉండండి.



రవితేజ

# డబుల్ ధమాకా

రవితేజ హీరోగా రమేష్‌వర్మ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. కోనేరు సత్యనారాయణ ఈ సినిమాను నిర్మిస్తారు. ఇందులో రవితేజ తన అభిమానులకు డబుల్ ధమాకా ఇవ్వనున్నారట. ఎన్ఆర్ఐ బిజినెస్‌మేన్‌గా, చార్టెడ్ అకౌంటెంట్‌గా రవితేజ ద్విపాత్రాభినయం చేయబోతున్నారని టాక్. ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్న 'క్రాక్' చిత్రంలో నటిస్తున్నారు రవితేజ. కరోనా కారణంగా ఈ సినిమా చిత్రీకరణకు బ్రేక్ పడింది. అలాగే 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమాతో దర్శకుడిగా మారిన రైటర్ వక్కంతం వంశీ డైరెక్షన్‌లో రవితేజ హీరోగా ఓ సినిమా సెట్స్‌పైకి వెళ్లనున్న సంగతి తెలిసిందే.

# మంచువారి సాయం



విష్ణు, మోహన్‌బాబు

కరోనా వైరస్ వ్యాప్తి నివారణ చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 21రోజులు లాక్‌డౌన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు పలువురు దాతలు తమ వంతుగా సహాయం చేస్తున్నారు. మరికొందరు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విరాళాలు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే సీనియర్ నటుడు మంచు మోహన్‌బాబు తన కుమారుడు విష్ణుతో కలిసి చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి నియోజకవర్గంలో దాదాపు 8 గ్రామాలను దత్తత తీసుకున్నారు. ఆ గ్రామాల్లోని పేద కుటుంబాలకు రోజుకు రెండుసార్లు భోజనం అందిస్తున్నారు. ప్రభుత్వం లాక్ డౌన్ ఎత్తివేసే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. అంతేకాదు.. ప్రతిరోజూ 8 టన్నుల కూరగాయలను కూడా సరఫరా చేస్తున్నారు మోహన్‌బాబు, విష్ణు.

# ఆర్య ఆగలేదు



సుష్మితా సేన్

వెండితెరపై నటిగా తన సత్తా నిరూపించుకున్నారు సుష్మితా సేన్. ఇప్పుడు 'ఆర్య' అనే వెబ్‌సిరీస్ ద్వారా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి అడుగుపెడుతున్నారు. ఈ సిరీస్ గురించి కొన్నాళ్ల క్రితం ప్రకటించారు కానీ ఆ తర్వాత అప్‌డేట్ లేదు. దాంతో 'ఆర్య' ఆగిపోయిందా? అనే అనుమానాలు బాలీవుడ్‌లో తెరపైకి వచ్చాయి. ఈ విషయం గురించి సుష్మితా స్పందిస్తూ– ''ఆర్య' స్టేటస్, రిలీజ్ విషయాల గురించి నన్ను చాలా మంది పదేపదే అడుగుతున్నారు. దేవుడి దయ వల్ల కరోనా వైరస్ వ్యాప్తి ముందే 'ఆర్య' చిత్రీకరణను పూర్తి చేయగలిగాం. కానీ ప్రస్తుతం లాక్‌డౌన్ పరిస్థితుల కారణంగా పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్స్ ఆగిపోయాయి. 'ఆర్య' కోసం దాదాపు 300 మంది చాలా కష్టపడ్డారు. పరిస్థితులు చక్కబడిన తర్వాత విడుదల చేస్తాం. ఈ వెబ్ సిరీస్ అందరికి నచ్చుతుందనే అనుకుంటున్నాను'' అని పేర్కొన్నారు. 2010లో 'నో ప్రాబ్లమ్' అనే హిందీ చిత్రంలోనూ, 2015లో 'నర్బక్' అనే బెంగాలీ చిత్రంలోనూ నటించారు సుష్మితా సేన్. ఆ తర్వాత వెండితెరపై కనిపించలేదు. ఇప్పుడు ఐదేళ్ల తర్వాత 'ఆర్య' అనే వెబ్‌సిరీస్‌లో నటించారు.



కాజల్ అగర్వాల్

# పక్కా లోకలైపోదాం!

ఎన్టీఆర్ హీరోగా నటించిన 'జనతా గ్యారేజ్' చిత్రంలో 'పక్కా లోకల్.. నేను పక్కా లోకల్' అంటూ ఓ స్పెషల్ సాంగ్‌లో నర్తించారు కాజల్ అగర్వాల్. ఇప్పుడు దేశంలోని అందర్నీ 'పక్కా లోకల్ అనే ఫీలింగ్ తెచ్చుకోండి' అంటున్నారామె. ఇంతకీ విషయం ఏంటంటే.. కరోనా వైరస్ మహమ్మారి కారణంగా అన్ని రంగాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా దేశీయ మార్కెట్ వ్యవస్థ కుదేలైంది. దీంతో దేశీయ వ్యాపారాలు, మన దేశంలోని స్థానిక వర్తకులు తిరిగి సరైన గాడిలో పడేందుకు మన వంతు సాయం చేయాలంటున్నారు కాజల్. ఈ విషయంపై ఆమె స్పందిస్తూ – ''కరోనా మహమ్మారి మన దేశం నుంచి వెళ్లిపోయాక, ఈ అతి పెద్ద ప్రమాదం నుంచి మనందరం సురక్షితంగా బయటపడిన తర్వాత మన దేశం కోసం మనం కొన్ని మంచి పనులు చేయాలి. ఇకపై మన హాలిడేస్‌ను ఇండియాలోనే గడుపుదాం. విదేశీ విహార యాత్రలు వద్దు. లోకల్ రెస్టారెంట్స్‌లోనే భోజనం చేద్దాం. లోకల్ ఫ్రూట్స్, లోకల్ వెజిటబుల్స్ మాత్రమే కొందాం. దేశీయ బ్రాండ్‌లు, ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేద్దాం. మన స్థానిక వ్యాపారస్తులు తిరిగి కోలుకునేంతవరకు మనం వారికి అండగా ఉందాం. పక్కా లోకలైపోదాం'' అన్నారు కాజల్.

epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం 8-4-2020

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ-మెయిల్ sakshieducation@gmail.com

# చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్

ప్రవేశాలు

మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించి బీఎస్సీ, ఎంఎస్సీ, పీహెచ్‌డీ కోర్సులను అందించడంలో దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్న విద్యా సంస్థ.. చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఐ). ఈ విద్యా సంస్థ 2020–21 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతోంది.

### అందిస్తున్న కోర్సులు

- **బీఎస్సీ కోర్సులు (3 ఏళ్లు):** మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో బీఎస్సీ(హానర్స్); మ్యాథమెటిక్స్, ఫిజిక్స్‌లో బీఎస్సీ(హానర్స్). బీఎస్సీ హానర్స్ రెండు కోర్సులకు ఒకే ప్రవేశ పరీక్ష ఉంటుంది. దరఖాస్తు చేసుకున్నప్పుడు కోర్సును ఎంపిక చేసుకోవాల్సిన అవసరం లేదు. ప్రవేశం లభించాక ఎంపికచేసుకోవచ్చు.
- **ఎంఎస్సీ కోర్సులు (2 ఏళ్లు):** ఎంఎస్సీ మ్యాథమెటిక్స్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంఎస్సీ డేటా సైన్స్.
- **పీహెచ్‌డీ కోర్సులు:** గణితంలో పీహెచ్‌డీ, కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ, భౌతిక శాస్త్రంలో పీహెచ్‌డీ. ఫిజిక్స్‌లో పీహెచ్‌డీ చేయాలనకునే విద్యార్థులు జెస్ట్ ప్రవేశపరీక్ష రాయాల్సి ఉంటుంది.

### అర్హతలు

- బీఎస్సీ (హానర్స్) మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్‌కు ఇంటర్(ఎంపీసీ)/10+2 ఉత్తీర్ణులై ఉండాలి.
- బీఎస్సీ (హానర్స్) మ్యాథమెటిక్స్, ఫిజిక్స్‌కు ఇంటర్(ఎంపీసీ)/10+2 ఉత్తీర్ణత.
- **ఎంఎస్సీ మ్యాథమెటిక్స్:** డిగ్రీ కోర్సులైన బీఏ, బీఎస్సీ, బీఈ, బీటెక్‌లలో గణితం సబ్జెక్టు ఉంటే అర్హులు.
- **ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్:** డిగ్రీ కోర్సులైన బీఏ, బీఎస్సీ, బీఈ, బీటెక్‌లలో కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు ఉంటే అర్హులు.
- **ఎంఎస్సీ డేటా సైన్స్:** డిగ్రీ కోర్సులైన బీఏ, బీఎస్సీ, బీఈ, బీటెక్‌లలో మ్యాథ్స్/ స్టాటిస్టిక్స్/కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు ఉండాలి.

### పీహెచ్‌డీ మ్యాథమెటిక్స్

- బీఈ/బీటెక్/బీఎస్సీ (మ్యాథ్స్)/ఎంఎస్సీ మ్యాథ్స్ ఉత్తీర్ణులు అర్హులు.
- ఎన్‌బీహెచ్‌ఎం పీహెచ్‌డీ ఫెలోషిప్‌ను పొందినవారు సీఎంఐ ప్రవేశపరీక్ష రాయకుండానే పీహెచ్‌డీ మ్యాథ్‌మెటిక్స్ ఇంటర్వ్యూకు అర్హత సాధించవచ్చు.
- పీహెచ్‌డీ గణితానికి దరఖాస్తు చేసుకోవాలనుకుంటే.. దరఖాస్తును నింపి, ఫీజు చెల్లించిన తర్వాత స్కాన్ చేసిన ఎన్‌బీహెచ్‌ఎం స్కోర్ కార్డుతో పాటు ఇంటర్, డిగ్రీ సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలను phdmath2020@cmi.ac.inకి మెయిల్ పంపాలి.

### పీహెచ్‌డీ కంప్యూటర్ సైన్స్

- బీఈ/బీటెక్/ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్)/ఎంసీఏ పూర్తిచేసుకోవాలి. కంప్యూటర్ సైన్స్ పీహెచ్‌డీ కోర్సు కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జాయింట్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (జేఈఎస్‌టీ 2020) లో క్వాలిఫై అయితే సీఎంఐ ప్రవేశ పరీక్ష రాయకుండానే ఇంటర్వ్యూకి అర్హత సాధిస్తారు. పీహెచ్‌డీ కంప్యూటర్ సైన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే దరఖాస్తును నింపి, ఫీజు చెల్లించిన తర్వాత phdcs2020@cmi.ac.inకి మెయిల్ చేయాలి.
- జెస్ట్–2020 ర్యాంక్ ఆధారంగా ఇంటర్వ్యూకి అర్హత సాధిస్తే అడ్మిషన్ కమిటీ నుంచి సమాచారం వస్తుంది.
- **పీహెచ్‌డీ ఫిజిక్స్:** ఎంఎస్సీ ఫిజిక్స్ ఉత్తీర్ణులై ఉండాలి. జెస్ట్ 2020లో అర్హత సాధిస్తేనే పీహెచ్‌డీ ఫిజిక్స్‌లో ప్రవేశం లభిస్తుంది. జెస్ట్ 2020లో మొదటి 300 ర్యాంకుల్లోని అభ్యర్థులు ఇంటర్వ్యూకి అర్హత సాధిస్తారు. పీహెచ్‌డీ ఫిజిక్స్ దరఖాస్తు చేసుకోవాలనుకుంటే.. దరఖాస్తును నింపి, ఫీజు చెల్లించిన తర్వాత స్కాన్ చేసిన జెస్ట్–2020 స్కోరు కార్డును phdphy2020@cmi.ac.inకి మెయిల్ చేయాలి. జెస్ట్–2020 ర్యాంక్ ఆధారంగా ఇంటర్వ్యూకి అర్హత సాధిస్తే అడ్మిషన్ కమిటీ నుంచి సమాచారం వస్తుంది.

### దరఖాస్తు విధానం

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు లేదా ప్రింటెడ్ దరఖాస్తు ఫారం నింపి పోస్టు చేయవచ్చు లేదా వ్యక్తిగతంగా అయినా వెళ్లి ఇవ్వవచ్చు.
- ఫిజిక్స్ అభ్యర్థులు జాయింట్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (జెస్ట్) రాయాలి.
- పీహెచ్‌డీ ఫిజిక్స్ కోసం ప్రత్యేకంగా సీఎంఐ ప్రవేశ పరీక్ష లేదు. షార్ట్‌లిస్ట్ చేసిన పీహెచ్‌డీ అభ్యర్థులందరికి చెన్నైలో ఇంటర్వ్యూలు జరుగుతాయి.

### ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 17 ఏప్రిల్ 2020
- **హాల్‌టికెట్లు విడుదల:** 1 మే 2020
- **ప్రవేశపరీక్ష తేది:** 15 మే 2020
- **పూర్తి వివరాలకు:** https://www.cmi.ac.in/admissions







ఏ చదువు చదవాలన్నా.. ఎలాంటి కోర్సులో చేరాలన్నా.. భారీగా ఫీజులు! కాలేజీలో చేరినప్పటి నుంచి కోర్సు పూర్తయ్యేదాకా లక్షల్లోనే ఖర్చు!! వేలు, లక్షలు ఖర్చు చేసే ఆర్థిక స్థోమత అందరికీ ఉంటుందా..! మరీ ముఖ్యంగా పదోతరగతి తర్వాత.. ఇంటర్మీడియెట్ స్థాయిలో కార్పొరేట్ కాలేజీలు భారీగా వసూలు చేసే ఫీజులు చెల్లించ లేని విద్యార్థులకు నాణ్యమైన విద్య గగనమే అనే అభిప్రాయం!! ఇలాంటి పరిస్థితుల్లో ప్రతిభావంతులకు నామమాత్రపు ఫీజులతోనే నాణ్యమైన చదువులు అందిస్తున్నాయి.. తెలుగు రాష్ట్రాల్లోని రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు (ఆర్‌జేసీలు)!! టీఎస్‌ఆర్‌జేసీ సెట్-2020, ఏపీఆర్‌జేసీసెట్ 2020లకు నోటిఫికేషన్‌లు విడుదలైన నేపథ్యంలో... ఆర్‌జేసీల ప్రత్యేకత, దరఖాస్తులు, పరీక్ష విధానంపై సమగ్ర సమాచారం..

# నాణ్యమైన చదువు

- » తెలుగు రాష్ట్రాల్లో నాణ్యమైన విద్యకు కేరాఫ్ ఆర్‌జేసీలు
- » టీఎస్‌ఆర్‌జేసీ, ఏపీఆర్‌జేసీలకు నోటిఫికేషన్ విడుదల
- » రెండు రాష్ట్రాల్లో ప్రవేశ పరీక్షల ద్వారా అడ్మిషన్స్
- » పదో తరగతి విద్యార్థులకు సువర్ణావకాశం

### ఆర్‌జేసీలు

ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో 1972లో రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేశారు. పట్టణాలకు, నగరాలకు దూరంగా ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు చదువుకునే విధంగా, ప్రత్యేక సదుపాయాలను కల్పించి.. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఇంటర్మీడియట్ విద్యను ఆర్‌జేసీల్లో అందిస్తారు. ప్రస్తుతం రెండు తెలుగురాష్ట్రాల్లో ఆర్‌జేసీ విద్య సత్ఫలితాలను ఇస్తోంది. ఇందులో ఐఐటీ జేఈఈ, నీట్, ఎంసెట్ లాంటి జాతీయ, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలకు శిక్షణను ఇస్తుండంతో విద్యార్థులు కూడా ఆర్‌జేసీ పట్ల ఎక్కువ ఆసక్తిని చూపిస్తున్నారు.

### సీట్ల సంఖ్య

- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఆర్‌జేసీలకు సంబంధించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే ప్రవేశ పరీక్షల నిర్వహణ జరుగుతుంది.
- ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఏపీఆర్‌జేసీసెట్ ద్వారా మొత్తం 10 ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కాలేజీల్లోని 1080 సీట్లను భర్తీ చేస్తారు. ఇందులో బాలురు–04, బాలికలు–02, కో ఎడ్యుకేషన్–01, మైనారిటీ బాలురు–02, మైనారిటీ బాలికలు –01 ఉన్నాయి.
- తెలంగాణకు సంబంధించి మొత్తం 35 గురుకుల జూనియర్ కాలేజీల్లోని దాదాపు 3వేల సీట్లను భర్తీచేయనున్నారు. ఇందులో బాలురు–15, బాలికలు–20 కాలేజీలు ఉన్నాయి.

### ఎవరు అర్హులు

- ఆర్‌జేసీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు 2020 సంవత్సరంలో జరిగే పదోతరగతి పరీక్షల్లో మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించాలి.
- స్వరాష్ట్రంలో పదోతరగతి చదివినవారై ఉండాలి.
- పదోతరగతి పరీక్షల్లో జనరల్ అభ్యర్థులు 6 జీపీఏ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు 5 జీపీఏ సాధించాలి.

### ఏఏ గ్రూపులు

ఆర్‌జేసీ పరీక్ష ద్వారా ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ/ఎంఈసీ తదితర గ్రూపుల్లో ప్రవేశాలను కల్పిస్తారు. ప్రవేశం పొందిన విద్యార్థులందరికీ ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తారు.

### పరీక్ష విధానం

ఏపీఆర్‌జేసీ సెట్/టీఎస్‌ఆర్‌జేసీ సెట్ పరీక్ష మొత్తం 150 మార్కులకు ఉంటుంది. మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లిష్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలుంటాయి. అభ్యర్థులు ఏ గ్రూప్‌కు దరఖాస్తు చేసుకుంటారో ఆ గ్రూప్‌కు సంబంధించిన సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్న పత్రం పదోతరగతి స్థాయిలో ఉంటుంది.

ఎంపీసీకి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్ నుంచి ప్రశ్నలుంటాయి. బైపీసీకి దరఖాస్తు చేసుకునే వారికి బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, ఇంగ్లిష్ నుంచి ప్రశ్నలుంటాయి. అలాగే సీఈసీ/ఎంఈసీకి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సోషల్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

### పదో తరగతి స్థాయి సిలబస్

- **మ్యాథమెటిక్స్:** ఈ సబ్జెక్టుకు సంబంధించి అభ్యర్థులు గత ఏడాది పరీక్ష పత్రాన్ని అధ్యాయనం చేయాలి. పదోతరగతి స్థాయి సమస్యలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. పాలినామియల్, స్టాటిస్టిక్స్, రియల్ నంబర్స్, ట్రిగనామెట్రీ, అర్థమెటిక్ ప్రొగ్రెషన్స్ తదితర అంశాలపై దృష్టిపెట్టాలి.
- **ఫిజికల్ సైన్స్:** ఈ సబ్జెక్టులో కెమికల్ రియాక్షన్, హీట్ అండ్ కైటిక్స్, అటామిక్ నంబర్, యాసిడ్స్ అండ్ బేస్ స్ట్రక్షర్ ఆఫ్ యాటమ్‌లపై దృష్టి పెట్టాలి.
- **బయాలజికల్ సైన్స్:** బయలాజికల్ సైన్స్‌కు సంబంధించి పదోతరగతిస్థాయి ప్రశ్నలను అడుగుతారు. న్యూట్రిషన్, ట్రాన్స్‌పోర్టేషన్, సర్క్యులేటర్ సిస్టమ్, రెస్పిరేటరీ సిస్టమ్, న్యూరాన్స్ అండ్ కంట్రోల్ సిస్టమ్‌ను చదవాలి.
- **సోషల్ సైన్స్:** ఐడీయాస్ ఆఫ్ డెవలప్‌మెంట్, క్లయిమెట్ ఆఫ్ ఇండియా, ఇండియన్ హిస్టరీ, కల్చర్, ఎకానమీ, హెరిటేజ్ ఆఫ్ ఇండియా, ఎంప్లాయిమెంట్ అండ్ అన్ ఎంప్లాయిమెంట్, క్యాపిటల్ ఇన్‌కమ్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి.
- **ఇంగ్లిష్:** ఈ సబ్జెక్టుకు సంబంధించి బేసిక్ ఇంగ్లిష్ నుంచే ఎక్కువ ప్రశ్నలుంటాయి. ముఖ్యంగా రీడింగ్ కాంప్రహెన్షన్, టెన్సెస్, లెటర్ రైటింగ్, గ్రామర్ అండ్ వొక్యాబులరీ, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, సెంటెన్స్ కరెక్షన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.

### టీఎస్‌ఆర్‌జేసీ సెట్ 2020 ముఖ్య తేదీలు

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** 15 ఏప్రిల్ 2020
- **పరీక్షతేదీ:** 10 మే 2020
- **వెబ్‌సైట్:** https://tsrjdc.cgg.gov.in

### ఏపీఆర్‌జేసీ సెట్ 2020 ముఖ్య తేదీలు

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తులకు చివరి తేది:** 22 ఏప్రిల్ 2020
- **పరీక్షతేదీ:** 14 మే 2020
- **వెబ్‌సైట్:** aprjdc.apcfss.in




### ఐఓబీలో సెక్యూరిటీ గార్డ్

చెన్నై ప్రధాన కేంద్రంగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకు.. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్(ఐఓబీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 24
- » **పోస్టుల వివరాలు:** సెక్యూరిటీ గార్డ్
- » **అర్హత:** పదో తరగతి/ తత్సమాన ఉత్తీర్ణత, స్థానిక భాష మాట్లాడటం, రాయడం, చదవడం వచ్చి ఉండాలి.
- » **వయసు:** 01.03.2020 నాటికి 18–26 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ఆబ్జెక్టివ్ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరి తేది:** 10.04.2020
- » **వెబ్‌సైట్:** https://www.iob.in

### సీజీడబ్ల్యూబీలో యంగ్ ప్రొఫెషనల్స్

భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్(సీజీడబ్ల్యూబీ) దేశవ్యాప్తంగా ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 62
- » **పోస్టుల వివరాలు:** యంగ్ ప్రొఫెషనల్–48, కన్సల్టెంట్–14.
- » **అర్హత:** పోస్టును బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి.
- » **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరి తేది:** 25.04.2020
- » **వెబ్‌సైట్:** http://jalshakti-dowr.gov.in

### ఏఐసీలో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

ఢిల్లీలోని అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఏఐసీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
- » **పోస్టుల వివరాలు:** మేనేజ్‌మెంట్ ట్రెయినీ(రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సాఫ్ట్‌వేర్ డవలప్‌మెంట్).
- » **అర్హత:** సంబంధిత విభాగాల్లో ఇంజనీరింగ్/గ్రాడ్యుయేషన్/పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- » **వయసు:** 01.04.2020 నాటి 35 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- » **దరఖాస్తు విధానం:** ఈమెయిల్/ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఈమెయిల్:** aicho@aicofindia.com
- » **దరఖాస్తులకు చివరి తేది:** 30.04.2020
- » **వెబ్‌సైట్:** https://www.aicofindia.com

### పీజీఐఎంఈఆర్ చండీగఢ్‌లో ఖాళీలు



చండీగఢ్‌లోని పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(పీజీఐఎంఈఆర్).. పలు ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 159
- » **పోస్టుల వివరాలు:** సీనియర్ రెసిడెంట్, సీనియర్ మెడికల్ ఆఫీసర్, జూనియర్/సీనియర్ డిమాన్‌స్ట్రేటర్.
- » **విభాగాలు:** అనెస్తీషియా, అనాటమీ,బయోకెమిస్ట్రీ, డెర్మటాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, పాథాలజీ, సైకియాట్రీ, బయోఫిజిక్స్ తదితరాలు.
- » **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణత, టీచింగ్/పరిశోధన అనుభవం ఉండాలి.
- » **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఇంటర్వ్యూ, అసెస్‌మెంట్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరి తేది:** 26.04.2020
- » **పరీక్ష తేది:** 29.05.2020
- » **వెబ్‌సైట్:** http://pgimer.edu.in/PGIMER_PORTAL/PGIMERPORTAL/home.jsp

### నాఫెడ్‌లో అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

ఢిల్లీలోని నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(నాఫెడ్).. అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
- » **అర్హత:** నోటిఫికేషన్‌లో సూచించిన ఐఐఎంల నుంచి ఎంబీఏ(ఫైనాన్స్)తో పాటు సీఏ/ఐసీడబ్ల్యూఏ/బీకామ్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- » **వయసు:** 35 ఏళ్లకు మించరాదు.
- » **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరి తేది:** 21.04.2020
- » **వెబ్‌సైట్:** http://www.nafed-india.com

### సమీర్‌లో సైంటిస్ట్ పోస్టులు

ముంబయిలోని భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన సొసైటీ ఫర్ అప్లయిడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ అండ్ రీసెర్చ్(సమీర్)లో సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 30
- » **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్‌లు
- » **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్/ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 30.04.2020
- » **వెబ్‌సైట్:** https://www.sameer.gov.in

### ఐఐటీఎం, పుణెలో రీసెర్చ్ ఫెలోస్

పుణెలోని భారత ప్రభుత్వ ఎర్త్‌సైన్సెస్ విభాగానికి చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెటీయోరాలజీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **ఖాళీల వివరాలు:** జూనియర్/సీనియర్ రీసెర్చ్ ఫెలోస్
- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 36
- » **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో ఎంఎస్సీ/ఎంఎస్/ఎంటెక్, నెట్/గేట్/సీఎస్ఐఆర్/యూజీసీ నెట్ అర్హత, పరిశోధన అనుభవం ఉండాలి.
- » **వయసు:** 28 ఏళ్లు మించరాదు. » **స్టయిపండ్:** నెలకు రూ.31వేలు
- » **కాల వ్యవధి:** నాలుగేళ్లు » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తుకు చివరి తేది:** 30.04.2020 » **వెబ్‌సైట్:** https://www.tropmet.res.in

### ఐఐటీఎం, పుణెలో రీసెర్చ్ అసోసియేట్స్

పుణెలోని భారత ప్రభుత్వ ఎర్త్‌సైన్సెస్ విభాగానికి చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెటీయోరాలజీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 30
- » **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్స్–10, రీసెర్చ్ ఫెలోస్–20.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, సీఎస్ఐఆర్ యూజీసీ నెట్/గేట్, పీహెచ్‌డీ ఉత్తీర్ణత.
- » **వయసు:** 30.04.2020 నాటికి 28 ఏళ్లకు మించరాదు.
- » **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరి తేది:** 30.04.2020 » **వెబ్‌సైట్:** https://www.tropmet.res.in

## కెరీర్ కౌన్సెలింగ్

» **సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను? ఎలాంటి కెరీర్ అవకాశాలున్నాయో చెప్పండి?** –వంశీ కిరణ్

- మౌలిక వసతుల రంగంలో సివిల్ ఇంజనీర్లకు మంచి కెరీర్ అవకాశాలు ఉన్నాయి. ఆర్కిటెక్చర్, డిజైన్ రంగాల్లోనూ, పవర్‌స్టేషన్లు, ఎయిర్‌పోర్టులు, డ్యాంలు, హైవేస్, ఎక్స్‌ప్రెస్‌వేస్, ఇండస్ట్రియల్ యూనిట్స్, మ్యానుఫాక్చరింగ్ ప్లాంట్స్, ఫ్యాక్టరీలలో ఉద్యోగాలు పొందచ్చు. ఉన్నత విద్యను అభ్యసించాలనుకుంటే.. ట్రాన్స్‌పోర్టేషన్ సిస్టమ్స్, జియోటెక్నికల్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, రిమోట్ సెన్సింగ్, హైడ్రాలిక్స్ అండ్




వాటర్ రిసోర్సెస్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, జియో ఇన్ఫర్మేటిక్స్ తదితర స్పెషలైజేషన్లతో ఎంటెక్/ఎంఎస్ చేయొచ్చు. మంచి కమ్యూనికేషన్ స్కిల్స్, నిర్వహణ సామర్థ్యం, టీం నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఎంఎన్‌సీలలో అవకాశాలు దక్కించుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పోటీపరీక్షలు రాసి ప్రభుత్వ రంగంలోని పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్, రోడ్లు, భవనాలు, నీటిపారుదల శాఖ, గృహ నిర్మాణ శాఖల్లో ఇంజనీర్లుగా చేరొచ్చు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నిర్వహించే పరీక్షల ద్వారా ఐఈఎస్,ఐపీఎస్, ఐఏఎస్ తదితర పోస్టులకూ సన్నద్ధమవ్వచ్చు. ఎన్‌టీపీసీ, బీహెచ్‌ఈఎల్, ఓఎన్‌జీసీ, హెచ్‌ఏఎల్, గెయిల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ అవకాశాలు పొందొచ్చు.

» **డిగ్రీలో బీకామ్ (కంప్యూటర్స్) చదివాను. తర్వాత ఎంబీఏ ఫైనాన్స్ చేయాలనుకుంటున్నాను. నాకు ఎలాంటి అవకాశాలు అందుబాటులో ఉన్నాయో తెలపండి?** – శ్రీనివాస్

- ఏ వ్యాపారానికైనా ఫైనాన్స్ విభాగం జీవనాడి లాంటిది. ఎంబీఏ ఫైనాన్స్ పూర్తి చేసిన వారికి కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలకు కొదవలేదు. ఫైనాన్స్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలనుకునే వారు అకౌంటింగ్, ఫైనాన్స్, టాక్సేషన్‌లతోపాటు కాలానుగుణంగా స్టాటిస్టిక్స్, ఎకనోమెట్రిక్స్‌లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. చాలామంది ఫైనాన్స్‌ను అకౌంటింగ్, టాక్సేషన్‌కు సంబంధించిన ఒక అంశంగానే భావిస్తారు. కానీ వాస్తవానికి ఫైనాన్స్ పరిధి చాలా విస్తృతమైనది.
- ప్రస్తుత పరిస్థితుల్లో ఫైనాన్స్ రంగంలో స్థిరపడాలంటే.. ఫైనాన్స్‌కు సంబంధించిన కొత్త సాఫ్ట్‌వేర్, ప్రోగ్రామింగ్ పద్ధతులను కూడా నేర్చుకోవాలి. ఇటీవల కాలంలో క్రేజీగా నిలుస్తున్న ఫిన్‌టెక్(ఫైనాన్షియల్ టెక్నాలజీ)పై అవగాహన పెంచుకోవాలి. అప్పుడే విభిన్న నైపుణ్యాలతో మంచి సంస్థలో కెరీర్ ప్రారంభించడానికి సాధ్యమవుతుంది.
- కొన్ని ప్రత్యేకమైన రంగాల్లో ప్రవేశించాలంటే.. అదనపు సర్టిఫికేట్ కోర్సులనూ అభ్యసించాల్సి ఉంటుంది. ఉదాహరణకు క్యాపిటల్ మార్కెట్స్‌లో చేరాలనుకునేవారు సెబీకి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ అందించే ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్, డెరివేటివ్స్ అండ్ సెక్యూరిటీస్ ఆపరేషన్స్, రిస్క్‌మేనేజ్‌మెంట్ తదితర సర్టిఫికెట్ కోర్సుల్లో అర్హత సాధించాల్సి ఉంటుంది.

10వ తరగతి ప్రత్యేకం
❖ 10వ తరగతి ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, స్టడీ మెటీరియల్, బిట్ బ్యాంక్ మొదలైనవి.. (EM &TM)
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

# వాట్సాప్ సందేశాలపై నియంత్రణ

న్యూఢిల్లీ: కోవిడ్ మహమ్మారి ప్రబలుతున్న నేపథ్యంలో నకిలీ వార్తలను అరికట్టే లక్ష్యంతో వాట్సాప్ సందేశాలపై కొన్ని ఆంక్షలు విధించింది. తరచూ ఫార్వర్డ్ అయిన సందేశాలను ఒకసారికి ఒకే ఛాట్‌కు మాత్రమే పంపేలా చర్యలు తీసుకుంది. ఐదుసార్ల కంటే ఎక్కువ ఫార్వర్డ్ అయిన సందేశాలకు ఈ నియంత్రణ వర్తిస్తుంది. అంటే..ఇకపై ఒక సందేశం ఆరు కంటే ఎక్కువసార్లు ఫార్వర్డ్ చేయడం కుదరదన్నమాట. వదంతులను, తప్పుడు సమాచారం వ్యాప్తిని అడ్డుకునేందుకు భారత్ సహా అనేక ఇతర దేశాలు సామాజిక మాధ్యమాలపై చర్యలకు సిద్ధమవుతున్న తరుణంలో వాట్సాప్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. 'ఒక సందేశం ఒకే ఛాట్‌కు వెళ్లేలా పరిమితులు విధిస్తున్నాం. ఫార్వర్డ్‌లు చాలా ఎక్కువైనట్లు ఇటీవల వినియోగదారులు కూడా చెబుతున్నారు. ఇది తప్పుడు సమాచారం ప్రసారమయ్యేందుకూ దోహదపడుతూండవచ్చు' అని వాట్సాప్ మంగళవారం ఒక బ్లాగ్ ద్వారా తెలిపింది. ఫేస్‌బుక్ యాజమాన్యంలో ఉన్న ఈ సామాజిక మాధ్యమం గత ఏడాది రెండు బాణం గుర్తులతో ఫార్వర్డ్ లేబుల్‌ను ఏర్పాటు చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. అంతేకాకుండా సందేశం అయిదుసార్లు మాత్రమే ఫార్వర్డ్ అయ్యేలా జాగ్రత్తలూ తీసుకుంది. ఎక్కువసార్లు ఫార్వర్డ్ అయిన సందేశాన్ని గుర్తించేందుకు వీలుగా ఆ సందేశం పక్కనే ఓ భూతద్దం గుర్తును ఉంచేందుకు కూడా వాట్సాప్ ప్రయత్నిస్తోంది.

**వ్యక్తిగత సంభాషణలకు వేదికగా ఉండాలని...**

లాక్‌డౌన్, వ్యక్తిగత దూరం నిబంధనలు అమల్లో ఉన్న ప్రస్తుత తరుణంలో చాలా మంది వాట్సాప్‌ను ఎక్కువగా వినియోగిస్తున్న విషయం తెలిసిందే. అయితే సందేశాల ప్రసార వేగం కొంచెం తగ్గడం అవసరమని, తద్వారా వాట్సాప్ వ్యక్తిగత సంభాషణలకు ఒక వేదికగా మారుతుందని నమ్ముతున్నట్లు కంపెనీ తెలిపింది. వాట్సాప్‌కు భారత్‌లో 40 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. గతంలో ఫార్వర్డ్ చేసిన సందేశాలపై పరిమితులు విధించినప్పుడు ప్రపంచవ్యాప్తంగా 25 శాతం వరకూ ఫార్వర్డ్‌లు తగ్గాయని వాట్సాప్ చెబుతోంది. వ్యక్తిగత సంభాషణలను భద్రంగా ఉంచే లక్ష్యంతోనే తాము ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌ను ఉపయోగిస్తున్నామని వివరించింది. కోవిడ్ మహమ్మారి ప్రబలుతున్న ఈ తరుణంలో అసలైన సమాచారం అందరికీ అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, స్వచ్ఛంద సంస్థలు, ప్రపంచ ఆరోగ్య సంస్థ, 20 దేశాల ఆరోగ్య శాఖలను సంప్రదించామని తెలిపింది.

# లాక్‌డౌన్ కొనసాగింపు?

## సీఎంలు, నిపుణుల సూచనల నేపథ్యంలో కేంద్రం సమాలోచన!

- ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని, ఊహాగానాలు వద్దని ప్రభుత్వ స్పష్టీకరణ
- మత ప్రదేశాల్లో కార్యకలాపాలపై మే 15 వరకు ఆంక్షలు
- విద్యా సంస్థల మూసివేత కొనసాగింపు
- కరోనాపై మంత్రుల బృందం సిఫారసు



అహ్మదాబాద్‌లో డ్రోన్‌తో నిఘా

న్యూఢిల్లీ: ఏప్రిల్ 14 తరువాత కూడా కొంత కాలం లాక్‌డౌన్‌ను కొనసాగించే దిశగా కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కరోనాను పూర్తిగా కట్టడి చేసేందుకు అదొక్కటే మార్గమని తెలంగాణ సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర నిపుణులు సూచిస్తున్న నేపథ్యంలో.. కేంద్రం ఆ దిశగా సమాలోచనలు చేస్తోందని తెలిపాయి. అయితే, లాక్‌డౌన్ కొనసాగింపునకు సంబంధించి ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ లవ్ అగర్వాల్ మంగళవారం స్పష్టం చేశారు. ఈ విషయంలో ఊహాగానాలు చేయొద్దని సూచించారు. మరోవైపు, అన్ని విద్యాసంస్థల మూసివేతతో పాటు, ప్రార్థన స్థలాల్లో ప్రజలు సామూహికంగా పాల్గొనే మత కార్యక్రమాలపై విధించిన ఆంక్షలు మే 15 వరకు కొనసాగాలని దేశవ్యాప్తంగా కరోనా ప్రభావాన్ని అంచనా వేసేందుకు ఏర్పాటైన కేంద్ర మంత్రుల బృందం(జీఓఎం) మంగళవారం సిఫారసు చేసింది. ఏప్రిల్ 14 తరువాత లాక్‌డౌన్‌ను ఎత్తివేసినా లేక కొనసాగించినా ఈ నిర్ణయాలను అమలు చేయాలని సూచించింది. ప్రస్తుత లాక్‌డౌన్ గడువు ముగిసే ఏప్రిల్ 14 తరువాత నెలకొనే పరిస్థితులపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని ఆ జీఓఎం చర్చించింది. హోంమంత్రి అమిత్ షా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, రైల్వే మంత్రి పియూష్ గోయల్, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్, పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తదితర మంత్రులు ఆ సమావేశంలో పాల్గొన్నారు. విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్, మతపరమైన కేంద్రాల్లో ఏప్రిల్ 14 తరువాత కనీసం నెల రోజుల పాటు సాధారణ కార్యకలాపాలను ఎట్టిపరిస్థితుల్లో అనుమతించకూడదని జీఓఎం సిఫారసు చేసింది. మత ప్రాంతాలు, షాపింగ్ మాల్స్ తదితర బహిరంగ ప్రదేశాలపై డ్రోన్లతో సునిశిత పర్యవేక్షణ పెట్టాలని సూచించింది. ఎలాగూ వేసవి సెలవులు ఉంటాయి కనుక జూన్ చివరి వరకు విద్యా సంస్థలను మూసేయడమే సరైన నిర్ణయమని ప్రభుత్వం భావిస్తోంది. కరోనాపై తీసుకునే నిర్ణయాల్లో రాష్ట్రాలు ఇచ్చే సమాచారమే కీలకమని జీఓఎం పేర్కొంది. దేశవ్యాప్తంగా కరోనా నిర్ధారణ పరీక్షల సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. నిత్యావసర వస్తువుల సరఫరాపై కూడా భేటీలో చర్చించారని, దేశంలో ఎక్కడా వాటి రవాణాకు అడ్డంకులు ఏర్పడలేదని సంబంధిత మంత్రి వివరించారని అధికార వర్గాలు వెల్లడించాయి. కరోనా కారణంగా నెలకొన్న పరిస్థితిపై లోతైన చర్చ జరిపామని జీఓఎం భేటీ అనంతరం రాజ్‌నాథ్ ట్వీట్ చేశారు.

**40 కోట్ల మంది మరింత పేదరికంలోకి..**

కరోనా వ్యాప్తిని నిరోధించే ఉద్దేశంతో మార్చ్ 25 నుంచి లాక్‌డౌన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. కరోనా సంక్షోభం కారణంగా భారత్‌లో 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు మరింత పేదరికంలోకి వెళ్లే ప్రమాదముం దని అంతర్జాతీయ కార్మిక సంస్థ పేర్కొంది. మరోవైపు, ఆల్కహాల్ ఉత్పత్తులను అమ్మేందుకు అనుమతించాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీస్ (సీఐఏబీసీ) తెలంగాణ, కర్నాటక, రాజస్తాన్, హరియాణా, మహారాష్ట్ర, యూపీ సహా 10 రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసింది.

# జనసమ్మర్ధం ఎక్కడెంత ?

**జీవితం అంటే నాలుగ్గోడల మధ్య బందీ కావడం కాదుగా..**
**ఇల్లు దాటి బయటకు వస్తే ప్రపంచం అంటే ఏంటో తెలుస్తుంది.**
**కానీ ఇప్పుడు మనం ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్నాం.**
**కరోనాతో భౌతిక దూరం పాటించక తప్పదు.**

న్యూఢిల్లీ: నిత్యావసరం, అత్యవసరం అంతకు మించి గుమ్మం దాటి బయటకు రావడానికే లేదు. ఇండియా మాత్రమే కాదు. అన్ని దేశాల పరిస్థితి ఇంతే. అయినా సరే బయటకు వచ్చే జనం వస్తూనే ఉన్నారు. అయితే లాక్‌డౌన్‌కి ముందు తర్వాత పరిస్థితుల్ని పోలుస్తూ గూగుల్ మ్యాప్స్ ప్రపంచ దేశాల్లో ఏయే ప్రాంతాల్లో ఎంత రద్దీ తగ్గిందో ఒక నివేదిక రూపొందించింది. భౌతిక దూరం నిబంధనలపై ఆరోగ్య శాఖ అధికారులకు ఉపయోగపడడం కోసం ఈ నివేదిక రూపొందించింది. వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న వారే అత్యధికులు కావడంతో ఇంటిపట్టున ఉండే వారి శాతం పెరిగింది. మిగిలిన అన్ని చోట్లా జనసమ్మర్ధం సాధారణం కంటే 50 శాతానికి పైగా తగ్గింది.

**మార్చి నెలాఖరు నాటికి భారత్‌లో జనసమ్మర్ధం పరిస్థితి ఇలా ఉంది..**






ఈ వీల్ చైర్‌లో కూర్చున్న వ్యక్తి పేరు మన్మోహన్ సింగ్(82). కోవిడ్-19 బారిన పడిన ఈయన కోలుకొని మంగళవారం డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా విజయ సంకేతం చూపిస్తున్న ఢిల్లీలోని ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రి వైద్యులు

## విస్టా ప్రాజెక్టు, మీడియా ప్రకటనలు నిలిపివేయండి: ప్రధానికి సోనియా లేఖ

న్యూఢిల్లీ: కోవిడ్-19పై పోరుకి నిధుల సమీకరణకు కేంద్రం ఢిల్లీలో తలపెట్టిన విస్టా ప్రాజెక్టు(సుందరీకరణ)ని నిలిపివేయాలనీ, మీడియాకి ప్రకటనలు పూర్తిగా ఆపివేయాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ ప్రధాని మోదీకి సూచించారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర పాలనాధికారుల విదేశీ ప్రయాణాల కోసం ఐదేళ్ళలో రూ.393 కోట్లు ఖర్చు అయ్యిందనీ, వీరంతా విదేశీ ప్రయాణాలు మానుకోవాలని సోనియా గాంధీ ప్రధానమంత్రికి లేఖ రాశారు. కోవిడ్‌ని ఎదుర్కోవడానికి సూచనలు చేయాలంటూ ప్రధాని కోరిన మేరకు, సోనియా స్పందించారు. ఏటా కేంద్రం మీడియాకి ప్రకటనల రూపంలో రూ. 1,250 కోట్లు ఖర్చు చేస్తోందనీ, టెలివిజన్, ప్రింట్, ఆన్‌లైన్ ప్రకటనలపై రెండేళ్లపాటు నిషేధం విధించి, కోవిడ్, ప్రజారోగ్య సంబంధిత ప్రకటనలు కొనసాగించాలని కోరారు. అలాగే రూ. 20,000 కోట్లతో ఢిల్లీ మహానగరంలో జరపతలపెట్టిన 'సెంట్రల్ విస్టా' సుందరీకరణ ప్రాజెక్టుని తక్షణమే నిలిపివేయాలన్నారు. రూ.25,000 కోట్లతో నిర్మించతలపెట్టిన పార్లమెంటు భవన నిర్మాణాన్ని వాయిదా వేసుకోవాలని సూచించారు. కేంద్రం ఖర్చుచేసే నిధుల్లో 30 శాతం తగ్గించగలిగితే దాదాపు రెండున్నర లక్షల కోట్ల రూపాయలు ఆదా చేయొచ్చనీ, ఈ మొత్తంతో పేదలు, రైతులకు ఆసరాగా నిలవొచ్చని సోనియా తెలిపారు.

## భారత్‌లో కోవిడ్-19 పరీక్షలు విస్తృతంగా జరగాలి

**బ్రిటన్ అధ్యయనం వెల్లడి**

లండన్: భారత్‌లో కరోనా వ్యాప్తి, తద్వారా సమాజం, ఆర్థిక రంగాలపై పడే ప్రభావంపై కచ్చితంగా ఒక అంచనాకు రావాలంటే కనీసం 10 లక్షల మందికైనా కరోనా పరీక్షలు జరగాలని బ్రిటన్‌కు చెందిన ఏసీఏఎల్ఎమ్ సంస్థ తాజా అధ్యయనంలో వెల్లడించింది. దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొనాలంటే కరోనా పరీక్షలు విస్తృతంగా జరగాల్సిన అవసరం ఉందని ఆ సంస్థ సిఫారసు చేసింది. ఏసీఏఎల్ఎమ్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ రాహుల్ పొట్లూరి మొత్తం 50 దేశాల్లో కరోనా వ్యాపిపై అధ్యయనం చేశారు. వివిధ దేశాల్లో కేసులు ఎక్కువగా నమోదు కావడానికి అక్కడ పరీక్షలు విస్తృతంగా జరగడమే కారణమన్నారు. భారత్‌లో వైరస్ విస్తరణ, భవిష్యత్‌లో పరిస్థితులపై ఒక అభిప్రాయానికి రావాలంటే ఇప్పుడు జరుగుతున్న పరీక్షలు సరిపోవన్నారు. అత్యధిక పరీక్షలు నిర్వహించిన దేశాల్లోనే మృతుల రేటు తక్కువగా ఉందని ఆయన వివరించారు.

# దేశీయ అవసరాలు తీరాకే..!

## హైడ్రాక్సీ క్లోరోక్విన్, పారాసిటమాల్ ఎగుమతులపై కేంద్రం

- మందుల ఎగుమతులపై ఆంక్షలు సడలింపు
- పరిస్థితులనుబట్టి ఆయా దేశాలకు ప్రాధాన్యం
- విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టీకరణ
- ఇవ్వకుంటే ప్రతిచర్యలుంటాయన్న ట్రంప్




న్యూఢిల్లీ: కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు ఉపయోగపడుతుందని అనుకుంటున్న హైడ్రాక్సీ క్లోరోక్విన్ మందుపై భారత్, అమెరికాల మధ్య రగడ మొదలైంది. ఆ మందు వెంటనే తమకు పంపాలని ట్రంప్ కొంతకాలంగా డిమాండ్ చేస్తూండగా.. సోమవారం ఒకడుగు ముందుకేసి భారత్ సరఫరా చేయకపోతే ప్రతిచర్యలు ఉంటాయని హెచ్చరించారు. భారత్ అటు కర్ర విరగకుండా.. ఇటు పాముా చావకుండా అన్నట్లుగా మందుల ఎగుమతులపై విధించిన నిషేధాన్ని పాక్షికంగా ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా.. క్లోరోక్విన్ కోసం ఇప్పటికే కొన్ని దేశాలు ఆర్డర్లు ఇచ్చినప్పటికీ పరిస్థితులను బట్టి ఎగుమతులు మొదలుపెడతామని, అది కూడా దేశీయ అవసరాలన్నీ తీరిన తరువాత మాత్రమే జరుగుతుందని కుండబద్దలు కొట్టింది.

'కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో మానవతా దృష్టితో తగు మోతాదులో పారాసిటమాల్, హైడ్రాక్సీ క్లోరోక్విన్ ఉత్పత్తికి లైసెన్సులు ఇవ్వాలని భారత్ నిర్ణయించింది. మా సామర్థ్యంపై ఆధారపడ్డ ఇరుగు పొరుగు దేశాలకు మందులు అందిస్తాం' అని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి అనురాగ్ శ్రీవాస్తవ తెలిపారు. మహమ్మారి కారణంగా బాగా దెబ్బతిన్న దేశాలకూ ఈ అత్యవసర మందులు సరఫరా చేస్తామని ఆయన తెలిపారు. అంతర్జాతీయ సమాజం పరస్పరం సహకరించుకోవాలన్నదే భారత్ విధానమని, ఇతర దేశాల నుంచి భారతీయులను ఖాళీ చేయించే విషయంలోనూ తాము ఇదే స్ఫూర్తితో వ్యవహరించామని ఆయన వివరించారు. బాధ్యతాయుతమైన దేశంగా ముందు దేశ జనాభాకు తగ్గ మందులు ఉంచుకోవాల్సి ఉంటుందని, ఆయన స్పష్టం చేశారు. ఈ కారణంగానే పాక్షిక నిషేధం విధించామని, పరిస్థితులను సమీక్షించిన తరువాత ఎత్తివేస్తున్నామని చెప్పారు.

మలేరియా చికిత్సలో వాడే హైడ్రాక్సీ క్లోరోక్విన్‌ను ప్రపంచంలోనే అత్యధికంగా ఉత్పత్తి చేసే దేశం భారత్ కావడం గమనార్హం.

## నిస్పృహతోనే బెదిరింపు



తమకు కావాల్సిన మందులు సరఫరా చేయని పక్షంలో భారత్‌పై ప్రతిచర్యలు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన కొన్ని గంటల్లోనే భారత్ ఎగుమతులపై నిషేధాన్ని పాక్షికంగా ఎత్తివేయడం గమనార్హం. గత ఆదివారమే మోదీతో జరిగిన ఫోన్ సంభాషణల్లో హైడ్రాక్సీ క్లోరోక్విన్‌ను తమకు సరఫరా చేయాలని ట్రంప్ విజ్ఞప్తి చేశారు. తాజాగా ప్రతిచర్యలు ఉంటాయన్న ట్రంప్ వ్యాఖ్య నిస్పృహతో అప్పటికప్పుడు చేసింది మాత్రమేనని భారత్ భావిస్తోంది. వైట్ హౌస్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఒకవేళ భారత్ ఎగుమతులకు అనుమతించకపోతే అది వారి నిర్ణయమని, ప్రతీకార చర్యలు తప్పకుండా ఉంటాయని స్పష్టం చేశారు.

# ఒక్కొక్కరి ద్వారా 406 మందికి కరోనా

- భౌతిక దూరం పాటిస్తే 2.5 మందికి మాత్రమే
- ఐసీఎంఆర్ అధ్యయనంలో వెల్లడి
- 24 గంటల్లో 508 కొత్త కేసులు

సాక్షి, న్యూఢిల్లీ: భౌతిక దూరం పాటించకపోతే ఒక్కో కోవిడ్ రోగి నెల రోజుల్లో కనీసం 406 మందికి వ్యాధిని అంటిస్తాడని తాజా అధ్యయనం ఒకటి చెబుతున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ లవ్ అగర్వాల్ తెలిపారు. కోవిడ్-19 నియంత్రణ చర్యలపై మంగళవారం నాటి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక రోగి నుంచి ఎంతమందికి రోగం వ్యాప్తి చెందుతుందనేదాన్ని ఆర్-నాట్‌గా వ్యవహరిస్తారని, కోవిడ్-19 విషయంలో ఆర్-నాట్ 1.5 నుంచి 4.0 మధ్య ఉన్నట్లు ఒక అధ్యయనంలో తేల్చారని వివరించారు. ఆర్-నాట్ 2.5 మాత్రమే ఉందని అనుకున్నా భౌతిక దూరం పాటించకపోతే ఒక్కో రోగి నెల రోజుల్లో 406 మందికి వ్యాధిని వ్యాపింపజేస్తాడని ఆయన లెక్కకట్టారు. భౌతిక దూరాన్ని కచ్చితంగా పాటించి రోగి కదలికలను 75 శాతం వరకూ నియంత్రించగలిగితే మాత్రం ఒక్కో రోగి నుంచి మరో 2.5 మందికి మాత్రమే వ్యాప్తి చెందుతుందని అన్నారు. ఈ కారణంగానే దేశంలో భౌతిక దూరం పాటించడం అత్యవసరమని ఆయన తెలిపారు.

**దేశంలో మొత్తం 4,789 కేసులు...**

దేశవ్యాప్తంగా మంగళవారం నాటికి కోవిడ్ బారిన పడ్డ వారి సంఖ్య 4,789కు చేరుకుందని, మొత్తం 124 మంది ప్రాణాలు కోల్పోయారని ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీ లవ్ అగర్వాల్ తెలిపారు. సోమవారం రాత్రి నుంచి 24 గంటల్లో దేశవ్యాప్తంగా 508 కొత్త కేసులు బయటపడ్డాయని చెప్పారు. మరణాల సంఖ్య పది అని అన్నారు. మరో 352 మంది చికిత్స తరువాత ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కావడం లేదా వలస వెళ్లడం జరిగిందని ఆరోగ్య శాఖ తెలిపింది. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 4,312గా ఉందని చెప్పింది. మొత్తం కేసుల్లో 66 మంది విదేశీయులు.గా తెలిపింది. గత 24 గంటల్లో మరణించిన ఎనిమిది మందిలో నలుగురు మధ్యప్రదేశ్‌కు చెందిన వారు కాగా, ముగ్గురు మహారాష్ట్ర వారని, గుజరాత్, ఒడిశా, పంజాబ్‌ల నుంచి ఒకొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారని వివరించారు.

కోవిడ్-19 ప్రభావం ఎక్కువగా ఉన్న క్లస్టర్లలో వ్యాధి నియంత్రణకు చేపడుతున్న చర్యలు అనుకున్న ఫలితాలిస్తున్నాయని వివరించారు. పేషెంట్ల స్థితిని బట్టి చికిత్స అందించేందుకు మూడు రకాలుగా చికిత్స కేంద్రాలను వర్గీకరించామని లవ్ అగర్వాల్ తెలిపారు. వ్యాధి లక్షణాల తీవ్రత ఒక మోస్తరుగా మాత్రమే ఉన్న వారిని కోవిడ్ కేర్ కేంద్రాలకు తరలిస్తామని, హాస్టళ్లు, క్రీడా మైదానాలు, పాఠశాలల వంటి ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలను కేర్ సెంటర్లుగా ఉపయోగించుకుంటామని, ఇప్పటివరకూ క్వారంటైన్ కేంద్రాలుగా పనిచేస్తున్న వాటిని కూడా కేర్ సెంటర్లుగా ఉపయోగించుకుంటామని వివరించారు. వ్యాధి లక్షణాలు తీవ్రత ఎక్కువగా ఉంటే ఆరోగ్య కేంద్రాలకు రోగిని తరలిస్తామని, తీవ్రస్థాయిలో ఉండే కేసులను అత్యవసర సేవలందించే ఆసుపత్రుల్లో ఉంచుతామని ఆయన వివరించారు.

## తబ్లిగీ కార్యకలాపాలను నిలిపివేయాలి!

**సీజేఐకి లేఖ**

న్యూఢిల్లీ: ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో తబ్లిగీ జమాత్ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేసేలా కేంద్రప్రభుత్వానికీ, ఢిల్లీ రాష్ట్రప్రభుత్వానికీ ఆదేశాలివ్వాలనీ, కరోనా వైరస్ వ్యాప్తికి కారణమైన తబ్లిగీ జమాత్ కేంద్ర కార్యాలయాన్ని కూల్చివేసేలా ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ ఎస్.ఏ బాబ్డేని ఢిల్లీకి చెందిన అజయ్ గౌతం లేఖ ద్వారా కోరారు. ఈ లేఖని రిట్‌పిటిషన్‌గా స్వీకరించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో భారీ సమావేశాలపై ఆంక్షలు ఉన్నప్పటికీ, ఆ ఆంక్షలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, ఢిల్లీ ప్రభుత్వాధికారులపై కఠిన చర్యలు తీసుకునేలా ఢిల్లీ రాష్ట్రప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని ఆయన కోరారు.

**ప్రాంతీయ కార్యాలయం: తెలంగాణ**
**కార్మిక రాజ్య బీమా సంస్థ**
5-9-23, హిల్ ఫోర్ట్ రోడ్, ఆదర్శ్‌నగర్, హైదరాబాద్-500063.
ఫోన్ నం.లు: 040-23232356, 57, 58, 59. ఫ్యాక్స్ నం. 040-23235048
వెబ్‌సైట్: www.esic.nic.in, ఇ-మెయిల్: rd-ap@esic.nic.in

**ఆసక్తి వ్యక్తీకరణ దాఖలు కోసం ఆఖరి తేది పొడిగింపు**

కార్మిక రాజ్య బీమా సంస్థ, ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్ వారికి సంబంధించి 21 మార్చి, 2020న ఈ వార్తా పత్రికలో ప్రచురించబడిన ప్రకటన ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని ESI పథకం లబ్ధిదారులకు **సూపర్ స్పెషాలిటీ ట్రీట్‌మెంట్ & సెకండరీ కేర్ ట్రీట్‌మెంట్ ఏర్పాటుచేయుటకు HCO's ఎంప్యానల్‌మెంట్** కోసం ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ ప్రకటనలకు సంబంధించిన నిర్దేశంతో ఆసక్తి వ్యక్తీకరణ (EoI) దాఖలు కోసం ఆఖరి తేది **05.05.2020న సా. 5.00 గం. వరకు** పొడిగించబడినదని ప్రకటించడమైనది. ఇతర నియమ నిబంధనలలో ఎట్టి మార్పులేదు. వివరమైన సమాచారం కోసం దర్శించండి: www.esic.nic.in (offices>RO/SRO>Telangana>Announcements>Instructions/Circulars/Orders)

**అడిషనల్ కమిషనర్ & రీజినల్ డైరెక్టర్, కార్మిక రాజ్య బీమా సంస్థ, హైదరాబాద్**

**THE SINGARENI COLLIERIES COMPANY LIMITED**
**(A Government Company)**
**R.O: Kothagudem Collieries - 507101, Telangana.**

**e-Procurement TENDER NOTICE**

Tenders have been published for the following Services / Material Procurement through e-procurement platform. For details, please visit https://tender.telangana.gov.in - or - https://www.sccImines.com

| NIT No., Date – Name of the work – ECV- Last date & time for Submission of bids |
|---|
| **CRP/CVL/RG-II/TN-02/2020-21,dt.02.04.2020**-Providing renewal coat with Bituminous Concrete to Ramagundam Coal Corridor road from Area workshop junction to OCP-I SILO junction and Manthani road junction to 2 town police station junction via Vakilpalli mine at RG-II area, Godavarikhani, Peddapalli Dist., Telangana State **Rs.4,07,07,751/-on 17.04.2020 up to 4.30 P.M** |
| **CRP/CVL/RG-II/ TN-03/2020-21, dt.02.04.2020**-Strengthening of the Diverted Jallaram Nallah by providing CC lining, where major fault is exposed in Phase-II at RG OCP-III, RG-II area, Godavarikhani, Peddapalli Dist., Telangana State. **Rs.2,83,08,364/- on 17.04.2020 up to 4.30 P.M.** |
| **CRP/CVL/KGM/TN-04/2020-21, dt.02.04.2020**- Construction of 2 Nos. 75 Tonne Steel Bunkers for PVK admittance of RCHP at Kothagudem area, Bhadradri Kothagudem Dist. Telangana State. **Rs.53,77,475/- on 17.04.2020 up to 4.30 P.M** |
| **CRP/CVL/SRP/TN-05/2020-21, Dt.02.04.2020**- Construction of Ground level Storage Reservoir (GLSR) including Electrical equipment room for water supply distribution at Naspur colony in Srirampur area, Mancherial dist, **T.S. Rs. 119,55,484/- on 17.04.2020 up to 4.30 P.M** |
| **CRP/CVL/KGMA/TN-06/2020-21 Dt. 03.04.2020**- Construction of CC Drains at Rudrampur Railway siding yard (RCHP) Railway Siding between BDCR-RUSG siding (Assisted siding) at Kothagudem Area, Badradri Kothagudem Dist, **T.S. Rs. 60,53,369/- on 24.04.2020 up to 4.30 P.M.** |
| **CRP/CVL/YLD/ TN-07/2020-21, Dated. 03.04.2020**- Widening of existing BT road with CC pavement including construction of CC retaining wall on either side of road near existing causeway on Tekulapalli to Tadikalapudi Road, Yellandu area, Bhadradri Kothagudem Dist. Telangana State. **Rs. 1,95,21,197/- on 21.04.2020 up to 4.30 PM** |
| **CRP/CVL/KGM/ TN-08/2020-21, Dated. 03.04.2020**-Construction of 8 x 1.00 Lakh gallons capacity Filter Beds, pump house and office at Gouthampur colony, Kothagudem area, Bhadradri Kothagudem Dist. **T.S. Rs. 4,33,75,110/- on 21.04.2020 upto 4:30 PM** |
| **NIT/Enquiry No. - Description/Subject - Last date and time for Submission of bid(s)** |
| **E1919O0453** Hiring of 10T Non-Tipper Lorries ( Long Chassis and Short Chassis ) for a period of 4(Four) years with a clause for 1(One)Year extension based on condition, perfomance and requirement of SCCL for use at various Areas on Open enquiry basis **21/04/2020 17:00** |

PR/2019-20/MP/CVL/SLK/129 GM (MP) – CHIEF (CIVIL)

## లాక్‌డౌన్‌తో రైతులకు నష్టం వాటిల్లదు: నీతి ఆయోగ్

న్యూఢిల్లీ: లాక్‌డౌన్ కాలంలో ప్రభుత్వం చేపట్టిన అనేక చర్యల వల్ల ఎటువంటి దుష్పరిణామాలకు గురికాకుండా రైతాంగాన్ని కాపాడగలిగామని నీతి ఆయోగ్ సభ్యులు రమేష్ చంద్ అన్నారు. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయరంగంలో మూడుశాతం అభివృద్ధిని సాధించగలిగామని ఆయన వెల్లడించారు. ఈ లాక్‌డౌన్ కాలంలో రైతుల మార్కెట్లకు ఎటువంటి ఆటంకం కలగకుండా మార్కెట్లు సజావుగా సాగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. రైతుల వ్యవసాయ పనులపై ఎటువంటి ఆంక్షలు విధించలేదనీ, కేంద్ర మార్గదర్శకాలను పాటించిన రాష్ట్రాల్లో రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లదని ఆయన స్పష్టం చేశారు. ఉత్తర భారతంలో మరోవారంలో రబీ సీజన్‌లో ప్రధాన పంట అయిన గోధుమ దిగుబడి చేతికి వస్తుందనీ, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ ప్రభుత్వం చేపట్టినట్టు ఆయన తెలిపారు. భారత దేశంలోని రేషన్ కార్డుకలిగిన 80 కోట్లమంది పేద ప్రజలు ప్రతినెలా ఐదుకేజీల గోధుమ లేదా బియ్యం, ఒక కేజీ పప్పులు 3 నెలల పాటు పొందుతారని ఆయన అన్నారు. జన్‌ధన్ బ్యాంకు ఖాతాలున్న 20.4 కోట్ల మహిళలకు నెలకు రూ.500 చొప్పున మూడు నెలల్లో రూ. 1,500 జమవుతాయని ఆయన అన్నారు.

## సీబీఎస్‌ఈ సిలబస్‌లో స్కిల్ కోర్స్

న్యూఢిల్లీ: ఆరో తరగతి నుంచి 11వ తరగతి వరకు ప్రస్తుతమున్న 5 కంపల్సరీ సబ్జెక్టులతో పాటు ఒక స్కిల్ కోర్సును ప్రారంభించాలని సీబీఎస్‌ఈ నిర్ణయించింది. 2020–21 విద్యా సంవత్సరం నుంచి దీన్ని ప్రారంభించాలనుకుంటోంది. వృత్తి నైపుణ్యాలను పెంచుకునే దిశగా స్వల్ప కాలిక మోడ్యూల్స్‌గా ఇవి ఉంటాయని, ఏ కోర్సును ఎంచుకోవాలనే చాయిస్ విద్యార్థులకే ఉంటుందని సీబీఎస్‌ఈ ట్రైనింగ్ అండ్ స్కిల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విశ్వజిత్ సాహా తెలిపారు. 6, 7, 8 తరగతుల్లో వీటిపై అవగాహన పెంచుకున్న విద్యార్థులకు కెరీర్ అవకాశాలపై స్పష్టత లభిస్తుందన్నారు.

# ఐసీయూలో బ్రిటన్ ప్రధాని

- జాన్సన్ ఆరోగ్యం నిలకడగా ఉందన్న ప్రధాని కార్యాలయం
- అమెరికాలో మరణ మృదంగం
- జపాన్‌లో ఎమర్జెన్సీ



లండన్/వాషింగ్టన్/టోక్యో: కరోనా వైరస్ మహమ్మారితో బాధపడుతున్న బ్రిటన్ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ పరిస్థితి నిలకడగా ఉంది. లండన్ ఆస్పత్రిలో ఐసీయూలో ఉంచి ఆయనకు చికిత్స అందిస్తున్నారు. వెంటిలేటర్ సాయం అవసరం ఆయనకు లేదని ప్రధాని కార్యాలయం మంగళవారం వెల్లడించింది. జాన్సన్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని ఆయనలో ఎలాంటి న్యుమోనియా లక్షణాలు కనిపించలేదని తెలిపింది. ''ప్రధానమంత్రి జాన్సన్ ఆరోగ్యం నిలకడగా ఉంది. ప్రతీరోజూ ఆక్సిజన్ చికిత్స అందిస్తున్నామని, వెంటిలేటర్ పెట్టాల్సిన అవసరం లేదు'' డౌనింగ్ స్ట్రీట్ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు. లండన్‌లో సెయింట్ థామస్ ఆస్పత్రిలో వైద్య నిపుణుల బృందం జాన్సన్‌కు చికిత్స అందిస్తున్నారని, జాన్సన్ చెప్పినట్టుగా ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని ఆయన వివరించారు.

**జాన్సన్ కోలుకోవాలని సందేశాలు**

బోరిస్ జాన్సన్ కోలుకోవాలంటూ ప్రపంచ దేశాల నాయకులు సందేశాలు పంపారు. ''ప్రధాని జాన్సన్. మీరు ఆస్పత్రి నుంచి బయటకు వచ్చి, సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షిస్తున్నాను'అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. జాన్సన్ తనకు మంచి మిత్రుడని, ఆయన త్వరగా కోలుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా ప్రజలందరూ ఆయన కోలుకోవాలని ప్రార్థిస్తున్నారని చెప్పారు. ఇలాంటి విషమ పరిస్థితుల్లో బోరిస్ జాన్సన్, ఆయన కుటుంబం, బ్రిటన్ ప్రజలందరి వెంట ఉంటామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రన్ చెప్పారు.

**అమెరికాలో మరణ మృదంగం**

అగ్రరాజ్యం అమెరికాలో మృతుల సంఖ్య 11 వేలకు, వ్యాధిగ్రస్తుల సంఖ్య 4 లక్షలకు చేరుకుంది. న్యూయార్క్‌లో అత్యధికంగా 5 వేల కేసులు నమోదయ్యాయి.

**జపాన్‌లో అత్యవసర పరిస్థితి**

జపాన్‌లో కరోనా కేసులు పెరిగిపోతూ ఉండడంతో ప్రధానమంత్రి షింజో అబె నెల పాటు ఎమర్జెన్సీ విధిస్తున్నట్టు ప్రకటించారు. ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని అన్నారు. సోమవారం ఒకే రోజు 100 కొత్త కేసులు నమోదు కావడంతో మొత్తం కేసుల సంఖ్య 1200కి చేరుకుంది. లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు.

**ఇటలీ, స్పెయిన్‌లలో పెరిగిన మృతులు**

ఇటలీ, స్పెయిన్‌లలో గత నాలుగైదు రోజులుగా తగ్గినట్టుగా అనిపించిన కోవిడ్-19 మృతుల సంఖ్య మళ్లీ ఎక్కువైంది. 24 గంటల్లో స్పెయిన్‌లో 743 మరణాలు నమోదైతే, ఫ్రాన్స్‌లో 833 మంది ప్రాణాలు కోల్పోయారు.

| ప్రపంచ వ్యాప్తంగా మొత్తం కేసులు | మరణాలు | కోలుకున్న వారు |
|---|---|---|
| 13,94,710 | 79,384 | 2,98,491 |

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| 1. అమెరికా | 3,84,276 | 12,141 |
| 2. స్పెయిన్ | 1,40,511 | 13,897 |
| 3. ఇటలీ | 1,35,586 | 17,127 |
| 4. జర్మనీ | 1,05,604 | 1,905 |
| 5. ఫ్రాన్స్ | 98,010 | 8,911 |
| 6. చైనా | 81,740 | 3,331 |
| 7. ఇరాన్ | 62,589 | 3,872 |
| 8. యూకే | 55,242 | 6,159 |
| 9. టర్కీ | 34,109 | 725 |
| 10. స్విట్జర్లాండ్ | 22,253 | 821 |

# సాక్షి 24|7 నల్లగొండ

NALGONDA DISTRICT

బుధవారం । 8 । ఏప్రిల్ । 2020




**కరోనా మీటర్**
(7వ తేదీ వరకు)

ఇప్పటికే నలుగురు బర్మా దేశస్తులకు కరోనా సోకింది. (మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎలాంటి కరోనా కేసులు నమోదు కాలేదు)

నల్లగొండలో
మీర్‌బాగ్ కాలనీ 4
బర్కత్‌పుర 2
మాన్యంచెల్క 2
రెహమాన్‌బాగ్ 1




## న్యూస్‌రీల్

### లాక్‌డౌన్ పాటించి కరోనాను తరిమేద్దాం



**మిర్యాలగూడ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు లాక్‌డౌన్ పాటించి కరోనా వైరస్‌ను తరిమేద్దామని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడలోని రెడ్‌జోన్‌గా ప్రకటించిన సీతారాంపురంతో పాటు సుందర్‌నగర్‌లో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ ఆధ్వర్యంలో ది పీపుల్ ఆఫ్ మిర్యాలగూడ, టీఎన్‌బీ ఫౌండేషన్ సహకారంలో రెండు వేల మందికి స్థానిక ఎమ్మెల్యే భాస్కర్‌రావుతో కలిసి కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తిప్పన విజయసింహారెడ్డి, ఏఎంసీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బంటు శ్రీను, ఆర్డీఓ రోహిత్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రం, మొబైల్ రైతు బజార్ ప్రారంభం..**

మండలంలోని అవంతీపురంలో వ్యవసాయ మార్కెట్‌లో ఆలగడప పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద మొబైల్ రైతు బజార్‌ను శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు ప్రారంభించారు.

### సాగర్ ఆస్పత్రిలో ఐసోలేషన్ బెడ్ల పెంపు

**నాగార్జునసాగర్ :** జిల్లాలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రిలో ఐసోలేషన్ బెడ్ల సంఖ్యను పెంచారు. ప్రస్తుతం ఐదు బెడ్లు ఉండగా మరో 20 బెడ్లు ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆర్‌ఎంఓ డాక్టర్ భాను ప్రసాద్ నాయక్ తెలిపారు. నల్లగొండలోని జిల్లా జనరల్ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డు నిండిపోవడంతో.. ఈ ప్రాంతం నుంచి కొత్తగా వచ్చే వారిని ఇకనుంచి కమలా నెహ్రూ ఆసుపత్రిలోనే ఉంచనున్నారు.

**సాగర్ నుంచి మరో ముగ్గురిని పరీక్షలకు..**

మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వ్యక్తి సాగర్‌లో జరిగిన వివాహానికి హాజరైన విషయం తెలిసిందే. అతని కుమారులకు పరీక్షలు చేయగా ఒకరికి పాజిటివ్ వచ్చింది. ఇతని తో కాంటాక్టయిన మరో ముగ్గురిని మంగళవా రం పరీక్షల నిమిత్తం నల్లగొండకు పంపారు. వీరేగాక పెద్దవూర మండలం కుంకుడుచెట్టుతండా నుంచి కూడా ఒకరిని పంపినట్లు తెలిసింది.

**క్వారంటైన్‌కోసం కళాశాలలు!**

కరోనా అనుమానితులను క్వారంటైన్‌లో ఉంచేందుకుగాను ఆస్పత్రులు సరిపోయేలా లేవు. దీంతో స్థానికంగా ఉన్న పాలిటెక్నిక్, జూనియర్ కళాశాలలను క్వారంటైన్ కేంద్రాలుగా ఎంపిక చేసేందుకు అధికారులు ప్రతిపాదించారు. కమలా నెహ్రూ పాత ఆసుపత్రికి మరమ్మతులు చేస్తే ఎంత ఖర్చవుతందనే అంచనాలను ఉన్నతాధికారులు అడిగినట్లు సమాచారం.

### పీపీఐ కిట్ల పంపిణీ

**మిర్యాలగూడ :** కరోనా వ్యాప్తి నివారణలో భాగంగా క్వారంటైన్ సెంటర్లలో వైద్య సిబ్బందికి పీపీఐసీ (పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్) 50 కిట్లను జ్యోతి హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ ముష్వా రామారావు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ కేసా రవి, మహేందర్‌రెడ్డి, ఏడుకొండలు, ప్రభాకర్ పాల్గొన్నారు.

### కరోనా నిర్మూలన టన్నెల్ ప్రారంభం



**నల్లగొండ టూటౌన్ :** పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానం ద్వారం వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కరోనా నిర్మూలన టన్నెల్‌ను మంగళవారం నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయల కొనుగోలుకు వచ్చే ప్రజలు భౌతిక దూరం పాటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కమిషనర్ దేవ్‌సింగ్, కౌన్సిలర్లు ఖయ్యూంబేగ్, మా తంగి సత్యనారాయణ పాల్గొన్నారు.

### విదేశీయులపై కేసు

**నల్లగొండ క్రైం :** ఇటీవల జిల్లాకు వచ్చిన పలువురు విదేశీయులు, వారికి వసతి కల్పించిన వారిపై నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. గత నెలలో వియత్నం నుంచి వచ్చిన 14 మంది, వారికి వసతి కల్పించిన నలుగురిపై, బర్మా దేశం నుంచి వచ్చిన 17 మంది, వారికి షెల్టర్ ఇచ్చిన నలుగురిపై మొత్తం 39 మందిపై కేసు నమోదు చేశారు.



## పింఛన్ 'బారులు'..!

ప్రభుత్వం అందజేసే ఆసరా పింఛన్ల కోసం మంగళవారం లబ్ధిదారులు బారులుదీరారు. కరోనా నేపథ్యంలో నల్లగొండలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కేంద్రం వద్ద భౌతిక దూరం పాటిస్తూ.. మాస్కులు ధరించి ఇలా క్యూలో నిలబడ్డారు. కాగా వృద్ధులు, వికలాంగులు ఎక్కువ సేపు నిలబడేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# ఇంకెన్నో..!

- జిల్లాలో ఇప్పటికే 15 కరోనా కేసులు
- మరో 89 మంది రిపోర్టులు పెండింగ్
- అవికూడా వస్తే ఎన్ని పాజిటివ్ వస్తాయోనని ప్రజల ఆందోళన
- లాక్‌డౌన్‌ను కట్టుదిట్టంగా అమలు చేస్తున్న అధికారులు
- మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా రోడ్లు
- నేతల కార్యక్రమాల్లో కనిపించని భౌతికదూరం



నల్లగొండలోని ఎన్జీ కళాశాల ఎదుట నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

**సాక్షి ప్రతినిధి, నల్లగొండ :** జిల్లాను కరోనా కలవరపెడుతోంది. రోజురోజుకు కరోనా పీడితుల సంఖ్య పెరిగి ప్రస్తుతం 15కు చేరింది. అందులో నాలుగు పాజిటివ్ కేసులు బర్మా దేశస్తులవి కాగా మిగిలిన 11 మంది జిల్లా వాసులే. ఒక్క జిల్లా కేంద్రంలోనే 9 మంది కరోనా బారిన పడడంతో పట్టణ ప్రజలంతా ఆందోళన చెందుతున్నారు. కాగా.. జిల్లా నుంచి 162 మంది రక్తనమూనాలు సేకరించి కరోనా పరీక్షలకు పంపగా ఇంకా 89 మందికి సంబంధించి రిపోర్టులు రావాల్సి ఉంది. ఆ రిపోర్టులు కూడా వస్తే కరోనా కేసులు ఎన్ని ఉంటాయోనని ఆందోళన నెలకొంది. దీంతో జిల్లా యంత్రాంగం కరోనా కట్టడికి కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటోంది. కరోనా సోకిన బాధిత ప్రాంతాలను రెడ్ జోన్లుగా ప్రకటించి ఒక్కరు కూడా బయటికి రాకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కానీ వివిధ కార్యక్రమాల నిమిత్తం పర్యటనలు చేస్తున్న రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎక్కువమంది అనుచరులను వెంట వేసుకొని వెళ్తుండడంతో భౌతికదూరం కాస్తా అభాసుపాలవుతోంది.

**రిపోర్ట్‌ల కోసం ఎదురుచూపులు...**

జిల్లాలో ఇప్పటివరకు 162 మంది రక్తనమూనాలు కరోనా పరీక్షలకు పంపించారు. ఢిల్లీకి వెళ్లి వచ్చిన వారు, బర్మా దేశం నుంచి వచ్చిన రోహింగ్యాలు, కరోనా నిర్ధారణ అయిన వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. ఇప్పటివరకు వచ్చిన రిపోర్టుల్లో 15 మందికి కరోనా పాజిటివ్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇంకా 89 మంది రిపోర్టులు రావాల్సి ఉంది. ఇందులో ఎన్ని పాజిటివ్ వస్తాయో అన్న అనుమానంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

**పక్కాగా లాక్‌డౌన్..**

కరోనా కేసుల సంఖ్య పెరుగుతుండడంతో జిల్లాలో లాక్‌డౌన్‌ను మరింత కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. కూరగాయలు, నిత్యావసరాల దుకాణాలను తెరిచే సమయాన్ని కుదించారు. ఉదయం 11గంటలలోపే వస్తువుల కొనుగోలుకు వెళ్లనిస్తున్నారు. ఆ తర్వాత నిలిపివేస్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు దుకాణాలు బంద్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. అవసరంగా రోడ్లపైకి వచ్చేవారి విషయంలో పోలీసులు కాస్త కఠినంగానే వ్యవహరిస్తున్నారు. నల్లగొండ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి గడియారం సెంటర్‌లో సిబ్బందితో కలిసి రోడ్లపైకి వచ్చిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి వెనుకకు పంపిస్తున్నారు.

# లాక్‌డౌన్‌లో.. లిక్కర్ దందా..!

- వైన్స్‌లకు తాళాలు వేసి ఉన్నా.. లోపల సరుకంతా ఖాళీ
- పెద్దవూర, హాలియా, నిడమనూరు మండలాల్లో అక్రమంగా విక్రయాలు
- బెల్ట్‌షాపుల్లో విచ్చలవిడిగా లభిస్తున్న మద్యం
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు



హాలియాలో ఓ మద్యం షాపు నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం (ఫైల్)

**హాలియా :** జిల్లాలోని నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మద్యం దందా జోరుగా సాగుతోంది. లాక్‌డౌన్‌ను పట్టించుకోని లిక్కర్ వాపారులు మద్యం అక్రమ రవాణాకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఈ మద్యం దందా అంతా కూడా ఎక్సైజ్ అధికారుల కన్నుసన్నతోనే సాగుతోందని నియోజకవర్గ వ్యాప్తంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. 15 రోజుల క్రితం నియోజకవర్గంలో ఉన్న వైన్స్ షాపులకు ఎక్సైజ్ అధికారులు సీల్ వేశారు. అయితే ఆయా వైన్స్ షాపులకు వేసిన తాళాలు వేసినట్లుగా ఉన్నా.. లోపల సరుకంతా ఖాళీ అవుతుండడంపైనే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బయట నుంచి చూస్తే మనకు కనిపించేది ఒక్కటైతే.. దాని వెనుక జరిగే వ్యవహారం మరోలా ఉంది. పోలీసుల నిఘా, ప్రభుత్వ హెచ్చరికలను ఏమాత్రం పట్టించుకోని కొంత మంది మద్యం అక్రమార్కులు ఈ అక్రమ వ్యాపారానికి తెరతీశారు.

**అక్రమార్కులకు వరంలా..**

ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ అక్రమార్కులకు వరంలా మారింది. బెల్టు షాపులు, వైన్స్ షాపుల నిర్వాహకులకు ప్రస్తుతం మద్యం దందా కాసుల వర్షం కురిపిస్తోంది. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ మద్యం విచ్చలవిడిగా అమ్ముతుండడంపై పలు అనుమానులు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలోని హాలియా, నిడమనూరు, పెద్దవూర మండల కేంద్రాల నుంచి మద్యం తరలిస్తున్నట్లు సమాచారం.

### నేడు కలెక్టర్, ఎస్పీ సమావేశం

లాక్‌డౌన్ ఉన్నా.. జిల్లాలో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగుతుండడంపై కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఎస్పీ రంగనాథ్ ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ అధికారులతో బుధవారం నల్లగొండలో సమావేశం నిర్వహించనున్నారు. జిల్లాలోని వైన్స్‌లకు డిపోల నుంచి వచ్చిన మద్యం.. ప్రస్తుతం దుకాణాల్లో ఉన్న నిల్వపై సమీక్షించనున్నారు. బెల్ట్‌షాపుల్లో మ ద్యం అమ్మకాలు, అక్రమంగా మద్యం రవాణాపై వస్తున్న వార్తలు.. ఈ దందాపై అధికారులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకోనున్నారు.

### మద్యం అమ్మితే చర్యలు తప్పవు



వైన్స్‌లకు వచ్చిన స్టాక్ వివరాలు ప్రస్తుతం మా వద్ద లేవు. మార్చి నెలలో ఏఏ వైన్స్‌కు ఎంత స్టాక్ వచ్చిందనే పూర్తి వివరాలు మద్యం డిపోలో ఉంటాయి. గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తాం. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే.. మాకు సమాచారం ఇస్తే వారిపై కేసులు పెడుతాం. ప్రస్తుతం హాలియా ఎక్సైజ్‌శాఖ పరిధిలో బెల్ట్ షాపులపై దాడులు చేసి కేసులు పెడుతున్నాం. **- యమునాధర్‌రావు, ఎక్సైజ్ సీఐ, హాలియా**

## 'శాలిగౌరారం'లో టెన్షన్.. టెన్షన్

**శాలిగౌరారం :** సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమానుకోటలో కరోనావైరస్ 'పాజిటివ్' కేసులు బయటపడడంతో శాలిగౌరారం మండలం ఉలిక్కిపడుతోంది. శాలిగౌరారం మండలానికి సరిహద్దుగా ఉన్న మూసీనదికి మండలంలోని చిత్తలూరు గ్రామం ఇటువైపున ఉండగా అటువైపున వర్ధమానుకోట గ్రామం ఉంది. వర్ధమానుకోట నుంచి చిత్తలూరు గ్రామానికి అత్యధిక బంధుత్వాలు ఉన్నాయి. రెండు గ్రామాల మధ్య మూసీనది ఉండడం, చిత్తలూరు గ్రామంలోని శివాయలం మార్గం గుండా మూసీనది మీదుగా మార్గం ఉండడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిత్యం సాగుతుంటాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం వర్ధమానుకోట గ్రామానికి చెందిన పలువురు చిత్తలూరుకు వచ్చిపోయారు. ప్రస్తుతం కరోనావైరస్ విషయంలో వర్ధమానుకోట గ్రామం రెడ్‌జోన్‌గా మారడంతో ఆ గ్రామస్తులు చిత్తలూరు గ్రామానికి వచ్చిపోవడంతో చిత్తలూరు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామం మొత్తం క్వారంటైన్‌లో ఉన్న నేపథ్యంలో వర్ధమానుకోటకు చెందిన ఓ కుటుంబీకులు సోమవారం శాలిగౌరారంలోని ఓ ఇంటికి పెళ్లి సంబంధం మాట్లాడుకునేందుకు వచ్చివెళ్లింది. దీంతో శాలిగౌరారానికి చెందిన ప్రజలు కూడా ఆందోళనలకు గురవుతున్నారు.

# ఉల్లంఘనపై ఉక్కుపాదం

- లాక్‌డౌన్ పక్కాగా అమలు చేస్తున్న పోలీసులు
- ఇప్పటి వరకు 1,500 వాహనాల సీజ్
- 34 బెల్ట్‌షాప్‌లపై దాడులు.. మద్యం పట్టివేత
- అధిక ధరలకు సరుకులు అమ్మిన 18 మందిపై కేసు



నల్లగొండలో వాహనాలను అడ్డుకుంటున్న పోలీసులు

**నల్లగొండ క్రైం :** జిల్లాలో లాక్‌డౌన్ కట్టుదిట్టంగా అమలవుతోంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జిల్లా పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. బెల్ట్‌షాపులపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అవసరంగా రోడ్లెక్కిన వాహనాలను సీజ్ చేస్తున్నారు. సరుకు రవాణాకు పోలీసుల అనుమతి ఉన్న వాహనాలనే రోడ్డెక్కనిస్తున్నారు. దుకాణాలు తెరిచి ఉంచే సమయాన్ని మధ్యాహ్నం ఒంటి గంట వరకు కుదించి పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

**1,500 వాహనాలు సీజ్**

లాక్‌డౌన్ నిబంధనలు పట్టించుకోకుండా రోడ్డెక్కిన 1,500 వాహనాలను ఇప్పటి వరకు సీజ్ చేశారు. వీటిలో 100లోపు కార్లు ఉండగా మిగిలినవి ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఉన్నాయి. ఒకసారి చెబితే వినకుండా రోడ్డుపైకి రెండోసారి వాహనంతో వస్తే పోలీసులు సీజ్ చేస్తున్నారు. 35 ఏళ్ల లోపువారే ఎక్కువగా వాహనాలతో రోడ్లపైకి వస్తున్నట్లు గుర్తించారు. శివారు ప్రాంతాల్లో పేకాట ఆడుతూ పట్టుపడిన వారిని అదుపులోకి తీసుకుని వారి వాహనాలను కూడా సీజ్ చేస్తున్నారు.

**బెల్ట్‌షాపులపై దాడులు**

హాలియాలో వైన్స్‌ను తెరిచి బెల్ట్‌షాపులకు మద్యం తరలించిన యజమానిపై కేసు నమోదు చేశారు. బెల్ట్‌షాపులపై దాడులు చేసి మద్యం స్వాధీనం చేసుకుని 29 మందిపై ఎక్సైజ్‌శాఖ కేసులు నమోదు చేసింది. సివిల్ పోలీసులు మరో ఐదు బెల్ట్‌షాపుల్లో మద్యం పట్టుకుని కేసులు పెట్టారు. అధిక ధరలకు నిత్యావరాలు, మాస్కులు, ఇతర సామగ్రిని విక్రయిస్తున్న 18 మందిపై కేసులు నమోదు చేశారు. లాక్‌డౌన్ చట్టాన్ని ఉల్లంఘించి రోడ్లపైకి వచ్చిన 37 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మెడికల్ షాపులు తెరిచి ఉంచకపోతే వాటి యజమానులపై కూడా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. సామాజిక దూరం పాటించేలా చర్యలు తీసుకుని.. అవసరమైన మెడిసిన్ అందించాలని పోలీసులు సూచిస్తున్నారు.

**రోడ్డెక్కాలంటే పోలీస్‌ల అనుమతి...**

అత్యవసర పనిమీద వెళ్లేందుకు పోలీసుల అనుమతి ఉంటేనే రోడ్లపై వాహనాలు వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. వైద్య పరంగా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత పోలీస్‌స్టేషన్ నుంచి అనుమతి కాపీని అందజేస్తున్నారు. కూరగాయలు, కొబ్బరి బోండాలు, ఇతర నిత్యావసర సరుకుల వాహనాలకు కూడా ముందస్తుగా అనుమతి ఇచ్చారు.

### అనుమతి లేకుండా రోడ్డెక్కితే వాహనాలు సీజ్

అనుమతి లేకుండా వాహనాలతో రోడ్డెక్కితే సీజ్ చేస్తున్నాం. భౌతిక దూరం పాటించే కూరగాయల విక్రయాల కేంద్రాల్లో సాయంత్రం 6 గంటల వరకు అనుమతిచ్చాం. కరోనా సోకినట్లు గుర్తించిన కాలనీల నుంచి నిబంధనలు అతిక్రమించి వస్తే వాహనం సీజ్ చేయడంతోపాటు ఐసోలేషన్‌కి తరలిస్తాం. లాక్‌డౌన్ కఠినంగా అమలు చేసేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో బారికేడ్లు ఏర్పాటు చేశాం.
**- రంగనాథ్, ఎస్పీ, నల్లగొండ**

## నిత్యావసరాలు అందుబాటులో ఉంచాలి

- కార్డన్ ఆఫ్ జోన్లలో మొబైల్ వాహనాల ద్వారా పంపిణీ చేయాలి
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

**నల్లగొండ :** జిల్లాలో లాక్‌డౌన్ సందర్భంగా నిత్యావసర, అత్యవసర వస్తువుల సరఫరాపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ రంగనాథ్‌తో కలిసి ఆయన వివిధ శాఖల అధికారులతో నిత్యావసరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నల్లగొండ, మిర్యాలగూడ కార్డన్ ఆఫ్ జోన్ ప్రాంతాల్లో ప్రజలకు నిత్యావసరాలు, పాలు తదితర వస్తువులకు ఇబ్బంది కలుగకుండా మొబైల్ వాహనాల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లు, మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వైద్య సహాయం అందించేలా చూడాలన్నారు. బియ్యం పంపిణీ, ఆసరా పింఛన్ల అందజేత విషయంలో భౌతిక దూరం పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ రోజు ఏ సమయంలో ఎవరికి పంపిణీ చేస్తారో అనే విషయాన్ని కౌన్సిలర్లు, వార్డు సభ్యుల ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. డివిజన్ స్థాయిలో వైద్యులు ఎమర్జెన్సీ కేసులను గుర్తించి వైద్య సేవలు అందించాలన్నారు. స్టేజ్–1 వారిని గుర్తించి పరీక్షలకు పంపించాలన్నారు. మిర్యాలగూడలో మోడల్ స్కూల్‌లో క్వారంటైన్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్పీ రంగనాథ్ మాట్లాడుతూ వలస కార్మికులకు పోలీస్, రెవెన్యూ శాఖల ద్వారా చేపట్టిన ఆహారం, వసతులను అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్టుల వద్ద పరిస్థితిపై సూచనలు చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్నారు. కార్డన్ ఆఫ్ జోన్ ప్రాంతాలో పాలు, నిత్యావసర వస్తువుల పంపిణీని ఎస్ఐ స్థాయి అధికారి పరిశీలించి మైక్‌ల ద్వారా అక్కడి ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఆర్డీఓలు జగదీశ్‌రెడ్డి, రోహిత్‌సింగ్, వాసుచంద్ర, డీఎస్పీలు వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు, మార్కెటింగ్ ఏడీ ప్రసాద్ పాల్గొన్నారు.



### చింతపల్లిలో భారీ వర్షం

**చింతపల్లి :** మండలంలో మంగళవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొనడంతో పాటు గ్రామాల్లో చెట్లు కూలి రోడ్లపై పడ్డాయి.

### దండం పెడతాం..



**చండూరు :** కరోనా వ్యాధికి దూరంగా ఉండాలంటే ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌ను పాటిస్తూ బయటకు రావొద్దని.. మండలంలోని గట్టుప్పలలో ప్రజాప్రతినిధులు దండంపెట్టి గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇడెం రోజా, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఎంపీటీసీ చెరుపల్లి భాస్కర్, ఉపసర్పంచ్ నారని రామలింగం తదితరులు ఉన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
8-4-2020
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్‌ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్‌ | నిఫ్టీ |
|---|---|
| 2476 ▲ | 708 ▲ |
| 30,067 | 8,792 |

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (రాత్రి రెండు రాత్రి 11.30 ముగింపు)

| సూచీ | | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్‌ | 8,066 | ▲ 153 |
| డోజోన్స్‌ | 23,385 | ▲ 712 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 5,704 | ▲ 122 |
| డాక్స్‌ | 10,356 | ▲ 281 |
| షాంఘై | 2,821 | ▲ 57 |
| నికాయ్‌ | 18,950 | ▲ 374 |

అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

## ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| $ | యూఎస్‌ డాలర్‌ | 72.36 | 79.10 |
| £ | బ్రిటన్‌ పౌండ్‌ | 91.28 | 97.81 |
| € | యూరో | 79.95 | 86.26 |
| ¥ | జపాన్‌ ఎన్‌ (100) | 59.00 | 77.00 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్‌ | 45.00 | 49.32 |
| SS | సింగపూర్‌ డాలర్‌ | 51.68 | 55.87 |
| SAR | సౌదీ రియాల్‌ | 19.12 | 20.98 |
| UAE D | యూఏఈ దిర్హామ్‌ | 19.26 | 21.89 |
| ¥ | చైనా యువాన్‌ | 9.59 | 11.35 |

# సెన్సెక్స్‌ 2,476 పాయింట్లు అప్‌

- కరోనా కేసులు, మరణాల్లో తగ్గుదల!
- ప్రపంచ మార్కెట్ల పరుగులు
- బ్లూ చిప్‌షేర్లలో వేల్యూ బయింగ్‌
- 2,476 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్‌
- 30,067 వద్ద ముగింపు
- 708 పాయింట్లు ఎగసిన నిఫ్టీ
- 8,792 వద్ద ముగింపు

"బేర్‌ మార్కెట్లో ఇలాంటి పుల్‌ బ్యాక్‌ లేదా ట్రేడింగ్‌ ర్యాలీలు సహజమే. కోవిడ్‌–19 తీవ్రత నేపథ్యంలో ఆర్థిక పరిస్థితులు పుంజుకోవడానికి ఇంకా కొంత కాలం పడుతుంది."
-నీలేశ్‌ షా, ఎన్‌విజన్‌ క్యాపిటల్‌

సెన్సెక్స్‌, నిఫ్టీలు ఒక్క రోజులో రికార్డ్‌ స్థాయి లాభాలను మంగళవారం సాధించాయి. ఇటలీ, స్పెయిన్‌, అమెరికాల్లో కరోనా వైరస్‌ కొత్త కేసులు, మరణాలు తగ్గడంతో ప్రపంచ మార్కెట్లు లాభపడటం దీనికి ప్రధాన కారణం. ఇటీవల బాగా పతనమై కొనుగోళ్లకు ఆకర్షణీయంగా ఉన్న బ్లూచిప్‌ షేర్లలో వేల్యూ బయింగ్‌ చోటు చేసుకోవడం, ఈ నెల 14 తర్వాత దేశవ్యాప్త లాక్‌డౌన్‌ను దశలవారీగా ఉపసంహరించనున్నారన్న అంచనాలు కలసివచ్చాయి. సెన్సెక్స్‌ 30,000 పాయింట్లకు, నిఫ్టీ 8,750 పాయింట్లపైకి ఎగబాకాయి. అన్ని రంగాల సూచీలు లాభపడ్డాయి. వరుస రెండు సెషన్ల నష్టాలకు మంగళవారం బ్రేక్‌ పడింది.

**'ఒక్క రోజు' రికార్డ్‌ లాభాలు...**

మహావీర్‌ జయంతి సందర్భంగా సోమవారం స్టాక్‌ మార్కెట్‌ పనిచేయలేదు. ఆసియా మార్కెట్ల జోష్‌తో మన మార్కెట్‌ భారీ లాభాలతో ఆరంభమైంది. సెన్సెక్స్‌ 1,307 పాయింట్లు, నిఫ్టీ 362 పాయింట్ల లాభాలతో మొదలయ్యాయి. రోజు గడుస్తున్న కొద్దీ లాభాలు పెరుగుతూనే పోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్‌ 2,567 పాయింట్లు, నిఫ్టీ 735 పాయింట్ల మేర లాభపడ్డాయి. చివరకు సెన్సెక్స్‌ 2,476 పాయింట్ల లాభంతో 30,067 పాయింట్ల వద్ద, నిఫ్టీ 708 పాయింట్లు పెరిగి 8,792 పాయింట్ల వద్ద ముగిశాయి. ఈ రెండు సూచీలు ఒక్క రోజులో ఇన్నేసి పాయింట్లు పెరగడం చరిత్రలో ఇదే మొదటిసారి. ఇక శాతం పరంగా చూస్తే సెన్సెక్స్‌ 8.97 శాతం, నిఫ్టీ 8.76 శాతం చొప్పున ఎగిశాయి. శాతం పరంగా చూస్తే, 2009, మే తర్వాత ఈ రెండు సూచీలు ఒక్క రోజులో ఈ రేంజ్‌లో పెరగడం కూడా ఇదే మొదటిసారి. ఆర్థిక, ఇంధన, వాహన రంగ షేర్లు బాగా పెరిగాయి.

**ఫార్మా షేర్ల పరుగులు...**

24 ఔషధాల ఎగుమతులపై ఉన్న ఆంక్షలను కేంద్రం ఎత్తివేసింది. మొత్తం ఔషధాల ఎగుమతుల్లో వీటి వాటా 10 శాతం మేర ఉంటుందని అంచనా. దీంతో ఫార్మా షేర్లు జోరుగా పెరిగాయి.

## లాభాలకు కారణాలు...

- **కరోనా కేసుల ప్రభావం...**
కరోనా వైరస్‌కు హాట్‌స్పాట్‌లైన ఇటలీ, స్పెయిన్‌, అమెరికాలో ఆదివారం నుంచి కొత్త కేసులు, మరణాలు తగ్గుతూ వచ్చాయి. కరోనా సంక్షోభం తగ్గుముఖం పడుతుందన్న అంచనాలతో కొనుగోళ్లు జోరుగా సాగాయి.
- **లాభాల్లో ప్రపంచ మార్కెట్లు**
సోమవారం ఆసియా, యూరప్‌ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. అమెరికా స్టాక్‌ సూచీలు 6 శాతం మేర ఎగిశాయి. ఈ జోష్‌తో మంగళవారం ఆసియా మార్కెట్లు 2–4 శాతం రేంజ్‌లో, యూరప్‌ మార్కెట్లు 2 శాతం మేర లాభపడటం మన మార్కెట్‌పై సానుకూల ప్రభావం చూపించింది.
- **ఎమ్‌ఎస్‌సీఐలో భారత వెయిటేజీ**
వివిధ కంపెనీల్లో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల పరిమితి పెంచే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తాజాగా నోటిఫై చేసింది. దీంతో ఎమర్జింగ్‌ మార్కెట్‌ ఇండెక్స్‌(ఈఎమ్‌ఐ)లో భారత కంపెనీల వెయిటేజీని ఎమ్‌ఎస్‌సీఐ(మోర్గాన్‌ స్టాన్లీ క్యాపిటల్‌ ఇంటర్నేషనల్‌) పెంచనున్నది. ఫలితంగా భారత కంపెనీల్లో 700 కోట్ల డాలర్ల మేర విదేశీ నిధులు వస్తాయని అంచనా.
- **త్వరలో రెండో ప్యాకేజీ!**
కరోనా వైరస్‌ కల్లోలం, లాక్‌డౌన్‌ విధింపుతో కుదేలైన పారిశ్రామిక రంగాన్ని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఒక ప్యాకేజీని సిద్ధం చేస్తోందన్న వార్తలు.. సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చాయి.
- **బ్యాం'కింగ్‌' సెంటిమెంట్‌..**
బ్యాంక్‌ రుణాల వృద్ధి ఆరోగ్యకరంగా ఉందని, డిపాజిట్లు సౌకర్యవంతమైన స్థాయిలోనే ఉన్నాయన్న నివేదిక బ్యాంక్‌ షేర్ల కొనుగోళ్లకు ఊపునిచ్చింది.
- **దశలవారీగా లాక్‌డౌన్‌ తొలగింపు**
లాక్‌డౌన్‌ ముగిసే ఈ నెల 14 తర్వాత వ్యాపార కొనసాగింపు ప్రణాళికలను సిద్ధం చేయాలని అన్ని మంత్రిత్వ శాఖలను ప్రధాని మోదీ కోరారు. దీంతో దేశవ్యాప్త లాక్‌డౌన్‌ పాక్షికంగా తొలగే అవకాశాలున్నాయన్న అంచనాలు... ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చాయి.
- **వేల్యూ బయింగ్‌**
ఈ ఏడాది గరిష్టం నుంచి సూచీలు 30% పడిన నేపథ్యంలో ఆకర్షణీయ కొనుగోళ్లు.

### సెన్సెక్స్‌ టాప్‌టెన్‌ గెయిన్స్‌




### రూ.7.7 లక్షల కోట్లు ఎగసిన ఇన్వెస్టర్ల సంపద

స్టాక్‌ మార్కెట్‌ భారీ లాభాల కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.7.7 లక్షల కోట్లు ఎగసింది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్‌ క్యాప్‌ రూ.7,71,377 కోట్లు పెరిగి రూ.116.38 లక్షల కోట్లకు చేరింది.

# డన్‌జోతో బ్రిటానియా జట్టు

- గంట వ్యవధిలోనే నిత్యావసరాల హోం డెలివరీ
- త్వరలో హైదరాబాద్‌లో 'బ్రిటానియా ఎసెన్షియల్‌' స్టోర్‌




**న్యూఢిల్లీ:** కరోనా కట్టడి కోసం లాక్‌డౌన్‌ అమలవుతున్న వేళ ప్రజలకు నిత్యావసరాలను అందుబాటులో ఉంచేందుకు పలు ఎఫ్‌ఎంసీజీ సంస్థలు చర్యలు తీసుకుంటున్నాయి. తాజాగా ఆన్‌–డిమాండ్‌ ఈ–కామర్స్‌ ప్లాట్‌ఫాం డన్‌జోతో చేతులు కలిపినట్లు ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం బ్రిటానియా ఇండస్ట్రీస్‌ వెల్లడించింది. ఈ ఒప్పందం కింద డన్‌జో యాప్‌ ద్వారా వినియోగదారులు బ్రిటానియా ఉత్పత్తులను ఇంటి వద్దకే తెప్పించుకోవచ్చు. ఆర్డరు చేసిన గంటలోనే ఉత్పత్తులను అందించేలా చర్యలు తీసుకున్నట్లు ఇరు సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపాయి. ఇందుకోసం బ్రిటానియా ఎసెన్షియల్స్‌ పేరిట బెంగళూరులో మంగళవారం తొలి స్టోర్‌ ప్రారంభించినట్లు బ్రిటానియా ఇండస్ట్రీస్‌ ఎండీ వరుణ్‌ బెర్రీ వివరించారు. త్వరలో హైదరాబాద్‌తో పాటు ముంబై, పుణే, ఢిల్లీ, గురుగ్రామ్‌, జైపూర్‌, చెన్నైలో కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. బిస్కట్లు, కేకులు, రస్కులు, మిల్క్‌షేక్‌లు, నెయ్యి, పాల పౌడరు, వేఫర్లు వంటి ఉత్పత్తులను బ్రిటానియా విక్రయిస్తోంది.

## సిడ్బి నుంచి అత్యవసర రుణాలు

**ముంబై:** చిన్న, మధ్య తరహా సంస్థలకు రూ. కోటి వరకు మూలధన రుణాలుగా అందిస్తున్నట్టు చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (సిడ్బి) మంగళవారం ప్రకటించింది. కరోనా వైరస్‌ కారణంగా అత్యవసర పరిస్థితులకు స్పందనగా 48 గంటల్లోనే ఈ రుణాన్ని అందిస్తామని, ఇందుకు ఎటువంటి తనఖా లేదా హామీ అవసరం లేదని సిడ్బి తెలిపింది. అలాగే, ఎంఎస్‌ఎంఈలకు రుణ సదుపాయాన్ని రూ.2 కోట్ల వరకు పెంచినట్టు పేర్కొంది.

SIDBI
भारतीय लघु उद्योग विकास बैंक
SMALL INDUSTRIES DEVELOPMENT BANK OF INDIA

# కేంద్రానికి అదనంగా రూ.5 లక్షల కోట్లు కావాలి

**కరోనా వల్ల దెబ్బతిన్న ఆర్థిక రంగానికి చేయూత**

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్‌ కారణంగా ఆర్థిక ప్రతికూలతలను అధిగమించేందుకు ప్రజలు, వ్యాపార సంస్థలకు సాయం అందించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం జీడీపీలో 2–2.5 శాతం లేదా రూ.4–5 లక్షల కోట్ల మేర అదనంగా రుణాలు సమీకరించుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి సుభాష్‌చంద్ర గార్గ్‌ పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని మార్కెట్‌ నుంచి కాకుండా ఆర్‌బీఐ నుంచి నేరుగా రుణాల రూపంలో తీసుకోవాలని, ఇందుకోసం ద్రవ్య బాధ్యత, బడ్జెట్‌ నిర్వహణ చట్టం (ఎఫ్‌ఆర్‌బీఎం)ను సవరించాలని గార్గ్‌ సూచించారు. స్వయం ఉపాధి ఆధారిత వ్యాపారాలు, చిన్న వ్యాపారస్థులకు రూ.2 లక్షల కోట్ల మేర సాయం అందించాలని అభిప్రాయపడ్డారు.



### వృద్ధి 2 శాతమే: ఇక్రా

కరోనా ప్రభావంతో 2020–21లో భారత్‌ స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు 2 శాతమే ఉంటుందని ఇక్రా రేటింగ్స్‌ అంచనావేసింది. ''2019–20 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో (జనవరి–మార్చి) భారత్‌ జీడీపీలో వృద్ధిలేకపోగా 4.5 శాతం క్షీణత నమోదయ్యే వీలుంది. అయితే క్రమంగా కోలుకుని 2020–21లో 2 శాతం వృద్ధిని నమోదుచేసుకోవచ్చు'' అని పేర్కొంది.

## కరోనా టీకా తయారీలో ఇండియన్‌ ఇమ్యునోలాజికల్స్‌

**హైదరాబాద్‌:** కరోనా వైరస్‌ టీకా రూపకల్పనలో ఇండియన్‌ ఇమ్యునోలాజికల్స్‌ కూడా పాలుపంచుకుంటోంది. వ్యాక్సిన్‌ పరిశోధన, అభివృద్ధి కోసం ఆస్ట్రేలియాకు చెందిన గ్రిఫిత్‌ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంస్థ వెల్లడించింది. పోలియో వంటి వైరస్‌ల టీకాల రూపకల్పనలో వాడిన కోడాన్‌ డీ–ఆప్టిమైజేషన్‌ టెక్నాలజీ ఉపయోగించి కరోనా వ్యాక్సిన్‌ను రూపొందించనున్నట్లు సంస్థ ఎండీ కే ఆనంద్‌ కుమార్‌ చెప్పారు. పరిశోధన పూర్తయ్యాక భారత్‌లో దశలవారీగా క్లినికల్‌ ట్రయల్స్‌ నిర్వహించనున్నట్లు వివరించారు. జికా వైరస్‌ వ్యాక్సిన్‌ పరిశోధన, అభివృద్ధి కోసం ఇండియన్‌ ఇమ్యునోలాజికల్స్‌ ఇప్పటికే గ్రిఫిత్‌ యూనివర్సిటీతో కలిసి పనిచేస్తోంది.

## సైకిల్‌ ప్యూర్‌ అగరబత్తీస్‌ 1.08 కోట్ల విరాళం

**బెంగళూరు:** ఎన్‌ఆర్‌ గ్రూపులో భాగమైన సైకిల్‌ ప్యూర్‌ అగరబత్తీస్‌ కరోనా వైరస్‌ సంక్షోభ పరిస్థితుల్లో దేశ ప్రజలకు మద్దతుగా నిలిచేందుకు ముందుకు వచ్చింది. పీఎం కేర్స్‌కు రూ.1,08,00,000లను విరాళం ఇస్తున్నట్టు ప్రకటించింది. వైద్య, ఆరోగ్య సిబ్బంది, పోలీసుల రక్షణ కోసం 400కుపైగా ముఖ రక్షణ కవచాలను కూడా ఇచ్చింది. మైసూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి 5 వెంటిలేటర్లను కూడా అందించనున్నట్టు ప్రకటించింది.

## మ్యూచువల్‌ ఫండ్స్‌ చందా వేళల్లో మార్పులు

**మధ్యాహ్నం 12.30–1 గంటల వరకే**




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్త లాక్‌డౌన్‌ పరిస్థితుల కారణంగా మ్యూచువల్‌ ఫండ్స్‌లో రోజువారీ పెట్టుబడులు (సబ్‌స్క్రిప్షన్‌), ఉపసంహరణలు (రిడెంప్షన్‌) వేళల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. డెట్‌, కరెన్సీ మార్కెట్‌ వేళలను ఇటీవలే ఆర్‌బీఐ తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో ఈ మార్పులు చోటు చేసుకోవడం గమనార్హం. మారిన వేళలు ఈ నెల 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు అమల్లో ఉంటాయని అసోసియేషన్‌ ఆఫ్‌ మ్యూచువల్‌ ఫండ్స్‌ ఇన్‌ ఇండియా (యాంఫి) ఓ ప్రకటనలో తెలిపింది. లిక్విడ్‌ ఫండ్స్‌, ఓవర్‌నైట్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేయాలనుకుంటే కటాఫ్‌ టైమ్‌ మధ్యాహ్నం 12.30 గంటలుగా, ఇతర మ్యూచువల్‌ ఫండ్స్‌ పథకాల్లో పెట్టుబడులకు మధ్యాహ్నం 1 గంటగా అమల్లో ఉంటుంది.

# బజాజ్‌ నుంచి ఆరోగ్య సంజీవని పాలసీ

**ఎన్నో సమస్యలకు విస్తృత కవరేజీ**

**పుణే:** బజాజ్‌ అలియాంజ్‌ జనరల్‌ ఇన్సూరెన్స్‌ 'ఆరోగ్య సంజీవని' పేరుతో ఓ ఆరోగ్య బీమా పాలసీని నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఐఆర్‌డీఏఐ నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా తీసుకొచ్చిన పాలసీ ఇదని కంపెనీ పేర్కొంది. అన్ని బీమా సంస్థలు ఓ ప్రామాణిక ఆరోగ్య బీమా పాలసీని తప్పనిసరిగా ఆఫర్‌ చేయాలన్నది ఐఆర్‌డీఏఐ ఆదేశం. అంటే ఈ ప్రామాణిక పాలసీ కింద అన్ని బీమా సంస్థల్లోనూ ఫీచర్లు ఒకే విధంగా ఉంటాయి. బజాజ్‌ అలియాంజ్‌ నుంచి వచ్చిన ఆరోగ్య సంజీవని పాలసీలో కవరేజీ రూ.1–5 లక్షల మధ్య ఉంటుంది. వ్యక్తి తన పేరిట, అలాగే, తన జీవిత భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులు, అత్తమామల పేరిట ఫ్యామిలీ ఫ్లోటర్‌ పాలసీని సైతం తీసుకోవచ్చు. ఆస్పత్రిలో చేరి చికిత్స పొందితే పరిహారాన్ని కంపెనీ చెల్లిస్తుంది.

BAJAJ | Allianz
Relationship Beyond Insurance
Bajaj Allianz General Insurance Co. Ltd.

## ఆన్‌లైన్‌ వేదికగా కోవిడ్‌-19 పాలసీల ఆఫర్లు

**కోల్‌కతా:** కరోనా వైరస్‌ (కోవిడ్‌–19) వ్యాప్తి పరిస్థితులను బీమా సంస్థలు వ్యాపార అవకాశాలుగా మలుచుకుంటున్నాయి. వైరస్‌ నుంచి రక్షణ కల్పించే హెల్త్‌ పాలసీలను మార్కెట్లోకి తీసుకొస్తున్నాయి. ఇందుకోసం డిజిటల్‌ ప్లాట్‌ఫామ్‌లతో ఒప్పందాలు కూడా చేసుకుంటున్నాయి. భారతీ ఆక్సా జనరల్‌ ఇన్సూరెన్స్‌ రెండు రకాల కోవిడ్‌–19 పాలసీలను తీసుకొచ్చింది. ఇందులో ఒకటి కోవిడ్‌ పాజిటివ్‌గా నిర్ధారణ అయితే ఏక మొత్తంలో రూ.25వేల పరిహారం అందించే పాలసీ ఒకటి. మరో పాలసీలో రోజువారీ పరిహారం రూ.500 నుంచి మొదలవుతుంది. ఈ పాలసీల కోసం ఎయిర్‌టెల్‌ పేమెంట్స్‌ బ్యాంకుతో భారతీ ఆక్సా జనరల్‌ ఇన్సూరెన్స్‌ టైఅప్‌ అయింది. అదే విధంగా బజాజ్‌ అలియాంజ్‌ జనరల్‌ ఇన్సూరెన్స్‌ సంస్థ కూడా ఫోన్‌పే భాగస్వామ్యంతో 'కరోనాకేర్‌' పేరిట ఓ పాలసీని ఆఫర్‌ చేస్తోంది. కరోనా కారణంగా ఆస్పత్రి పాలైతే ఈ పాలసీ కింద పరిహారం లభిస్తుంది.

# డీఎల్‌ఎఫ్‌ ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు..




**న్యూఢిల్లీ:** కరోనా వైరస్‌ ప్రతికూల ప్రభావాలతో ప్రభుత్వాల నుంచి కంపెనీల దాకా ఉద్యోగాలు, ఉద్యోగుల జీతాల్లో కోతలు విధిస్తున్న తరుణంలో రియల్టీ దిగ్గజం డీఎల్‌ఎఫ్‌ కాస్త భిన్నంగా తమ సిబ్బందికి ఇంక్రిమెంట్లు ఇస్తోంది. ఏ ఉద్యోగినీ తొలగించబోమని, పైగా ఎల్‌3 గ్రేడ్‌ దాకా ఉన్న సిబ్బందికి వార్షిక ఇంక్రిమెంట్లు కూడా ఇస్తామని వెల్లడించింది. సంస్థలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేసే ఉద్యోగుల నుంచి రోజువారీ కూలీల దాకా అందరికీ మార్చి నెలకు సంబంధించి చెల్లింపులు జరిపేశామని, ఏప్రిల్‌లోనూ చెల్లిస్తామని డీఎల్‌ఎఫ్‌ తెలిపింది. కరోనా వైరస్‌ కట్టడికి సంబంధించిన సహాయక చర్యల కోసం హర్యానా ప్రభుత్వానికి రూ. 5 కోట్లు ఇచ్చినట్లు వివరించింది. అలాగే హైదరాబాద్‌లోని సైబరాబాద్‌ సెక్యూరిటీ కౌన్సిల్‌కు రూ. 5 లక్షలు విరాళం అందిస్తున్నట్లు పేర్కొంది.

### రిటైల్‌లో 80వేల ఉద్యోగాలకు గండం..

**ఆర్‌ఏఐ సర్వేలో వెల్లడి**



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్‌ కట్టడికి సంబంధించి లాక్‌డౌన్‌ అమలవుతుండటంతో రిటైల్‌ రంగంలో సుమారు 80,000 దాకా ఉద్యోగాలకు కోత పడే అవకాశాలు ఉన్నాయి. చిన్న స్థాయి రిటైలర్లు.. తమ సిబ్బంది సంఖ్యను 30 శాతం దాకా తగ్గించుకోనున్నారు. రిటైలర్స్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా (ఆర్‌ఏఐ) నిర్వహించిన సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దాదాపు 3,92,963 మంది సిబ్బంది ఉన్న 768 మంది రిటైలర్లతో ఆర్‌ఏఐ ఈ సర్వే నిర్వహించింది. కరోనా వైరస్‌ మహమ్మారి కారణంగా వారి వ్యాపారాలు, మానవ వనరులపై ప్రభావాల గురించి అభిప్రాయాలు సేకరించి, నివేదిక రూపొందించింది.

### విప్రో ఫలితాలు.. వచ్చే వారం

**కరోనా వైరస్‌ నేపథ్యం!**




**న్యూఢిల్లీ:** ఐటీ దిగ్గజం విప్రో ..గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసిక ఫలితాలను ఏప్రిల్‌ 15న ప్రకటించనుంది. దేశీయంగా స్టాక్‌ మార్కెట్‌ ట్రేడింగ్‌ వేళలు ముగిసిన తర్వాత ప్రకటించనున్నట్లు సంస్థ వెల్లడించింది. కరోనా వ్యాప్తి నేపథ్యంలో కార్పొరేట్ల ఆర్థిక ఫలితాల వెల్లడిలో ఈసారి జాప్యం జరగవచ్చని అంచనాలు ఉన్న నేపథ్యంలో విప్రో ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. కంపెనీలు నాలుగో త్రైమాసిక ఫలితాలు వెల్లడించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ 45 రోజుల వెసులుబాటు ఇచ్చింది. అలాగే, 2019–20 ఆర్థిక సంవత్సర ఫలితాలను వెల్లడికి గడువును నెల రోజులు పొడిగించింది.

## ఇండస్‌ఇండ్‌ బ్యాంకు డిపాజిట్లకు గండి

**న్యూఢిల్లీ:** యస్‌ బ్యాంకులో సంక్షోభం ప్రైవేటు రంగంలోని ఇండస్‌ఇండ్‌ బ్యాంకుపై ప్రతికూల ప్రభావం చూపించింది. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి మధ్య 7 శాతం మేర డిపాజిట్లను బ్యాంకు కోల్పోయింది. యస్‌ బ్యాంకులో డిపాజిట్ల ఉపసంహరణపై మారటోరియంను కొన్ని రోజుల పాటు విధించిన విషయం గమనార్హం. ఈ పరిణామంతో ఆందోళన చెందిన డిపాజిటర్లు ఇండస్‌ఇండ్‌ బ్యాంకు నుంచి కూడా డిపాజిట్లను ఉపసంహరించుకున్నట్టు తెలుస్తోంది.

## మార్చిలో నియామకాలు డౌన్‌

**ముంబై:** దేశవ్యాప్తంగా మూడు వారాల పాటు లాక్‌డౌన్‌ అమలవుతున్న నేపథ్యంలో నియామకాలు గణనీయంగా పడిపోయాయి. గతేడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది మార్చిలో హైరింగ్‌ కార్యకలాపాలు 18 శాతం తగ్గిపోయాయి. ముఖ్యంగా ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్‌లో ఈ ధోరణి ఎక్కువగా ఉందని నౌకరీడాట్‌కామ్‌ నివేదిక పేర్కొంది. నెలవారీ నియామకాల సరళిని తెలియజేసే జాబ్‌స్పీక్‌ సూచీ మార్చిలో 1,954 పాయింట్లకు పరిమితమైనట్లు నౌకరీడాట్‌కామ్‌ తెలిపింది.

### ముడిచమురు... (బ్యారల్‌)

| | రాత్రి 11.30కు | సోమవారం ముగింపు |
|---|---|---|
| నైమెక్స్‌ లైట్‌ స్వీట్‌ | 25.45 | $ 26.08 |
| బ్రెంట్‌ | 32.78 | $ 33.05 |

### కోడిగుడ్లు (హోల్‌సేల్‌ -నెక్‌ /100కు రూ.లలో) 8-4-2020

| | |
|---|---|
| విశాఖ | 345–00 |
| చిత్తూరు | 433–00 |
| వరంగల్‌ | 358–00 |
| గోదావరి | 345–00 |
| విజయవాడ | 345–00 |
| 7–4–2020 ఫామ్‌ ధర... | |
| హైదరాబాద్‌ | 355–00 |

# ఎస్‌బీఐ సేవింగ్స్‌ డిపాజిట్‌ రేట్ల కోత

**న్యూఢిల్లీ:** ఎస్‌బీఐ సేవింగ్స్‌ బ్యాంక్‌ ఖాతాల్లోని డిపాజిట్‌ రేట్లను తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విడుదలైన ప్రకటనలో ముఖ్యాంశాలు...

- సేవింగ్స్‌ డిపాజిట్లపై ప్రస్తుతమున్న 3 శాతం నుంచి 2.75 శాతానికి తగ్గించింది. అన్ని సేవింగ్స్‌ బ్యాంక్‌ డిపాజిట్లకూ ఇది వర్తిస్తుంది. తగినంత ద్రవ్య లభ్యత ఉండడం దీనికి కారణం.

**ఎంసీఎల్‌ఆర్‌ కూడా తగ్గింపు**

- ఏప్రిల్‌ 15 నుంచీ ఇది అమల్లోకి వస్తుంది.
- ఇక నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్‌ఆర్‌)ను కూడా అన్ని కాలపరిమితులకు 35 బేసిస్‌ పాయింట్ల వరకూ తగ్గించింది.
- ఎంసీఎల్‌ఆర్‌ తగ్గింపు రేట్లు ఈ నెల 10వ తేదీ నుంచీ అమల్లోకి వస్తాయి.
- గృహ, వ్యక్తిగత, కార్పొరేట్‌, వాహన రుణాలకు అనుసంధానమయ్యే ఏడాది నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు 7.75 శాతం నుంచి 7.40 శాతానికి తగ్గుతుంది.
- దీనితో ఎంసీఎల్‌ఆర్‌కు అనుసంధానమయ్యే గృహ రుణ చెల్లింపుల విషయంలో 30 సంవత్సరాలకు సంబంధించి లక్షకు ఈఎంఐ దాదాపు రూ.24 తగ్గుతుంది.





# చ్యవన్‌ప్రాశ్ తినండి.. తులసి టీ తాగండి

## రోజువారీ వంటకాల్లో జీరా, వెల్లుల్లి, ధనియాలు తప్పక వాడాలి

- రోజూ ఒకటి– రెండుసార్లు కొబ్బరి/నువ్వుల నూనెతో పుక్కిలింత
- రోగనిరోధక శక్తి పెంపునకు ఆయుష్ ఆయుర్వేద మార్గదర్శకాలు
- విద్యార్థులకు తెలియజేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: 'కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో శరీర సహజ రక్షణ వ్యవస్థను కాపాడుకోవడం ముఖ్యం. అందుకోసం రోగ నిరోధకశక్తిని పెంచుకోవాలి. ప్రకృతిసిద్ధమైన ఆయుర్వేదం అందుకు దోహదపడుతుంద'ని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇందుకోసం రోజువారీ వంటకాల్లో జీలకర్ర, అల్లం, వెల్లుల్లి, ధనియాలు, పసుపు క్రమం తప్పకుండా వినియోగించాలని సూచించింది. రోగ నిరోధకశక్తిని పెంచే వీటి వినియోగాన్ని పెంచడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలుపుతూ ఈ ఆయుర్వేద మార్గదర్శకాలను జారీ చేసింది. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఈ సూచనలను జిల్లాల అధికారులకు పంపింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు వీటిని పాటించాలని పేర్కొంది. ఆరోగ్యం కోసం 'ఆయుష్' సూచిస్తోన్న ఆయుర్వేద సూత్రాలివే..

### శరీర సహజ రక్షణ వ్యవస్థ కోసం..

- గోరువెచ్చని నీటినే తాగాలి. రోజులో ఏ సమయంలోనైనా అవే తాగాలి.
- రోజూ అరగంట పాటు యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయాలి.
- వంటకాల్లో కచ్చితంగా పసుపు, జీలకర్ర, ధనియాలు, వెల్లుల్లి తప్పక వినియోగించాలి. వీటి వినియోగం ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది.

### ఇవి తినండి.. ఆరోగ్యంగా ఉండండి

- విటమిన్లు, ప్రొటీన్లతో కూడిన బలవర్ధక ఆహారం తీసుకోవాలి.
- క్యారెట్, ఆకుకూరలు, కీరా, పండ్లు, కర్బూజ తగినంతగా తీసుకోవాలి.
- ద్రాక్ష, కివీ, కమలాలు, చేపలు, గుడ్లు, పాలు, సోయా, శనగలు, చిక్కుడు గింజలు వంటివి ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

### రోగనిరోధక శక్తి కోసం..

- రోజూ ఉదయమే పది గ్రాముల (ఒక స్పూన్) చ్యవన్‌ప్రాశ్ తీసుకోవాలి.
- హెర్బల్ టీ తాగాలి. లేదా తులసి/దాల్చిన చెక్క/ నల్ల మిరియాలు (బ్లాక్ పెప్పర్) శొంఠి వేసిన డికాషన్ తాగాలి. రుచి కోసం అందులో బెల్లం, నిమ్మరసం వేసుకోవచ్చు. రోజులో ఒకటి– రెండుసార్లు ఎండు ద్రాక్ష తినాలి.
- 150 మిల్లీలీటర్ల వేడి పాలలో అర టీస్పూన్ పసుపు వేసుకొని రోజులో ఒకటి రెండు సార్లు తాగాలి.



### ఇలా చేస్తే ఆరోగ్యభాగ్యం

- నువ్వుల లేదా కొబ్బరినూనె లేదా నెయ్యి చుక్కలు రోజూ ఉదయం, సాయంత్రం ముక్కు రంధ్రాల్లో వేసుకోవాలి.
- నువ్వుల లేదా కొబ్బరి నూనె ఒక స్పూన్ మేర నోట్లో వేసుకోవాలి. 2 – 3 నిమిషాల పాటు దాన్ని పుక్కిలించి ఉమ్మివేయాలి. ఆపై గోరువెచ్చని నీటితో నోటిని శుభ్రం చేసుకోవాలి. ఇలా నిత్యం ఒకటి రెండుసార్లు చేయాలి.
- గొంతుమంట, పొడి దగ్గు ఉంటే ప్రస్తుత పరిస్థితుల్లో వైద్యులను సంప్రదించాలి. సాధారణ ఉపశమనం కోసం పుదీనా ఆకులతో ఆవిరి పట్టుకోవాలి. బెల్లం లేదా తేనెతో లవంగాల పౌడర్ కలుపుకొని రోజూ రెండుసార్లు తాగాలి.

## మాస్కులు కుడుతున్న 'బ్రిటిష్ ఇల్లాలు'



బంజారాహిల్స్: కరోనా వైరస్ నేపథ్యంలో వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండేందుకు మాస్కులు తప్పనిసరిగా ధరించాల్సి ఉండగా కొంతమంది పేదలు వీటికి దూరమవుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని బంజారాహిల్స్ రోడ్ నంబర్–3లో నివసించే బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ హైదరాబాద్ విభాగం అధికారి ఆండ్రుఫ్లెమింగ్ భార్య వ్యాన్‌ఫ్లెమింగ్ గత 3 రోజుల నుంచి మాస్కులు ఉచితంగా అందిస్తున్నారు. నైజీరియన్ క్లాత్‌తో ఆమె ఈ మాస్కులు కుడుతూ తన చుట్టుపక్కల నివసించే పేదలకు పంపిణీ చేస్తున్నారు. ఆమె చేస్తున్న ఈ సేవకు నెటిజన్లు అభినందనలు తెలుపుతున్నారు. ఇప్పటికే ఆమె 300కు పైగా మాస్కులను సొంతంగా కుట్టి పంపిణీ చేశారు.

## 18 నెలలకు సరిపడా ఆహార నిల్వలు

### దక్షిణాది రాష్ట్రాలకు ఆహార ధాన్యాల కొరత లేదన్న ఎఫ్‌సీఐ

సాక్షి, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద పంపిణీ చేసేందుకు 18 నెలలకు సరిపడే ఆహార ధాన్యాల నిల్వలు సిద్ధంగా ఉన్నాయని కేంద్ర ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ప్రకటించింది. తెలంగాణతో పాటు తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో కేంద్ర పథకాలైన ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన, జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అవసరమైన ఆహార ధాన్యాలను సిద్ధం చేశామని తెలిపింది. ఈ మేరకు ఎఫ్‌సీఐ తీసుకుంటున్న చర్యలపై తెలంగాణ రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ విక్టర్ అమల్‌రాజ్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. లాక్‌డౌన్ సమయంలో తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు ఆహారధాన్యాలను సరఫరా చేయడంతో తెలంగాణ రీజియన్ శాఖ విశేష కృషి చేస్తోందని వెల్లడించింది. దీంతోపాటే తెలంగాణ పీడీఎస్ అవసరాలకు బియ్యం సరఫరా చేస్తోందన్నారు.



# మద్యం బదులు శానిటైజర్ల తయారీ

- సామాజిక బాధ్యత పాటిస్తున్న డిస్టిలరీలు
- సీఎస్ఆర్ కింద 40 వేల లీటర్ల సరఫరా
- ఆస్పత్రులు, ఆఫీసులకు అందజేత
- డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలకు అనుగుణంగా తయారీ

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్ కట్టడికి ప్రైవేటు సంస్థలు ముందుకొచ్చాయి. ఇన్నాళ్లు ప్రజలకు కిక్కిచ్చే మద్యాన్ని తయారు చేసిన డిస్టిలరీలు ఇప్పుడు కరోనా ముప్పు దరి చేరకుండా 'సామాజిక బాధ్యత'ను పాటిస్తున్నాయి. మద్యం బదులు శానిటైజర్లను తయారు చేసి ప్రభుత్వానికి చేయూత అందిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో వీటి లభ్యత అంతంతగానే ఉంది. ఈ కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం డిస్టిలరీలను శానిటైజర్ల ఉత్పత్తుల తయారీకి మళ్లించింది. హ్యాండ్ వాష్ శానిటైజర్ల తయారీకి డిస్టిలరీల సేవలను వాడుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. లాక్‌డౌన్‌తో ప్రస్తుతం మద్యం ఉత్పత్తులను నిలిపివేసినందున.. దీని స్థానంలో శానిటైజర్లను తయారు చేసేలా చూడాలని రాష్ట్ర సర్కారును ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన రాష్ట్ర ప్రభుత్వం.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద శానిటైజర్లను తయారు చేయాలని డిస్టిలరీల యాజమాన్యాలను కోరింది. సానుకూలంగా స్పందించిన మద్యం తయారీ సంస్థలు ఇప్పటివరకు 40 వేల లీటర్ల మేర రాష్ట్ర వైద్య సదుపాయాల కల్పనాభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఐడీసీ)కు సరఫరా చేసింది. వీటిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రమాణాలకు అనుగుణంగా తయారుచేస్తోంది.

**కరోనా నివారణ దళానికే ప్రాధాన్యం..**

సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లోని 18 డిస్టిలరీలు శానిటైజర్లను తయారు చేసి టీఎస్ఎంఐడీసీకి అందజేశాయి. అక్కడి నుంచి ప్రభుత్వ ఆస్పత్రులు, కార్యాలయాలు, పారిశుద్ధ్య సిబ్బంది, పోలీసులకు పంపిణీ చేసినట్లు సంగారెడ్డిలోని ఓ డిస్టిలరీ ప్రతినిధి 'సాక్షి'కి తెలిపారు. మొదటి దశలో ఇచ్చిన ఇండెంట్ మేరకు సరఫరా చేశామని, ప్రభుత్వం ఆదేశిస్తే అధిక సామర్థ్యంలోనూ శానిటైజర్లను తయారీ చేసి అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

### శానిటైజర్ తయారీ ఇలా..

పది లీటర్ల శానిటైజర్ తయారీలో.. 8,333 మిల్లీ లీటర్ల ఇథనాల్, 417 మి.లీటర్ల హైడ్రోజెన్ పెరాక్సైడ్, 145 మి.లీటర్ల గ్లిజరాల్, 1,105 మి.లీటర్ల డిస్టిల్ వాటర్‌ను వాడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా శానిటైజర్‌లో మిశ్రమాలను కలుపుతున్నారు.

## బార్ కౌన్సిల్ చైర్మన్ ఉదారత

సాక్షి, హైదరాబాద్: లాక్‌డౌన్‌తో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న న్యాయవాదులకు ఆర్థికంగా చేయూత ఇవ్వాలని తెలంగాణ బార్ కౌన్సిల్ నిర్ణయించింది. బార్ కౌన్సిల్ వద్ద తగినంతగా నిధులు లేనందున తన వంతుగా రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్ణయించినట్లు కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి ప్రకటించారు. మిగిలిన బార్ కౌన్సిల్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, హైదరాబాద్‌లోని ఇతర కోర్టుల్లోనూ రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో పనిచేసే సీనియర్ న్యాయవాదులు తదితరులంతా ఈ నెల 20లోగా సాయం అందజేయాలని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. సాయం చేసే న్యాయవాదులు 'ఇండిజెంట్ అండ్ డిసేబుల్డ్ అడ్వొకేట్స్ ఫండ్' కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా నెంబర్: 38170396685, ఐఎఫ్ఎస్ఈ కోడ్: ఎస్‌బీఐఎన్0020896కు పంపాలన్నారు.

## సీఎం సహాయ నిధికి ఒక రోజు జీతం

సాక్షి, హైదరాబాద్: కరోనా కష్టాల నేపథ్యంలో ఒక రోజు మూల వేతనాన్ని సీఎం సహాయ నిధికి చెల్లించాలని రాష్ట్ర జ్యుడీషియల్ ఎంప్లాయీస్ నిర్ణయించినట్టు తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మొత్తాన్ని హైకోర్టు చీఫ్ జస్టిస్ రిలీఫ్ ఫండ్ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపుతామన్నారు.

## నిమ్స్ ఓపీ సేవలు షురూ



సాక్షి, హైదరాబాద్: నిజామ్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో అవుట్ పేషెంట్ (ఓపీ) సేవలు మంగళవారం నుంచి మొదలయ్యాయి. దేశంలో అమలవుతున్న లాక్‌డౌన్ కారణంగా గత కొంతకాలంగా బోసిపోయినట్లున్న ఆస్పత్రికి మళ్లీ రోగుల రాక మొదలైంది. రవాణా సదుపాయం లేకపోవడం ఒక కారణమైతే..నిమ్స్‌లో కరోనా అనుమానితులకు ప్రత్యేక వార్డును ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారంతో చాలామంది ఆస్పత్రికి రావడానికి భయపడిన పరిస్థితి. ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిమ్స్‌ను నాన్–కరోనా ఆస్పత్రిగా ప్రకటించింది. దీంతో ఊపిరిపీల్చుకున్న రోగులు నిమ్స్‌కు రావడం మొదలు పెట్టారు. అందుకు అనుగుణంగా ఆస్పత్రి యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. సాధారణంగా అవుట్ పేషెంట్ విభాగాలను పాత భవనంలో ఓపీ బ్లాక్‌లోనూ, స్పెషాలిటీ బ్లాక్‌లోనూ నిర్వహిస్తారు. ప్రస్తుతం అన్ని ఓపీ సేవలను ఒక దగ్గరే నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

**మిలీనియం బ్లాక్‌లో స్క్రీనింగ్ టెస్ట్..**

ఓపీ సేవల కోసం వచ్చిన ప్రతిరోగికి ముందుగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. కరోనా లక్షణాలు లేవని నిర్ధారించుకున్నాకే ఓపీ కార్డులను జారీ చేస్తున్నారు. ఈ టెస్ట్‌లో ఎలాంటి అనుమానం కలిగినా వెంటనే వారిని గాంధీ ఆస్పత్రికి సిఫార్సు చేస్తున్నారు. ఇలా మంగళవారం 280 మందికి స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించారు. అందులో తొమ్మిది మందిలో కరోనా వైరస్ లక్షణాలున్నట్టు అనుమానిస్తూ ఆయా రోగులను గాంధీకి తరలించినట్టు సమాచారం. గతంలో ఇద్దరు వైద్యులకు కరోనా వైరస్ లక్షణాలు కన్పించిన నేపథ్యంలో ఈ విధమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది.

# జన.. ఘన..నగరాలు!

- ప్రపంచంలో అత్యంత జన సాంద్రత ఉన్నవాటిలో మన 'మెట్రో'లు
- మొదటి స్థానంలో ముంబై.. రెండో స్థానంలో కోల్‌కతా
- 8వ స్థానంలో చెన్నై, 13వ స్థానంలో ఢిల్లీ... 24వ స్థానంలో హైదరాబాద్
- ఇప్పటికే మన మెట్రో సిటీల్లో అధిక కరోనా కేసులు.. మరిన్ని పెరిగే ప్రమాదం
- లాక్‌డౌన్ కొనసాగింపే మేలంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: గుంపులు.. సమూహాలుగా జన సంచారం.. ఇసుకేస్తే రాలనంత జనం... మాల్ అయినా.. హోటల్ అయినా ఎటు చూసినా ఇదే పరిస్థితి. ప్రపంచంలో అత్యంత జన సాంద్రత కలిగిన నగరాలన్నీ మన దేశంలోనే ఉన్నాయి. కరోనా మహమ్మారి మానవాళికి పెనుసవాలు విసురుతున్న ఈ తరుణంలో మన మెట్రో నగరాల్లో ఒక్కసారిగా లాక్‌డౌన్ ఎత్తేస్తే... అంత మంది జనాన్ని అదుపుచేసే యంత్రాంగం... వైరస్‌ను కట్టడిచేసే వ్యూహం... కరోనా రక్కసికి చిక్కి విలవిల్లాడే వారికి సకాలంలో వైద్య సదుపాయాలు అందించే పరిస్థితి మనకుందా అన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ మాయదారి వైరస్ అదుపులోకి వచ్చే వరకు దశలవారీగా లాక్‌డౌన్ కొనసాగిస్తేనే మేలని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం మన మెట్రో నగరాల్లో రోజురోజుకూ పదుల సంఖ్యలో కరోనా కేసులు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**కరోనా కరాళ నృత్యమే...**

సిటీ మేయర్స్ సంస్థ గణాంకాల ప్రకారం.. ప్రపంచంలో అత్యంత జనసాంద్రత ఉన్న నగరం ముంబై. ఇది 484 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించింది. ప్రతి చదరపు కిలోమీటర్‌కు ఉన్న జనసాంద్రత 29,650. ఇక రెండో స్థానంలోని కోల్‌కతా విస్తీర్ణం 531 చ.కి.మీ. కాగా.. జనసాంద్రత 23,900. ఇక మన పొరుగునే ఉన్న చెన్నై ఈ జాబితాలో 8వ స్థానంలో ఉంది. ఈ సిటీ విస్తీర్ణం 414 చ.కి.మీ. కాగా జనసాంద్రత 14,350. దేశ రాజధాని ఢిల్లీది ఈ జాబితాలో 13వ స్థానం. ఈ నగర విస్తీర్ణం 1295 చ.కి.మీ. కాగా జనసాంద్రత 11,050. ఇక 19వ స్థానంలోని బెంగళూరు సిటీ విస్తీర్ణం 534 చ.కి.మీ. కాగా జనసాంద్రత 10,100. ఈ జాబితాలో 24వ స్థానంలో ఉన్న గ్రేటర్ హైదరాబాద్ నగరం విస్తీర్ణం 625 చ.కి.మీ. కాగా జనసాంద్రత 9,100. అంటే ప్రపంచంలో అత్యంత జన రద్దీ సిటీలుగా మన నగరాలే అగ్ర ర్యాంకుల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్ ఒక్కసారిగా ఎత్తేస్తే జనబాహుళ్యంలో కరోనా వైరస్ కరాళ నృత్యం చేస్తుందన్న ఆందోళనలు వ్యక్తమౌతున్నాయి.

**పెరుగుతోన్న వైరస్ కేసులు...**

ఇక మెట్రో నగరాల్లో లాక్‌డౌన్ కట్టుదిట్టంగా అమలు చేస్తున్నప్పటికీ కరోనా కేసులు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. జిల్లాలతో పోలిస్తే మహానగరాలకే వైరస్ ముప్పు పొంచి ఉందని ఈ విషయం స్పష్టం చేస్తోంది. పలు చోట్ల లాక్‌డౌన్ నిబంధనలను ఆయా నగరాల్లో సిటిజన్లు తరచూ ఉల్లంఘిస్తుండటం, అవసరమైన జాగ్రత్తలు తీసుకోకపోవడమే దీనికి ప్రధన కారణం. ఇక, కరోనా కేసులు అత్యధికంగా నమోదవుతున్న మెట్రో సిటీల్లో ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, చెన్నై అగ్రస్థానంలో ఉండగా, పుణే, కోల్‌కతా, బెంగళూర్ తరువాత స్థానాల్లో ఉన్నాయి.

### అదుపులోకి వచ్చే వరకు లాక్‌డౌన్..

కరోనా కట్టడి అయ్యే వరకు లాక్‌డౌన్ కొనసాగించాలి. కేసులు అత్యధికంగా నమోదైన రెడ్‌జోన్ ప్రాంతాలను గుర్తించి ఏప్రిల్ 14 తరవాత మరింత కట్టుదిట్టంగా లాక్‌డౌన్ అమలు చేయాలి. పారిశ్రామిక వాడలను మినహాయిస్తే ఉత్పాదకత పెరుగుతుంది. ప్రభుత్వంపై భారం తగ్గుతుంది. కొరియాలో ఈ విధానాన్నే అమలు చేస్తున్నారు.

– పద్మనాభ రెడ్డి, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

## కోర్టులకు వేసవి సెలవులు రద్దు

- 30 వరకు అత్యవసర కేసులే విచారణ
- జిల్లా, ఇతర కోర్టులకు కూడా వర్తింపు



సాక్షి, హైదరాబాద్: హైకోర్టు, జిల్లా కోర్టులు ఈ నెల 30 వరకూ అత్యవసర కేసుల్ని మాత్రమే విచారించాలని ఫుల్ కోర్టు నిర్ణయించింది. దేశవ్యాప్తంగా ఈ నెల 14వరకూ లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో అత్యవసర కేసుల్ని14వ తేదీ వరకు మాత్రమే విచారించాలని గతంలో హైకోర్టు నిర్ణయించింది. తాజాగా మంగళవారం న్యాయమూర్తులంతా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై ప్రస్తుత విధానాన్ని ఈ నెల 30వ తేదీ వరకూ పొడిగించాలని నిర్ణయించారు. ప్రతి సోమ, బుధ, శుక్రవారాలు అత్యవసర కేసుల్ని వీడియో కాన్ఫరెన్స్ మాత్రమే విచారణ చేస్తున్న విధానం ఇక నెలాఖరు వరకూ కొనసాగుతుంది. కరోనా నేపథ్యంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలోని అన్ని కోర్టులకు వేసవి సెలవులను రద్దు చేయాలని కూడా హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో హైకోర్టు, జిల్లా కోర్టులు, రాష్ట్రంలోని ఇతర అన్ని కోర్టులు మే1వ తేదీనుంచి జూన్ 5వ తేదీ వరకు పనిచేస్తాయి. హైకోర్టు న్యాయమూర్తులందరూ (ఫుల్‌కోర్టు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమావేశమై ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు రిజిస్ట్రార్ జనరల్ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అమెరికన్లకు థర్మల్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్న సిబ్బంది

# శంషాబాద్‌లో ప్రత్యేక సేవలు

- అత్యవసర సేవలందిస్తున్న శంషాబాద్ ఎయిర్‌పోర్ట్
- అమెరికాకు ఎయిర్ ఇండియా స్పెషల్ ఫ్లైట్
- 99 మంది అమెరికన్ల తరలింపు



సాక్షి, హైదరాబాద్: కరోనా సృష్టిస్తోన్న విపత్కర పరిస్థితుల్లోనూ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రత్యేక సేవలను అందజేస్తోంది. వివిధ ప్రాంతాలకు నిత్యావసర వస్తువులను సరఫరా చేయడంతో పాటు హైదరాబాద్‌లో చిక్కుకుపోయిన ప్రయాణికులను వారి దేశాలకు చేరవేస్తోంది. లాక్‌డౌన్ ఎత్తివేస్తే దేశీయ విమానాల రాకపోకలకు సైతం ఎయిర్‌పోర్టు పూర్తిగా సన్నద్ధమైంది. ఈదిశగా ఇప్పటికే పలు ఎయిర్‌లైన్స్ దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య విమాన సర్వీసులను నడిపేందుకు బుకింగ్ సేవలను ప్రారంభించిన సంగతి తెలిసిందే.

**హైదరాబాద్ టు అమెరికా..**

లాక్‌డౌన్‌తో హైదరాబాద్‌లో చిక్కుకుపోయిన 99 మంది అమెరికన్లను తీసుకుని ప్రత్యేక విమానం మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరింది. అమెరికా కాన్సులేట్, తెలంగాణ ప్రభుత్వం సమన్వయంతో దీనిని ఏర్పాటు చేశారు. ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ 1617–ఏ–320 విమానం ముంబై నుంచి బయల్దేరి మధ్యాహ్నం 3.20కి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. 99 మంది ప్రయాణికులకు థర్మల్ పరీక్షలు, ఇమిగ్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి విమానంలోకి పంపారు.4.15 గంటలకు ఇక్కడి నుంచి తిరిగి ముంబైకి బయల్దేరింది. అక్కడున్న మరికొందరు ప్రయాణికులతో అమెరికాకు వెళ్లనుంది.

**ప్రత్యేక సేవల్లో ఎయిర్‌పోర్టు**

12ఏళ్ల పాటు నిరంతరాయంగా సేవలందిస్తోన్న హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం మొట్టమొదటిసారి లాక్‌డౌన్ కారణంగా సాధారణ సేవలను నిలిపివేసింది. కానీ కార్గో సేవలు కొనసాగుతున్నాయి. మార్చి 31న ఎయిరిండియా ప్రత్యేక విమానం ద్వారా 38 మంది జర్మన్లను వారి స్వదేశానికి తరలించారు. మార్చి 28న ఇండిగోకు చెందిన ప్రత్యేక మెడికల్ ఎవాక్యుకేషన్ విమానం హైదరాబాద్‌లో దిగి, తన ఎనిమిది మంది సిబ్బందిని హైదరాబాద్‌లో దింపి, ఇక్కడ చిక్కుకుపోయిన ఐదుగురు సిబ్బందితో చెన్నైకు వెళ్లింది. ఫార్మా, ఔషధాలు, ఇతర అత్యవసర సేవలను ఎయిర్‌పోర్టు కొనసాగిస్తోందని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

# ఢిల్లీలో అంతర్జాతీయ ప్రయాణికుల క్వారంటైన్ కష్టాలు

- 14 రోజులు పూర్తయినా కదల్లేని పరిస్థితి
- పలువురు తెలుగువారి నిరీక్షణ

సాక్షి, న్యూఢిల్లీ: అంతర్జాతీయ విమాన సర్వీసుల రాకపోకలను రద్దుచేయడంతో పాటు విదేశాల నుంచి వచ్చిన ప్రయాణికులకు తప్పనిసరి క్వారంటైన్ నిబంధన పెట్టడంతో వారంతా ఢిల్లీలో 14 రోజుల పాటు క్వారంటైన్ పూర్తి చేసుకున్నారు. అయితే దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ఉండడంతో ఎటూ కదల్లేని పరిస్థితి ఏర్పడింది. మార్చి 22 నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులను దేశంలోకి అనుమతించలేదు. అప్పటికే మార్చి 19, 20, 21, 22 ఉదయం వరకు ఢిల్లీలో దిగి, దేశంలో ఇతర ప్రాంతాలకు ప్రయాణించాల్సిన వారందరినీ ఢిల్లీ ఎయిర్‌పోర్టులోనే నిలిపివేసి క్వారంటైన్‌కు తరలించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన రెండు, మూడు వందలమంది ప్రయాణికులున్నట్లు అంచనా. వీరంతా అమెరికా, ఆస్ట్రేలియా, ఇజ్రాయిల్ తదితర దేశాల నుంచి ఢిల్లీ చేరుకున్నారు. ఇక్కడి నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖ చేరుకోవాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఆదేశాలతో క్వారంటైన్ సెంటర్లలో కొందరు చేరిపోగా.. 14 రోజులపాటు తాము ఖర్చు భరించగలమనుకున్నవారు ప్రభుత్వం సూచించిన మూడు ప్రైవేట్ హోటళ్లలో చేరారు. 14 రోజుల పాటు ఒక్కొక్కరు వసతి కోసం దాదాపు రూ.53 వేల వరకు చెల్లించారు. 14 రోజులు పూర్తయిన తర్వాత ప్రభుత్వం వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించి, సమీపంలో ఉన్న హోటళ్లకు గానీ, లేదా ఢిల్లీలో ఉన్న బంధువులను గానీ ఆశ్రయించాలని ఆదేశించింది. దీంతో చేసేది లేక సమీపంలోని ప్రైవేట్ హోటళ్లలోకి చేరుకున్నారు. తొలుత 14 రోజులకు సిద్ధపడగా.. ఇప్పుడు లాక్‌డౌన్ కారణంగా ఈనెల 15 వరకు తప్పనిసరిగా ఉండాల్సి వచ్చింది. ఆ తర్వాత కూడా తాము తమ గమ్యస్థానాలకు చేరుకుంటామో లేదోనన్న ఆందోళనలో వారంతా ఉన్నారు. దీనిపై ఢిల్లీలోని ఏపీ, తెలంగాణ భవన్‌ల అధికారులను సంప్రదించగా.. హోం శాఖ నుంచి ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని జవాబు వచ్చినట్లు ఈ ప్రయాణికులు తెలిపారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డికి కూడా సమాచారం ఇచ్చామన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com